

శతారుణ గీతాంజలి
రూ॥180/-
పేజీలు:180
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★



జైళ్ల పరిస్థితులపై సమగ్ర వివరాలు పంపండి
రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు 'సుప్రీం' ఆదేశాలు

న్యాయ వ్యవస్థ బలోపేతానికే ఎఐ
భర్తీ చేయడానికి కాదు...
సిజెఐ జస్టిస్ సూర్యకాంత్ 05



సంపుటి 09, సంచిక: 112 | సోమవారం | 23-03-2026 | ఖమ్మం Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00


# ఎన్నికలప్పుడే రాజకీయాలు

## సంక్షేమం.. అభివృద్ధే లక్ష్యాలు

- సిద్దిపేట ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇస్తాం
- రైతును రాజు చేయటమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం
- ఎటిసి సెంటర్లలో శిక్షణ పొందిన వారికి ఉద్యోగం
- రైతు సంక్షేమం కోసం ప్రతి నెలా రూ.5,500 కోట్లు వెచ్చిస్తున్నాం
- రైతు భరోసా తొలివిడుత రూ.3,600 కోట్లు విడుదల చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి





ప్రజాపక్షం/ సిద్దిపేట

ఎన్నికలప్పుడే రాజకీయాలని.. తర్వాత అభివృద్ధి.. ప్రజాసంక్షేమమే తమ ధ్యేయమని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలను సమదృష్టితో చూస్తున్నామని.. ఏ ప్రాంతంపై వివక్ష చూపటం లేదని అన్నారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు నిధులు ఇవ్వటం లేదని తప్పుడు ప్రచారం చేస్తున్నారని.. అన్ని నియోజక వర్గాలకు ఇచ్చినట్లుగానే సిద్దిపేట, గజ్వేల్, సిరిసిల్లా నియోజకవర్గాలకు నిధులు ఇచ్చానని. ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చినట్లు సిఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. సిద్దిపేట అభివృద్ధి ఉంటే వివక్ష ఉంటే 300 కోట్లతో నర్మెట్టలో నిర్మించిన అయిల్ పామ్ ప్యాక్టరీని కొడంగల్‌కు తరలించేవారినన్నారు. బిఆర్‌ఎస్ అధికారంలో నున్నప్పుడు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలను విస్మరించి సిద్దిపేట, సిరిసిల్లా, గజ్వేల్ నియోజక వర్గాలకు పెద్దపీట వేశారన్నారు. బిఆర్‌ఎస్ పాలనలో కొడంగల్ నియోజక వర్గాని ఎన్ని నిధులు కేటాయించారో లేక్కలు చూసుకోవచ్చనని. సిఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. సిద్దిపేట నియోజకవర్గంలో గత 40 ఏళ్లుగా ఒకే కుటుంబం పాలిస్తుందని.. ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్నారు. 2029లో బిఆర్‌ఎస్ అధికారంలోకి వస్తుందని కొందరు నాయకులు కలలు కంటున్నారని. 2029లోను మళ్లీ తామే వస్తామని సిఎం సంపూర్ణ విశ్వాసం వ్యక్తం చేశారు. సిద్దిపేట నియోజకవర్గంలోను విజయం సాధిస్తామని... గెలిచిన ఎమ్మెల్యేకు తప్పక మంత్రి పదవి ఇస్తామని రేవంత్‌రెడ్డి వెల్లడించారు. సిద్దిపేటలో ఎమ్మెల్యే కోసం ఫ్యాక్టరీ కట్టలేదని, ప్రజల కోసం ఫ్యాక్టరీని నిర్మించినట్లు తెలిపారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలో రైతుఉత్సవాల్లో భాగంగా 300 కోట్లతో నిర్మించిన అయిల్‌పామ్ ఫ్యాక్టరీని సిఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. అలాగే మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నంప్రభాకర్, దామోదర రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామిలతో కలసి తరువాయి 2లో



ఆరుట్ల వెంకట లక్ష్మీనరసింహారెడ్డి

# కన్నుమూత

## సిపిఐ నాయకుల ఘన నివాళి

ప్రజాపక్షం/హయత్ నగర్

తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, సిపిఐ సీనియర్ నాయకుడు కామ్రేడ్ ఆరుట్ల లక్ష్మీనరసింహారెడ్డి (ఆరుట్ల రామచంద్రారెడ్డి సోదరుడు) మనవడు ఆరుట్ల వెంకట లక్ష్మీనరసింహ రెడ్డి శనివారం అనారోగ్యంతో కన్నుమూశారు. ఆదివారం మన్సూరాబాద్‌లోని ఆయన స్వగృహంలో ఉన్న పార్థివ దేహానికి సిపిఐ రాష్ట్ర, జాతీయ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం హాజరై ఆరుట్ల కుటుంబం ఎర్రజెండాకు, బడుగు బలహీన వర్గాలకు చేసిన సేవలను గుర్తుచేసుకుని, వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ కార్యక్రమం సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటీ నర్సింహా, సీనియర్ నాయకులు ఉజ్జయిని రత్నాకర్,రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్ర చారి, సమితి సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి, రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్ రెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్, సిపిఐ అబ్దుల్లాపూర్‌మెట్ కార్యదర్శి అజ్మీరా హర్సింగ్ నాయక్, ఎఐఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సామిడి వంశి వర్ధన్ రెడ్డి, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు బొంగు అరుణ్ కుమార్ గౌడ్, సిపిఐ హయత్ నగర్ సహాయ కార్యదర్శి మర్రి శోభన్, డిహెచ్పిఎస్ నియోజకవర్గ కార్యదర్శి పాల్వాయి సురేందర్, ఏఐటియుసి హయత్ నగర్ కార్యదర్శి గోల్కొండ నాగరాజు తో పాటు తదితరులు పెద్ద ఎత్తున హాజరై ఘనంగా నివాళులు అర్పించారు.

వ్యవసాయ రంగం పణంగా

# వాణిజ్య ఒప్పందం

## 'ది గ్రేట్ బిట్రేయల్' పుస్తకావిష్కరణలో డి.రాజా

**న్యూఢిల్లీ:** దేశ ప్రయోజనాలు, సార్వభౌమాధికారంతో ప్రధాని మోదీ రాజీ పడుతున్నారని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా విమర్శించారు. యా వత్ రైతాంగాన్ని, వ్యవసాయ రంగాన్ని పణంగా పెట్టేసి అమెరికాతో వాణిజ్య ఒప్పందం చేసుకున్నారని దుయ్యబట్టారు. న్యూఢిల్లీలోని సిపిఐ కేంద్ర కార్యాలయం అజయ్ భవన్‌లో అఖిలభారత కిసాన్ సభ అధ్యక్షుడు రాజన్ క్షీరసాగర్ రచించిన 'ది గ్రేట్ బిట్రేయల్: మోదీ గవర్నమెంట్స్ ట్రేడ్ డీల్ విత్ అమెరికా ఏ కంప్లీట్ సరెండర్'ను డి.రాజా ఆవిష్కరించారు. రైతాంగానికి వెన్నుపోటు పొడిచి, వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టి, అమెరికాకు మోదీ ప్రభుత్వం దాసోహమైనట్లు రాజా విమర్శించారు. మోదీ ప్రభుత్వ రైతు వ్యతిరేక, ప్రజా వ్యతిరేక, కార్మికకర్షక వ్యతిరేక చర్యలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. రాజన్ క్షీరసాగర్ రాసిన ఈ పుస్తకం భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందం వెనుక వాస్తవికలు, రైతాంగంపై ప్రభావాన్ని సూచిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్థిక వేత్త డాక్టర్ అరున్ కుమార్, సిపిఐ కార్యదర్శులు బికె కాంగో, గిరీశ్ శర్మ, ఎఐకెఎస్ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య పాల్గొన్నారు.

# 'ఎగ్జిక్యూటివ్' చెప్పుచేతల్లో సిఇసి

## జ్ఞానేష్‌కుమార్ తొలగింపునకు ఇచ్చిన నోటీసులో విపక్షాల ఆరోపణలు

**న్యూఢిల్లీ :** ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేష్‌కుమార్‌పై ప్రతిపక్షపార్టీ ఎంపీలు ప్రవేశ పెట్టిన నోటీసులో తీవ్రస్థాయి ఆరోపణాస్త్రాలు సంధించారు. ఆయన 'కార్యనిర్వాహకవర్గం' (ఎగ్జిక్యూటివ్) చెప్పు చేతల్లో నడుచుకుంటున్నారని విమర్శించారు. ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ ద్వారా ఆయన ఓటు హక్కు హరణకు కారణమవుతున్నారని ఆక్షేపించారు. అంతేకాకుండా ఆయన నియామకంపై అనేక ప్రశ్నలను లేవనెత్తారు. మార్చి 12న పార్లమెంట్ ఉభయ సభలలో సమర్పించిన నోటీసులలో



ప్రధాన ఎన్నికల కమిషనర్‌పై 'నిరూపితమైన దుష్ప్రవర్తన' ఆధారంగా ఏడు అభియోగాలనే ప్రస్తావించారు. ఆయనను తరువాయి 2లో



# ఇది ఉద్యమ నామ సంవత్సరం

## ఈ ఏడాదంతా ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటం కొనసాగించేందుకు సిపిఐ సిద్ధం

### సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి

ప్రజాపక్షం/సూర్యాపేట

ఇది ఉద్యమ నామ సంవత్సరం అని, ఈ ఏడాదంతా ప్రజా సమస్యల పైన సిపిఐ రాజీలేని పోరాటం కొనసాగించేందుకు సిద్దంగా ఉండాలని సిపిఐ జాతీయ కార్యదర్శి, మునుగోడు మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి సిపిఐ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయం బొమ్మగాని ధర్మబిక్షం భవన్‌లో జరిగిన పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. ఏప్రిల్ ఒకటవ తేదీ నుండి 10వ తేదీ వరకు గడప గడపకు సిపిఐ పేరుతో తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి ఇంటికి సిపిఐ కార్యకర్తలు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. ముఖ్యంగా స్థానిక సమస్యలపై దృష్టి సారించాలని, పంటలు ఎండిపోకుండా రైతులకు నీరు అందేలా అధికారులతో మాట్లాడి వారి ఇబ్బందులను తొలగించాలని, ఎన్నికల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకై ప్రజలను సమీకరించి సంబంధిత అధికారులకు వినతిపత్రాలు ఇప్పించాలని, కొత్తగా రెండు లక్షల రేషన్‌కార్డులు, మరో రెండు లక్షల మందికి పెన్షన్లు తరువాయి 12లో

భవన నిర్మాణ నిబంధనల్లో

# భారీ మార్పులు

## టిడిఆర్ వినియోగం ఇక మరింత సరళం !



ప్రజాపక్షం/హైదరాబాద్

భవన నిర్మాణ నిబంధనలలో రాష్ట్ర ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. తెలంగాణలో నిర్మాణ రంగాన్ని మరింత క్రమబద్ధీకరించేందుకు, రియల్ ఎస్టేట్ రంగానికి ఊతమిచ్చేలా ప్రభుత్వం మార్పులు చేసింది. బదిలీ చేయగల అభివృద్ధి హక్కులు(ట్రాన్స్‌ఫర్ డెవప్‌మెంట్ రైట్స్ టిడిఆర్) వినియోగంపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు విడుదల చేసింది. 'తెలంగాణ బిల్డింగ్ రూల్స్ 2012'కు కీలక సవరణలు చేస్తూ జి.ఓ 95ను విడుదల చేసింది. మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ పేరుతో వెలువడిన ఈ జి.ఓలో టిడిఆర్ వినియోగం, హైరైజ్ భవనాల గుర్తింపు, సెట్‌బ్యాక్ సడలింపులపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ అయ్యాయి. ఈ కొత్త నిబంధనలు తక్షణమే అమలులోకి రానున్నాయి. 10 అంతస్తులకు పైగా నిర్మించే భవనాల్లో టిడిఆర్ వినియోగాన్ని తప్పనిసరి చేసింది. 20 అంతస్తులకుపైగా ఉన్న భవనాలకు తరువాయి 2లో

# హైదరాబాద్‌పై ఎన్ఐఎ చూపు

## అమెరికా, ఉక్రేన్ ఉగ్రవాదులతో బర్మా యువకుల లింక్‌పై ఆరా



ప్రజాపక్షం/హైదరాబాద్

జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) హైదరాబాద్‌పై ప్రత్యేక దృష్టి సారించింది. ఇటీవల ఢిల్లీ, కోల్‌కత్త, లక్నోలలో అమెరికా, ఉక్రేన్‌కు చెందిన ఏడుగురు ఉగ్రవాదులు పట్టుబడడమే ప్రధాన కారణం. హైదరాబాద్‌లో దశాబ్దకాలంగా శరణార్థులుగా జీవిస్తున్న మయన్మార్ (బర్మా) యువకులతో వీరికి ఏదైనా లింక్ ఉందా అనే విషయంపై ఎన్ఐఎ ఆరా తీస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అమెరికా, ఉక్రేన్ నుంచి వచ్చిన 14 మంది ఉగ్రవాదుల్లో ఏడుగురు మాత్రమే పట్టుబడగా మిలిగిన ఏడుగురు ఎక్కడికి వెళ్లారనే విషయంపై ఎన్ఐఎ జల్లెడ పడుతుంది. ఈ మేరకు కేంద్ర నిఘా సంస్థలు అన్ని రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. ఈ క్రమంలోనే హైదరాబాద్‌పై ఎన్ఐఎ ప్రత్యేక దృష్టి పెట్టింది. దేశ భద్రతకు ముప్పుగా మారే అంతర్జాతీయ కుట్రను బహిర్గతం చేస్తూ జాతీయ దర్యాప్తు సంస్థ కీలక చర్యలు తరువాయి 2లో

ప్రజలకు భరోసా కల్పించేలా

# బడ్జెట్ రూపకల్పన

## విద్య, వైద్యం, గృహ నిర్మాణానికి ప్రాధాన్యం

### ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్

ప్రజలకు భరోసా కల్పించేలా బడ్జెట్ రూపకల్పన చేసినట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. పుట్టిన బిడ్డ నుంచి చివరి వ్యక్తి వరకు ఏదో ఒక పథకాన్ని అమలు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఆదివారం కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ తాను ప్రజా ప్రతినిధిగా గ్రామాల్లో పర్యటించినప్పుడు, పాదయాత్ర చేసిన సమయంలో, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ సభలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలను గుర్తించి వాటికి పెద్దపీట వేసినట్లు తెలిపారు. ముఖ్యంగా విద్య, వైద్య, గృహ నిర్మాణానికి ప్రాధాన్యత కల్పించినట్లు తెలిపారు. రాష్ట్రంలో నివసించే 1.15 కోట్ల కుటుంబాలకు ఐదు లక్షల బీమా సౌకర్యాన్ని కల్పిస్తూ పథకాన్ని రూపొందించామన్నారు. కుటుంబ పెద్ద మరణిస్తే సామాజికంగా, ఆర్థికంగా ఆ కుటుంబాన్ని ఆదుకునేలా ఈ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యను అభ్యసించే విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విద్యను తరువాయి 2లో

# 48 గంటలే గడువు

## ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక

- హోర్ముజ్‌ను తెరవకపోతే ఇరాన్ విద్యుత్ కేంద్రాలు నేలమట్టం
- పశ్చిమాసియాలో ఇంధన కేంద్రాల ధ్వంసానికి ఇరాన్ ప్రతిహెచ్చరిక
- ఇజ్రాయెల్ అరద్ నగరంలో విధ్వంసం సృష్టించిన ఇరాన్ క్షిపణులు
- యుద్ధంలో చేరాలని ప్రపంచనాయకులకు నెతన్యాహూ పిలుపు
- క్లస్టర్ బాంబులతో కసిదీరా ఇజ్రాయెల్ పట్టణాలపై దాడులు
- ఐడిఎఫ్ ఎఫ్-16 జెట్‌ను ధ్వంసం చేసిన ఐఆర్‌జిసి



**దుబాయ్ :** హోర్ముజ్ జలసంధిని 48 గంటల్లో తెరవాలని ఇరాన్ ప్రభుత్వానికి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అల్టిమేటం జారీ చేశారు. హోర్ముజ్ జలసంధిని తాను పెట్టిన గడువులోపు వాణిజ్య నౌకల రాకపోకల కోసం తెరవకపోతే ఇరాన్‌లో ఉన్న విద్యుత్ కేంద్రాలన్నింటినీ నేలమట్టం చేస్తామని తరువాయి 12లో



అడవుల సంరక్షణతో

# సుస్థిర భవిష్యత్తు

## స్వచ్ఛమైన ప్రాణవాయువుకు అడవులే మూలాధారం

### ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలి : మంత్రి సీతక్క

ప్రజాపక్షం/ములుగు

అడవుల సంరక్షణతోనే సుస్థిర భవిష్యత్తుకు బలమైన పునాది లభిస్తుందని, స్వచ్ఛమైన ప్రాణవాయువుకు అడవులే మూలాధారంగా ఉంటాయని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మొక్కలను నాటాలని, అడవుల సంరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి అనసూయ సీతక్క తరువాయి 12లో

అసెంబ్లీ సమావేశాల్లో

# బిసి సబ్ ప్లాన్ చట్టం చేయాల్సిందే

## బిసి సంఘాలు, అఖిలపక్ష నేతల డిమాండ్



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర బడ్జెట్‌లో బిసిలకు బిక్షంగా కాకుండా, ఒక హక్కుగా వాటా దక్కాలంటే ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ మాదిరిగా బిసిలకు కూడా చట్టబద్ధమైన సబ్ ప్లాన్ తీసుకురావడానికి తక్షణమే రాష్ట్ర అసెంబ్లీలో బిల్లు పెట్టి ఆమోదించాలని బిసి సంఘాల నేతలు, అఖిలపక్ష పార్టీల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ అధ్యక్షతన హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం 'రాష్ట్ర బడ్జెట్‌లో బిసిల వాటా' అనే అంశంపై సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ ఎల్ రమణ, కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు, బిజెపి ఓబిసి మోర్చా అధ్యక్షులు జి. ఆనంద్ గౌడ్, బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణలు పాల్గొని మాట్లాడారు. జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బిసిల సంక్షేమానికి రూ. 20 వేల కోట్లు కేటాయించాలని, చట్టబద్ధమైన బిసి సబ్ ప్లాన్ తీసుకురావాలని, బిసి విద్యార్థుల ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించడం కోసం రూ. పదివేల కోట్లు బడ్జెట్‌లో కేటాయించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఎల్.రమణ మాట్లాడుతూ 60 శాతం ఉన్న తరువాయి 12లో

02 ప్రజాపక్షం Telugu National Daily
ఖమ్మం సోమవారం 23-03-2026 www.prajapaksham.in





## క్యూబాకు అంతర్జాతీయ సోషలిస్టుల విరాళాలు

### 3 నెలలుగా చమురు బంద్

### కుప్పకూలిన విద్యుత్ వ్యవస్థ.. గాడాంధకారంలో ప్రజలు

**హవానా:** అమెరికా విధించిన తీవ్ర చమురు ఆంక్షల ఫలితంగా క్యూబాలో ఒక్క వారం రోజుల్లోనే రెండోసారి కూడా పవర్‌గ్రిడ్‌లు విఫలమయ్యాయి. దీంతో రాజధాని హవానా నగరం సహా అనేక ప్రాంతాలలో రాత్రివేళ ప్రజలు గాడాంధకారంలో గడుపుతున్నారు. దాదాపు కోటి మంది ప్రజలు, ఇళ్ళు, వ్యాపార కేంద్రాలు, కార్యాలయాలలో విద్యుత్ లేకుండా ఉండిపోయారు. రాత్రివేళ ప్రజలు ఉన్నమేరకూ సెల్‌ఫోన్‌లను రహదారికోసం నేవిగేటర్లుగా ఉపయోగించుకుంటున్నారు. మూడు నెలలుగా క్యూబాకు చమురు సరఫరా నిలిచిపోయింది. 'జాతీయ విద్యుత్ వ్యవస్థ పూర్తిగా నిలిచిపోయింది' అని క్యూబా ఇంధన మంత్రిత్వ శాఖ సోషల్ మీడియా వేదికగా ఒక పోస్టింగ్ పెట్టింది. అమెరికా అనుసరిస్తున్న దాష్టీక విధానాలు,కుట్రలు పూర్తిగా తెలిసిన ప్రజలు కష్టాలను కూడా సుఖాలతో సమానంగా స్వీకరిస్తున్నారు. ఒక గ్రామంలో మోటారు సైకిలు కాంతిలోనే ప్రజలు రాత్రివేళ ఒకచోట గుమిగూడి ఆనందంగా గడిపారు. ఆసుపత్రులు, నీటి సరఫరా వ్యవస్థలతోపాటు కీలకమైన వ్యవస్థలకు ప్రాధాన్యమిస్తూ వాటిని పునరుద్ధరించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు క్యూబా గ్రిడ్ ఆపరేటర్ యుఎన్ఈ ప్రకటించింది. దీంతో క్యూబా దేశాన్ని ఈ కష్టకాలంలో ఆదుకునేందుకు అంతర్జాతీయ సోషలిస్టు బృందాల కూటమి సహాయం చేసేందుకు ముందుకు వచ్చింది. సోలార్ ప్యానల్స్‌తోపాటు వివిధ సహాయ సామాగ్రి తీసుకుని సోషలిస్టు బృందాల కూటమి ఒకటి రాజధాని హవానాకు చేరుకుంది. ప్రాథమిక ఆహార కిట్లు, ఔషధాలను వారు తీసుకువచ్చారు. దుబాఅదేవిధంగా మెక్సికో నుండి కూడా ఒక నౌక విరాళాలు తీసుకుని క్యూబాకు బయలుదేరింది. నుయెస్ట్రా అమెరికా అనేక ఒక సహాయ నౌకాదళం మెక్సికో నుండి బయలుదేరి సోమవారం హవానాకు చేరుకుంటుంది. అంతకుముందు ప్రజలు వేలాదిమంది అమెరికాను వ్యతిరేకిస్తూ గిన్నెలు, చెంబులతో భారీ ప్రదర్శన చేశారు. మరికొన్ని చోట్ల ప్రజల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది.

ఈ ఏడాది జనవరి మూడో తేదీన అమెరికా డెల్టా సైనిక బృందం వెనిజులా అధ్యక్ష భవనంపై దాడిచేసి అధ్యక్షుడు మదురో, ఆయన భార్యను బంధించి నేరస్థులుగా ముద్రవేసి అమెరికాకు తరలించింది. అక్కడేవారు జైలులో ఉన్నారు. అప్పటినుండీ క్యూబాకు చమురు, ఇంధన వనరుల సరఫరాను ట్రంప్ ప్రభుత్వం నిలిపివేసి సమస్యలు సృష్టించడం ప్రారంభించింది. దీంతో క్యూబాలో అనేక వ్యవస్థలు పనిచేయకుండా మూలపడ్డాయి. క్యూబా ప్రభుత్వం దిగిరావాలని ట్రంప్ వాదిస్తున్నారు. క్యూబా–అమెరికా విదేశీ మంత్రిత్వశాఖల ప్రతినిధుల మధ్య ఇప్పటికే శాంతియుత పద్ధతులలో సంభాషణలు జరిగాయి. క్యూబాను రక్షించుకోవడానికి దేశంలోని ప్రజలు ఒక సన్నాహక ప్రణాళికతో ఉన్నారని ఆ దేశాధ్యక్షుడు కానెల్ ప్రకటించారు.క్యూబా సార్వభౌమాధికారాన్ని, ప్రాదేశిక సమగ్రతను కాపాడుకుంటూ అమెరికాతో సమాన గౌరవ ప్రాతిపదికపై చర్చల ద్వారా సమస్యలు పరిష్కారం చేసుకోవడానికి తమ దేశం సిద్ధంగా ఉందని కానెల్ ప్రకటించారు.

# పశ్చిమాసియాలో యుద్ధం బూమరాంగ్!

### డీగోగార్షియాపై ఇరాన్ దాడి ఊహించని పరిణామం

### శక్తిమంతమైన క్షిపణులను వెలికితీసిన ఇరాన్

**దుబాయ్:** పశ్చిమాసియాలో ఇరాన్‌ను లక్ష్యంగా చేసుకుని అమెరికా–ఇజ్రాయెల్ ప్రారంభించిన యుద్ధం అంచనాలు తప్పి బూమరాంగ్ (దాడిచేసినవాడిమీదకే తిరిగి దాడి)గా మారింది. మూడువారాలు దాటి యుద్ధం నాలుగోవారంలోకి ప్రవేశించిన తర్వాత ఇరాన్ మరింత బలం పుంజుకుంది. ఒకొక్క మారణాస్త్రాన్ని బయటకు తీయడం ప్రారంభించి శత్రువు అంచనాలను తారుమారు చేసింది. డీగో గార్షియాపై క్షిపణి ప్రయోగం, కీలకమైన అమెరికా నిఘా డ్రోన్ కూల్చివేతల ద్వారా అసలైన వ్యూహం అమలు చేస్తామని హెచ్చరికలు పంపించింది.

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తన స్వరం పెంచి తీవ్ర హెచ్చరికలు చేసేకొద్దీ ఇరాన్ మరింత బలంగా నేలకు కొట్టిన బంతిలా పైకిలేచి ప్రతిహెచ్చరికలు చేస్తోంది. హిందూమహాసముద్రంలో ఛాగోస్ ఐలాండ్‌లో ఉన్న డీగో గార్షియా దీవిలో ఉన్న అమెరికా–బ్రిటన్ ఉమ్మడి సైనిక స్థావరంపై శనివారం దాడిచేసి యావత్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిన ఇరాన్ ఈ యుద్ధం ఇంతటితో ఆగదని స్పష్టం చేసింది. ఛాగోస్ ఒక ద్వీప సమూహం. ఇందులో దాదాపు 60 చిన్న చిన్న ద్వీపాలున్నాయి. వీటిల్లో పెద్దది అమెరికా–బ్రిటన్‌లకు కీలకమైనదీ డీగో గార్షియా స్థావరం. దాదాపు 56 ఏళ్ళుగా అమెరికా దీనిని కీలక ఆయుధాల కేంద్రంగా మార్చుకుంది. ఇరాన్‌కు ఏకంగా 4000 కి.మీ దూరంలో ఉన్న డీగోగార్షియా లక్ష్యాన్ని దెబ్బతీసేందుకు ఖండాంతర క్షిపణిని ప్రయోగించి తన శక్తిసామర్థ్యాలను చాటుకుంది. ఎంతో శక్తిమంతమైన ఆయుధాలను ఇంకా బయటకు తీయలేదని, అవన్నీ అమెరికాకోసం దాచే ఉంచామని ఇరాన్ నాయకులు గతంలో చేసిన ప్రకటనలు వట్టి ప్రగల్భాలు కాదని రుజువు చేయడంతో డోనాల్డ్ ట్రంప్ అప్రమత్తమయ్యారు. ఇరాన్‌కు 48 గంటలు మాత్రమే సమయం ఇస్తున్నామని, ఈ లోపు హోర్ముజ్ జలసంధిని తెరవాలని లేకపోతే ఇరాన్‌లో ఉన్న విద్యుత్ వ్యవస్థలన్నింటినీ ధ్వంసం చేస్తామని హెచ్చరించారు. కానీ ఇరాన్ అందుకు భయపడలేదు. వెంటనే ప్రతిహెచ్చరిక చేసింది. పశ్చిమాసియా అంతటా ఉన్న అమెరికా మౌలిక సదుపాయాలను, ఇంథన వనరుల కేంద్రాలను ధ్వంసం చేస్తామని ప్రతిహెచ్చరికచేసి ట్రంప్‌కు దీటుగా నిలబడటంతో అమెరికా ప్రతిష్ఠకు, యుద్ధాహంకారానికి భంగపాటు ఎదురవుతోంది. రోజు రోజుకూ ఏకాకిగా మారుతున్నప్పటికీ అనివార్యమైన పరిస్థితుల్లో వ్యతిరేక వాతావరణంలో ట్రంప్ గాంభీర్యం ప్రదర్శించాల్సి వస్తోంది. ఇరాన్ వద్ద క్షిపణి నిల్వలు తగ్గిపోయాయని, ఆ దేశానికి ఉన్న క్షిపణుల లక్ష్య సామర్థ్యం 2000 కి.మీ దూరం మాత్రమేనని ఇప్పటివరకూ ట్రంప్ చెబుతూ వచ్చారు. కానీ డీగోగార్షియాపై చేసిన క్షిపణి దాడి లక్ష్యదూరం 4000 కి.మీ కావడంతో ఒక ఊహించని పరిణామంగా తెరమీదకు వచ్చింది. ఇప్పుడు ట్రంప్ చైనా–రష్యాలపై సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. పశ్చిమాసియాలో దేశాలు అమెరికా దాడులు చేసేందుకు ఇష్టపడకపోవడం ఒక ఎత్తైతే, డీగోగార్షియాను కేంద్రంగా చేసుకుని అత్యంత సురక్షితంగా యుద్ధం నడపవచ్చునని కూడా ట్రంప్ భావించారు. శ్రీలంక సమీపంలో ఇరాన్ యుద్ధ నౌకను నీట ముంచివేయడం ద్వారా ట్రంప్ అతిపెద్ద తప్పిదానికి పాల్పడిన ఇరాన్‌ను రెచ్చగొట్టారు. అమెరికా దీనికి తగిన మూల్యం చెల్లిస్తుందని ఇరాన్ హెచ్చరించింది. అంతేకాకుండా ప్రపంచ వ్యాప్తంగా కీలకమైన పర్యాటక ప్రాంతాలు కూడా ఇక తమ శత్రుదేశాలకు (అమెరికా–ఇజ్రాయెల్) ఎంత మాత్రం సురక్షితం కాదని, వారు భారీ మూల్యం చెల్లించుకోవాల్సిందేనని చేసిన హెచ్చరికలను ప్రపంచ విశ్లేషకులు, వివిధ దేశాల నాయకులు తేలికగా కొట్టిపారేయడంలేదు. హోర్ముజ్ జలసంధి ద్వారా శత్రుదేశాల వాణిజ్య కార్యకలాపాలకు మాత్రమే నిషిద్ధమని ఇరాన్ ఇప్పటికే అనేకసార్లు ప్రకటించింది. హోర్ముజ్‌లో ఉద్రిక్తతలు సృష్టించిన అమెరికా–ఇజ్రాయెల్‌ను ప్రధాన లక్ష్యంగా చేసుకుని ఎన్ని దశాబ్దాలైనా పోరాటం చేస్తామని ప్రకటించింది.



#### అత్యంత కీలకమైన అమెరికా నిఘా డ్రోన్ కూల్చివేత

ఎవరికీ అందనంత ఎత్తులో విహరిస్తూ నిఘా కార్యకలాపాలు నిర్వహించే శక్తిమంతమైన అమెరికా నిఘా డ్రోన్‌ను ఆదివారం తాజా దాడుల్లో ఇరాన్ కూల్చివేసి మరోసారి తన యుద్ధ సామర్థ్యాన్ని నిరూపించుకుంది. అమెరికాకు చెందిన ఎంక్యూ–9 రీపర్ డ్రోన్ బుష్‌హెర్ మీదుగా వెళుతుండగా, ఇరాన్ రక్షణ దళాలు కూల్చివేశాయి. ఈ నిఘా డ్రోన్ గిరికీలు కొట్టుకుంటూ నేలనుతాకి వట్టి బూడిదగా మారిపోయిన దృశ్యాన్ని వీడియో ద్వారా ఇరాన్ దళాలు విడుదల చేసి అమెరికా డొల్ల తనాన్ని నిరూపించాయి. అమెరికా సైనిక కార్యకలాపాలలో అత్యంత కీలకమైన ఈ నిఘా డ్రోన్ గిర గిరా తిరుగుతూ నేలకూలిన నాటకీయ దృశ్యాన్ని ఒక ఘన విజయంగా ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ భావిస్తోంది. 23 రోజులుగా హోర్ముజ్ జలసంధిని స్తంభింపజేసి ఉంచడం, జరిమానా టోల్ వసూలు ప్రకటనలు కూడా ఐఆర్‌జిసి విజయాల ఖాతాల్లో చేరిపోయాయి. రోజు రోజుకూ ఘర్షణ తీవ్రమయ్యేకొద్దీ నష్టాలు అమెరికా సైన్యానికి నష్టాలు పెరుగుతున్నాయి. అమెరికా యుద్ధ నైపుణ్యాన్ని గొప్పగా అంచనావేసుకున్న యూరోపియన్ మిత్రులు, పెట్టుబడిదారీ పాశ్చాత్య ప్రపంచ ఆరాధకులు నిరాశ చెందుతున్నారు.

## కుప్పకూలిన ఖతార్ మిలిటరీ హెలికాప్టర్ : ఆరుగురు దుర్మరణం

**దోహా:** ఖతార్‌లో మిలిటరీ హెలికాప్టర్ కుప్పకూలిపోవడంతో అందులో ప్రయాణిస్తున్న ఆరుగురు మరణించారు. రోజువారీ కార్యకలాపాలలో భాగంగా ఖతార్ ప్రాదేశిక జలాలపై ప్రయాణిస్తున్న సమయంలో హెలికాప్టర్ కుప్పకూలిపోయిందని రక్షణఅధికారులు ఆదివారం చెప్పారు. పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న తరుణంలో ఈ సైనిక హెలికాప్టర్ కూలిపోయింది. ఐతే పశ్చిమాసియాలో యుద్ధానికి, ఈ హెలికాప్టర్ ప్రమాదానికీ సంబంధంలేదని, హెలికాప్టర్‌లో సాంకేతిక లోపం తలెత్తడంవల్ల ప్రమాదం సంభవించిందని అధికారులు చెప్పారు. జలాల్లో పడిపోయిన హెలికాప్టర్‌ను వెతికి వెలికితీసేందుకు తీరప్రాంత గస్తీ దళాలతోపాటు ప్రత్యేక దర్యాప్తు బృందాలను రంగంలోకి దించినట్లు హోంమంత్రిత్వశాఖ ప్రకటించింది.



## స్లోవేనియా ఎన్నికల్లో సవాలు విసురుతున్న ట్రంప్ మిత్రుడు

**లుబ్లియానా:** మధ్యయూరప్‌లో ఆల్ప్ పర్వతశ్రేణులవద్ద కొలువుదీరిన గణతంత్ర దేశం స్లోవేనియాలో ఆదివారం పార్లమెంటు ఎన్నికలు జరిగాయి. ఈ సారి ఎన్నికల్లో కన్జర్వేటివ్‌లు పెద్ద సవాలుగా మారారు. తిరిగి అధికారం సంపాదించేందుకు విపరీతమైన ప్రయత్నాలు చేస్తున్నారు. నేషనల్ అసెంబ్లీగా పిలిచే జాతీయ పార్లమెంటులో మొత్తం 90 స్థానాలు ఉండగా, ప్రభుత్వ అధికారం సంపాదించడానికి ఏ పార్టీ అయినా 46 సీట్ల మెజారిటీ తెచ్చుకోవాలి. ఫ్రీడమ్ మూమెంట్‌పార్టీతోపాటు స్లోవేనియా డెమొక్రాట్స్,న్యూ స్లోవేనియా–క్రిస్టియన్ డెమొక్రాట్స్,సోషల్ డెమొక్రాట్లు, వామపక్షాలు ఈ ఎన్నికల్లో పోటీలో ఉన్నాయి. మూడుసార్లు గతంలో ప్రధానమంత్రిగా పనిచేసిన సోషల్ డెమొక్రటిక్‌పార్టీ ఆఫ్ స్లోవేనియా (ఎస్‌డిఎస్) నాయకుడు జానెజ్ జాన్సా (68) అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు బలమైన మిత్రుడుగా ఎన్నికల బరిలోకి దిగారు. జానెజ్ జాన్సా పూర్తిగా కమ్యూనిస్టు వ్యతిరేకి. పచ్చి మితవాది. కార్మిక వ్యతిరేకి.ఇప్పుడు ఈ ఎన్నికల్లో ప్రధానంగా జానెజ్ జాన్సాకు, ప్రస్తుత ప్రధానమంత్రి రాబర్ట్ గోలోబ్‌కు మధ్య అధికారంకోసం పోరాటం జరుగుతోంది. ప్రస్తుతం జాన్సా ఆధిక్యంలో ఉన్నట్లు ముందస్తు సర్వేలు తెలియజేస్తున్నాయి. జాన్సా ఇజ్రాయెల్ అనుకూలవాది కాగా, గోలోబ్ పాలస్తినా రాజ్యానికి అనుకూలుడు.అవినీతి నిర్మూలన, ప్రజా సంక్షేమం, ప్రజారంజక పాలనవంటి అంశాలను ఎన్నికల ప్రచారాంశాలుగా అభ్యర్థులు తెరమీదకు తెచ్చారు. ప్రస్తుత ప్రధానమంత్రి ఫ్రీడమ్ మూమెంట్ పార్టీ నాయకుడు గోలోబ్ ఎన్నికల్లో గెలిచి 2022 జనవరిలో పదవీ బాధ్యతలు తీసుకున్నారు. 41 సీట్లు గెలుచుకుని సెంటర్ లెఫ్ట్, సోషల్ డెమొక్రాట్స్‌తో కలిసి మిశ్రమ ప్రభుత్వం ఏర్పాటు చేశారు. గాజాలో ఇజ్రాయెల్ యుద్ధాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. పాలస్తినాను స్వతంత్రదేశంగా గుర్తిస్తున్నట్లు 2024లో ప్రకటించారు.

## బడ్జెట్ రూపకల్పన (మొదటి పేజీ తరువాయి)

అందించడంతో పాటు వారి ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. గురుకులాలు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌తో పాటు ప్రతి నియోజక వర్గంలో తెలంగాణ మోడల్ పబ్లిక్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు అల్పాహారంగా మూడు రోజులు పాలు, మూడు రోజులు రాగి జావ అందించనున్నట్లు తెలిపారు. యుక్త వయస్సులో ఉన్న ఇంటర్మీడియట్ విద్యార్థులు కూడా పౌష్టికాహారం అందించాలని ఈ ఏడాది నుంచి మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. వైద్య రంగానికి ప్రాధాన్యతనిస్తూ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో బెడ్స్ సామర్థ్యాన్ని 30వేల నుంచి 44వేలకు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రంలో ఇండ్లు లేని పేదలు ఉండకూడదనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇంటి పథకం ద్వారా 4.5 లక్షల ఇండ్లను మంజూరు చేశామని వాటికి నిధులు కూడా కేటాయించామని ఇండ్ల నిర్మాణం చేపట్టిన వారికి వారం వారం నిధులు కూడా జమ చేస్తున్నామన్నారు. ఈ ఏడాది ప్రతి నియోజక వర్గానికి వెయ్యి ఇండ్లు మంజూరు చేయనున్నామన్నారు. ఉద్యోగులకు వారి కుటుంబాలకు కూడా క్యాష్‌లెస్ వైద్యాన్ని అందజేయనున్నట్లు తెలిపారు. రైతాంగానికి అన్ని రకాల అండగా ఉండేందుకు రైతుభరోసాతో పాటు సన్న ధాన్యానికి రూ. 500 బోనస్ కల్పిస్తున్నామన్నారు. ఎకరం లోపు ఉన్న రైతులకు ఆరువేల చొప్పున రైతు భరోసా నిధులు మంజూరు చేశామని 45 రోజుల్లో పూర్తి స్థాయిలో రైతు భరోసా విడుదల చేస్తామని తెలిపారు. నీటిపారుదల రంగానికి ప్రాధాన్యత కల్పిస్తూ ప్రాజెక్టుల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఉన్నత విశ్వ విద్యాలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేశామని తెలిపారు. గోదావరి పరివాహక ప్రాంతంలో జీవించే గిరిజనులకు సంబంధించి ఇందిర సౌర జల గిరి వికాస పథకం క్రింద బోర్లు, మోటార్లు, విద్యుత్ సౌకర్యం ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నట్లు తెలిపారు. మహిళలకు ఆర్టీసిలో ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల వరకు గృహ విద్యుత్ ఉచితంగా అందిస్తున్నామన్నారు. గోదావరి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేందుకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, మాజీ ఎంఎల్ఏ కొండబాల కోటేశ్వరరావు, మాజీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మహ్మద్ జావిద్, దొబ్బల సౌజన్య, పుచ్చకాయల వీరభద్రం, బాలగంగాధర్ తిలక్, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఐఎ చూపు

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టింది. మయన్మార్ సరిహద్దు ప్రాంతాలతో సంబంధం ఉన్న కేసులో అమెరికాకు చెందిన వ్యక్తి సహా మొత్తం 7 మంది విదేశీయులను అధికారులు ఈ నెల 17 నుంచి 19 వరకు ఢిల్లీ, కోల్‌కతా, లక్నో విమానాశ్రయాల్లో వేర్వేరు ఆపరేషన్లలో అదుపులోకి తీసుకున్నారు. ముందస్తు సమాచారంతో భద్రతా సంస్థలు సంయుక్తంగా ఈ ఆపరేషన్ నిర్వహించి అరెస్టు చేశారు. వివిధ ప్రాంతాల్లో అరెస్ట్ చేసింది. అరెస్టైన వారిలో ఒకరు అమెరికన్ కాగా, మరో ఆరుగురు ఉక్రెయిన్ పౌరులు ఉన్నారు. వీరు భారత్‌లో టూరిస్ట్ వీసాలతో ప్రవేశించి, మిజోరం రాష్ట్రం ద్వారా మయన్మార్ సరిహద్దు ప్రాంతాలకు అక్రమంగా వెళ్లినట్లు విచారణలో వెల్లడైంది.

**ఉగ్రవాద కార్యకలాపాలకు సహాయం..**

దర్యాప్తు సంస్థల సమాచారం ప్రకారం, ఈ విదేశీయులు మయన్మార్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఎథ్నిక్ ఆర్మ్డ్ గ్రూప్స్‌కు శిక్షణ ఇచ్చినట్లు అనుమానం వ్యక్తమవుతోంది. ఆయుధ వినియోగం, డ్రోన్ టెక్నాలజీ, కమ్యూనికేషన్ వ్యవస్థలపై ప్రత్యేక శిక్షణ అందించినట్లు ప్రాథమిక విచారణలో తేలింది.

యూరప్ దేశాల నుంచి డ్రోన్లు, ఆధునిక పరికరాలు తెచ్చి మయన్మార్ ప్రాంతానికి తరలించినట్లు ఆరోపణలు ఉన్నాయి. డ్రోన్ వార్‌ఫేర్, సర్వైలెన్స్, జామింగ్ టెక్నాలజీల్లో వీరు నైపుణ్యం కలిగినవారిగా గుర్తించారు. అరెస్టైన ఏడుగురిని ఢిల్లీ కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం వారిని 11 రోజులపాటు ఎన్ఐఎ కస్టడీకి అప్పగించింది. ప్రస్తుతం వీరిని అధికారులు లోతుగా విచారిస్తున్నారు.ఇప్పటికే కీలక విషయాలు వెలుగు చూశాయి.

**హైదరాబాద్‌లో మయన్మార్ వాసులు..**

మయన్మార్ నుంచి పారిపోయి వచ్చి హైదరాబాద్‌లో సుమారు 500కుపైగా కుటుంబాలు తలదాచుకుంటున్నాయి. పదేళ్ల క్రితం 50 కుటుంబాలు మాత్రమే వచ్చాయి. ఆ తరువాత వీరి సంఖ్య రోజు రోజుకు పెరిగిపోయింది. వీరంతా ప్రస్తుతం బార్కాస్, చాంద్రాయణగుట్ట, తలాబ్‌కట్ట ప్రాంతాలలో నివాసముంటూ చిన్నాచితక పనులు చేసుకుంటున్నారు. గతంలో ఈ కుటుంబాలకు చెందిన కొందరు యువకులు ఉగ్రకార్యకలాపాలలో పాలుపంచుకున్నట్లు దర్యాప్తులో తేలింది. తాజాగా అమెరికా, ఉక్రేయిన్ ఉగ్రవాదులు పట్టుబడడం, వాళ్లంతా మయన్మార్‌కు చెందిన యుకువలకు ఉగ్ర శిక్షణ ఇచినట్లు దర్యాప్తులో తేలింది. దీంతో హైదరాబాద్‌లో నివాసముంటున్న యమన్మార్‌కు చెందిన యుకులపై ఎన్ఐఎ తాజాగా దృష్టి సారించింది. ఈ ఘటన వెనుక మరింత పెద్ద అంతర్జాతీయ నెట్‌వర్క్ ఉండే అవకాశం ఉందని ఎన్ఐఎ అనుమానిస్తోంది. ఇప్పటికే మరికొంత మంది విదేశీయులు భారత్‌లోకి ప్రవేశించి ఉండొచ్చని భావిస్తూ వారి కదలికలను ట్రాక్ చేస్తున్నారు.దేశంలోకి వచ్చిన 14 మంది ఉగ్రవాదుల్లో ఏగుగురు మాత్రమే చిక్కారు. మిగతా ఏడుగురు ఎక్కడికి వెళ్లారనే విషయంపై ఆరా తీస్తున్నారు. హైదరాబాద్‌లో వీరు తలదాచుకున్నారా అనే అనుమానాలను దర్యాప్తు అధికారులు వ్యక్తపరుస్తున్నారు. పట్టుబడిన ఉగ్రవాదులు మయన్మార్‌లోని యువకులకు అత్యాధునికమైన డ్రోన్‌లతో పాటు పేలుడు పదార్థాలను కూడా అందించినట్లు తెలిపారు. ఈ కోణంపై ఎన్ఐఎ అధికారులు హైదరాబాద్‌పై ప్రత్యేక దృష్టి పెట్టారు.

## ఎన్నికలప్పుడే రాజకీయాలు

(మొదటి పేజీ తరువాయి)

సిఎం రేవంత్‌రెడ్డి రైతుఉత్సవంలో ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాళ్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సిఎం రేవంత్‌రెడ్డి రైతులనుద్దేశించి మాట్లాడుతూ ఎద్దు ఏడ్చిన వ్యవసాయం.రైతు కన్నీరు పెడితే రాజ్యం బాగుపడదని నానుడినే తాను నమ్ముతానని రైతులు రాజు చేయటమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్ర ఆర్థికపరిస్థితి అంతంత మాత్రమే ఉన్న.. ఆర్థికలోటు ఉన్న రైతుసంక్షేమాన్ని విస్మరించలేదన్నారు. రైతు పండించిన చివరి కొనుగోలు చేయటంతో పాటు..ధాన్యానికి గిట్టుబాటుధరతో పాటు 500 బోనస్ చెల్లించినట్లు తెలిపారు. రైతు భరోసా కింద 70 లక్షల రైతులకు మొదటి విడుతగా 3600 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. మిగతావి సైతం రెండు విడుతల్లో 45రోజుల్లో 9వేల కోట్లు అర్హులైన అన్నదాతలందరికి రైతుభరోసా చెల్లిస్తామని సిఎం స్పష్టం చేశారు. బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కెసిఆర్ 114 నెలల్లో నెలకు రైతుసంక్షేమం కోసం 2533 కోట్లు వెచ్చించేవారని. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాన 28 నెలల్లో ప్రతి నెల 5500 కోట్లు వెచ్చిస్తుందన్నారు. కాంగ్రెస్ సర్కార్ లక్ష 30వేల కోట్లు రైతుసంక్షేమానికి వెచ్చించిందని,. తమది రైతు ప్రభుత్వమని.. రైతును రాజును చేయటమే లక్ష్యమన్నారు. మెదక్, నిజామాబాద్ జిల్లాలో సారవంతమైన భూములని అన్ని రకాల కమర్షియల్ పంటలు వరి, మొక్కజొన్న, చెరుకు, పసుపు పంటలు పండిస్తారన్నారు. గతంలో పండించిన పసుపు పంట అమ్ముకుంటే తులం బంగారం వచ్చేదని..ఇప్పుడు బంగారం 2లక్షలకు చేరిందని. పసుపుకు పంటకు గిట్టుబాటు కరువైందన్నారు. అలాగే ఖమ్మం, వరంగల్ ప్రాంతంలో పత్తి, మిర్చి పంట, వికారాబాద్‌లో నాణ్యమైన కందులను పండిస్తారన్నారు. రైతులు వరిపంటకు బదులుగా వాణిజ్య పంటలపై దృష్టి సారించాలని..పంట మార్పిడి చేపట్టాలని, ఇందుకు అవసరమగు ప్రణాళికను తయారు చేయాలని వ్యవసాయమంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు సూచించినట్లు చెప్పారు. పామాయిల్ పంటను రాష్ట్ర వ్యాప్తంగా 3లక్షల ఎకరాల్లో సాగుచేస్తున్నారని.. 10లక్షల ఎకరాల వరకు విస్తరించిన ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. పామాయిల్ పంటను ప్రోత్సహించేలా రైతుల్లో చైతన్యం తేవాలన్నారు. వరి పంటను 50లక్షలకు మించి కొనుగోలు చేయమని కేంద్రం చేతులేత్తేసిందని, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికి 71లక్షల క్వింటల్ల పంటను కొనుగోలు చేసినట్లు చెప్పారు. పామాయిల్ పంటను సాగుచేస్తే మొదటి నాలుగేళ్ల వరకు రైతుకు ఆదాయం వుండదని..నాలుగేళ్లవరకు కేంద్రంతో పాటు రాష్ట్రం సహాయం చేసి రైతులను ఆదుకుంటుందన్నారు. నర్మెట్టలోని పామాయిల్ ఫ్యాక్టరీని కొడంగల్‌లో నిర్మించాలని.. ఇందుకు అవసరగు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. రైతుల మిల్లెట్స్, ఆర్గానిక్ పంటలను పండిస్తే వారికి ఆదాయం లభిస్తుందన్నారు. తెలంగాణ సారవంతమైన భూమి రైతులు వినూత్నంగా ఆలోచించి లాభాదాయక పంటలు పండించి బంగారు తెలంగాణగా మార్చాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఉచిత బస్సు ప్రయాణానికి 9వేల కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. మహిళ ఉచిత ప్రయాణంతో అమ్మవారింటికి, అమ్మవారు దర్శనాలకు వెళ్లి వస్తారన్నారు. 2034 వరకు కోటిమంది మహిళలకు కోటీశ్వరులుగా తీర్చిదిద్దుతానన్నారు. ఆర్టీసి బస్సులకు, పెట్రోల్ బంక్‌లకు యజమానులుగా మార్చినట్లు తెలిపారు. సాంకేతిక విద్యకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఎటిసి సెంటర్లలో శిక్షణ పొందిన విద్యార్థులకు ప్రతి నెల 2వేలు స్టైఫండ్ ఇస్తానన్నారు. ఎటిసిలో శిక్షణ పొందిన వారికి ఉద్యోగం ఇప్పించే బాధ్యత తనదని సిఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. తనకు భేషజాలు లేవని అభివృద్ధి కొరకు ఎవ్వరి వద్దకైన వెళ్తానని.. ఎన్నికలప్పుడు మాత్రమే తాను రాజకీయాలు చేస్తానని స్పష్టం చేశారు. బిజెపి ఎంపిలు,కేంద్ర మంత్రులతో కలసి ప్రధాని మోదీని కలసి రాష్ట్రాభివృద్ధికి నిధులు తేస్తానని మరోసారి స్పష్టం చేశారు. ప్రజాసంక్షేమం, రైతు సంక్షేమం, అభివృద్ధి తన లక్ష్యమని సిఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుదర్శన్‌రెడ్డి, ఎంపిలు రఘునందన్ రావు, వేం నరేందర్‌రెడ్డి, ఎంఎల్‌సి మహేశ్‌కుమార్ గౌడ్, అయిల్ ఫామ్ చైర్మన్ రాఘవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## భారీ మార్పులు

(మొదటి పేజీ తరువాయి)

5శాతం టిడిఆర్ వినియోగించాల్సి ఉంటుంది. బిల్డింగ్ అనుమతి సమయంలో 50శాతం టిడిఆర్ సమర్పించాల్సి ఉంటుంది. నివాసయోగ్య పత్రం (ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌ఓసి)కు ముందు మిగతా 50 శాతం టిడిఆర్ తప్పనిసరిగా సమర్పించాలని ప్రభుత్వం ఉత్తర్వులలో స్పష్టం చేసింది. 21 మీటర్లకు పైగా ఉన్న భవనాలను హైరైజ్‌గా గుర్తించింది. 750 నుంచి 2000 చదరపు మీటర్ల ప్లాట్లలో 18 నుంచి 21 మీటర్ల భవనాలకు టిడిఆర్ తప్పనిసరిగా చేసింది. నాన్ హైరైజ్ బిల్డింగ్స్‌కు టిడిఆర్ ద్వారా సెట్‌బ్యాక్ సడలింపులు చేసింది. హైరైజ్ భవనాల్లో 10 శాతం వరకు సెట్‌బ్యాక్ రిలాక్సేషన్‌కు అనుమతి ఇచ్చింది. 2000 చదరపు మీటర్లకు పైగా ప్లాట్లలో అదనపు అంతస్తులకు అవకాశం కల్పించింది.

**హై–రైజ్ భవనాల కొత్త నిర్వచనం..**

ప్రభుత్వం హైరైజ్ (గగనతల) భవనాల ఎత్తు పరిమితిని సవరించింది. ఇకపై 21 మీటర్లు లేదా అంతకంటే ఎక్కువ ఎత్తు ఉన్న భవనాలను మాత్రమే హైరైజ్ భవనాలుగా పరిగణిస్తారు. అయితే భవనం ఎత్తును లెక్కించేటప్పుడు చిమ్నీలు, కూలింగ్ టవర్లు, వాటర్ ట్యాంకులు, లిఫ్ట్ మెషిన్ గదుల ఇతర నిర్మాణ ఫీచర్లను ఈ ఎత్తు లెక్కలోకి తీసుకోరు.

**టిడిఆర్ వినియోగంతో అదనపు ప్రయోజనాలు..**

టిడిఆర్ వినియోగాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వం పలు వెసులుబాట్లు కల్పించింది. 750 నుండి 2000 చదరపు మీటర్ల విస్తీర్ణం కలిగిన ప్లాట్లలో, 18 నుండి 21 మీటర్ల ఎత్తు వరకు నిర్మాణాలకు టిడిఆర్ ద్వారా అనుమతి లభిస్తుంది. హైరైజ్ భవనాలలో నిర్ణీత సెట్‌బ్యాక్‌లలో 10 శాతం వరకు మినహాయింపును టిడిఆర్ ద్వారా పొందవచ్చు. అయితే భవనం చుట్టూ కనీసం 7 మీటర్ల ఖాళీ స్థలం ఉండటం తప్పనిసరిగా ఉండాలి. రోడ్డు విస్తరణలో భూమి కోల్పోయిన సందర్భాల్లో, కనీస సెట్‌బ్యాక్‌లను పాటిస్తూ టిడిఆర్ ద్వారా సడలింపులు పొందవచ్చు. మాస్టర్ ప్లాన్ రోడ్‌లలో మార్పులు లేదా తొలగింపులు జరిగినప్పుడు, డెవలప్‌మెంట్ ఛార్జీలకు బదులుగా సమానమైన టిడిఆర్ బాండ్ల ను సమర్పించే వెసులుబాటు కల్పించారు.

**రోడ్డు వెడల్పును బట్టి అదనపు అంతస్తులు..**

- 2000 చదరపు మీటర్ల కంటే పెద్ద ప్లాట్లలో రోడ్డు వెడల్పు ఆధారంగా అదనపు అంతస్తుల నిర్మాణానికి అనుమతి ఇచ్చింది.
- 40అడుగుల రోడ్డు: 3అదనపు అంతస్తులు.
- 60అడుగుల రోడ్డు: 4అదనపు అంతస్తులు.
- 80అడుగుల రోడ్డు: 5అదనపు అంతస్తులు.
- ఇవన్నీ టిడిఆర్ వినియోగం, ఫైర్, ఎయిర్‌పోర్ట్ అథారిటీ నిబంధనలకు లోబడి ఉండాల్సి ఉంటుంది.

**టిడిఆర్ సమర్పణ నిష్పత్తి..**

- ఎత్తైన భవనాల నిర్మాణంలో టిడిఆర్ లోడింగ్ విధానాన్ని ప్రభుత్వం కచ్చితం చేసింది.
- 10 నుండి 20 అంతస్తుల వరకు : బిల్డప్ ఏరియాలో 3 శాతం టిడిఆర్ వినియోగించాలి.
- 20 అంతస్తుల పైన : బిల్డప్ ఏరియాలో 5 శాతం టిడిఆర్ వినియోగించాలి.
- మొత్తం టిడిఆర్ 50 శాతం నిర్మాణ అనుమతి సమయంలో, మిగిలిన 50 శాతం ఓసి పొందే ముందు సమర్పించాల్సి ఉంటుంది.

## చెప్ప చేతల్లో సిఇసి

(మొదటి పేజీ తరువాయి)

ఆ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. లోక్‌సభలో 130మంది, రాజ్యసభలో 63మంది సభ్యులు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్‌ను తొలగించాలని కోరుతూ తీర్మానాన్ని కోరారు. నోటీసుల గురించి అడగ్గా వాటిపై చర్య కోసం ఎదురు చూస్తున్నామని తృణమూల్ కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు డెరెక్ ఓబ్రియన్ చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఈ నోటీసులను పరిగణనలోనికి తీసుకోనట్లయితే, కార్యనిర్వాహకవర్గానికి, సిఇసికి మధ్య ఉన్న అవగాహనపై ప్రశ్నలు లేవనెత్తుతామని ఓబ్రియన్ తెలియజేశారు. సమాన అవకాశాల కల్పనను 'ఎన్నికల ప్రజాస్వామ్యానికి గుండెకాయ, ఆత్మ' అని, రాజ్యాంగ మౌలిక నిర్మాణంలో భాగమని ఆ నోటీసులు పేర్కొన్నాయి. నిరూపితమైన దుష్ప్రవర్తన ఆరోపణలలో ప్రధాన ఎన్నికల కమిషనర్ ''స్వతంత్రతను, రాజ్యాంగ విశ్వసనీయతను కాపాడటంలో విఫలమయ్యారు' అని కార్యనిర్వాహక వర్గం అదుపులో పనిచేస్తున్నారని ప్రతిపక్షం ఆరోపించింది. ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా జ్ఞానేష్ కుమార్ నియామక ప్రక్రియ 2025 ఆగస్టు 17న రాహుల్‌గాంధీని లక్ష్యంగా చేసుకుని ఆయన నిర్వహించిన 'పక్షపాత పత్రికా సమావేశం' ప్రతిపక్ష, అధికార పార్టీ సభ్యుల పట్ల వివక్షపూరిత వైఖరి దర్యాప్తులకు అడ్డంకులు, పారదర్శక సాధనాలను అందించడానికి నిరాకరించడం, అధికార పార్టీ రాజకీయ లక్ష్యాలకు అనుగుణంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కసరత్తును అమలు చేయడం వంటివి ప్రతిపక్షాల ఆరోపణలలో ఉన్నాయి. ఎస్ఐఆర్ సంబంధిత పౌరసత్వ ధృవీకరణ అంశంపై అంటే ఓటరు ద్వారా ఓటర్ల పౌరసత్వ స్థితిని నిర్ధారించడంపై భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ) వైఖరి సవరణ భారతదేశం అంతటా జాతీయ పౌర పట్టికను (ఎన్ఆర్‌సి) ప్రక్రియను నిర్వహించాలన్న కేంద్ర హోం మంత్రి అధికార వైఖరికి పూర్తి అనుగుణంగా ఉంది. సిఇసి, ఇసిఐని ఒక కొత్త ఎన్నికల సంస్థ నుంచి కార్యనిర్వాహక వర్గం రాజకీయాలను అమలు చేసే సాధనంగా సమర్థవంతంగా మార్చేశారని, నిష్పక్షపాతంగా ఎన్నికలలు నిర్వహించే సంస్థ అయిన దానిని పౌరసత్వ నిర్ధారణ ట్రిబ్యునల్‌గా కూడా మార్చేశారని ప్రతిపక్షం ఆరోపించింది. గత సంవత్సరం అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని నెలల ముందు బిహార్‌లో ప్రకటించిన ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ సమాజంలోని అత్యంత బలహీనవర్గాలను క్రమపద్ధతిలో ఓటు హక్కు కోల్పోయేలా చేసే మినహాయింపు పత్రాల అవసరాలను విధించిందని కూడా ఆరోపించింది.రాష్ట్ర ఓటర్లలో గణనీయమైన భాగాన్ని సూచించే 'దిగ్భ్రాంతికర సంఖ్య' అయిన 65లక్షల ఓటర్లను మినహాయించడం గురించి ప్రతిపక్షం ప్రస్తావిస్తూ, అసెంబ్లీ ఎన్నికలలో ఎన్‌డిఏ విజయంలో ఈ ప్రక్రియ నిర్ణయాత్మక పాత్ర పోషించి ప్రతిపక్షం తుడిచిపెట్టుకుపోయిందని పేర్కొంది. బిహార్ నమూనాను ఇతర రాష్ట్రాల మాదిరిగానే అనుకరించారని ఆ నోటీసులు పేర్కొన్నాయి. పశ్చిమబెంగాల్‌లో, ముసాయిదా ఓటర్ల జాబితాలో కోటిమంది ఓటర్లనుండి 58లక్షల పేర్లను తొలగించినట్లు వెల్లడైంది. కాగా 60లక్షల మందికి పైగా ఓటర్లు 'అడ్జుడికేషన్ కేటగిరీ' లోనే ఉన్నారు. దీంతో అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేవలం కొన్నివారాల ముందు వారి ఓటింగ్ స్థితి అనిశ్చితంగా మారింది. ఉభయ సభలలో తీర్మానం ఆమోదం పొందితే లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ సభ్యులు సంయుక్తంగా ఒక కమిటీని ఏర్పాటు చేస్తారు. ఈ కమిటీలో భారత ప్రధాన న్యాయమూర్తి లేదా సుప్రీంకోర్టు న్యాయమూర్తి, 25 హైకోర్టులలో ఒకదాని ప్రధాన న్యాయమూర్తి, ఒక విశిష్ట న్యాయ కోవిదుడు సభ్యులుగా ఉంటారు. కమిటీ విచారణలు కూడా ఏదేని కోర్టు విచారణలాగే ఉంటాయి. సాక్షులను, నిందితులను క్రాస్‌ఎగ్జామినేషన్ చేస్తారు.

# ఆరుట్ల వెంకట లక్ష్మీ నరసింహారెడ్డి మృతిపట్ల సిపిఐ నేతలు సంతాపం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సిపిఐ సీనియర్ నాయకులు, ఆరుట్ల లక్ష్మీ నరసింహారెడ్డి మృతి పట్ల పలువురు సిపిఐ నాయకులు తీవ్ర సంతాపం తెలిపారు. గత కొన్ని ఏళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ కేర్ హాస్పిటల్లో చికిత్స పొందుతూ ఆయన శనివారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు.

దీంతో ఆదివారం వెంకట లక్ష్మీ నరసింహారెడ్డి నివాసంలో ఆయన భౌతిక దేహాన్ని సందర్శించిన సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు, ఎంఎల్సి నెల్లికంటి సత్యం, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటి నరసింహ, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, బొమ్మగాని ప్రభాకర్,ఆందోజ్ రవీంద్ర చారి, భువనగిరి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు ఉజ్జని రత్నాకర్ రావు, సత్యనారాయణ, గోదా శ్రీరాములు,బిఎస్ ఆర్ మోహన్ రెడ్డి,ఫై మీద, రాజయ్య, శేఖర్ రెడ్డి, కళ్లెం కృష్ణ నాయకులు నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు వెంకటలక్ష్మీ నరసింహారెడ్డి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# ఖద్దరు గుప్పెట్లో.. ఖమ్మం కార్పొరేషన్!

* అనేక విషయాల్లో వేలుపెడుతున్న ఛోటా నేతలు
* అభివృద్ధి పనుల్లో పెరిగిన జోక్యం * టెండర్లు ఒకరివి చేసేది మరొకరు
* లోపిస్తున్న నాణ్యత..నోరెత్తని అధికారులు



**ప్రజాపక్షం/ఖమ్మం టౌన్ :** ఖమ్మం కార్పొరేషన్లో ఇటీవలకాలంలో అనధికారుల జోక్యం ఎక్కువైపోయింది. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రస్తుత కార్పొరేషన్ అవినీతి గుప్పెట్లో చిక్కుకుని విలవిల్లాడుతోంది. కంటికి కనిపించని పెత్తనాలు రాజ్యమేలుతున్నాయి. ప్రజాప్రతినిధుల అనుచరులమంటూ కొందరు అనేక విషయాల్లో లక్ష్మణ రేఖను దాటేస్తున్న సందర్భాలు కూడా ఉన్నాయి. అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నా టెండర్లు అర్హత కలిగిన కాంట్రాక్టర్ చేత వేయించి తర్వాత ఆ పనులను ముక్కలు ముక్కలుగా విడగొట్టి క్షేత్రస్థాయిలో అధికార పార్టీ కార్యకర్తలకు కట్టబెడుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో పనుల్లో నాణ్యత లోపాలు ఉంటున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. మొక్కలు నాటడం, ఎండ్ టూ ఎండ్ రోడ్లు వేయడం, రోడ్ ప్యాచ్ వర్క్ ఇలాంటివన్నీ లోతుగా పరిశీలిస్తే అందులోని లోపాలు, పాపాలు బయటపడే అవకాశాలు ఉన్నాయి. అయితే క్వాలిటీ కంట్రోల్, విజిలెన్స్ లాంటి నిఘావిభాగాలు నిద్రపోతూ పెద్ద తల నొప్పిలాకుండా టు భావించి క్షేత్రస్థాయి పరిశీలన జోలికి వెళ్లడంలేదు. ఎండ్ టు ఎండ్ రోడ్ల విషయానికి వస్తే రోడ్ల చివర దాకా ఉన్న రోడ్లను కూడా కొంతమేర యంత్రాలతో కట్ చేసి ఆ సిసి శిథిలాలను తొలగించి తిరిగి అక్కడ ఎండ్ టు ఎండ్ రోడ్లు వేస్తున్నారు. ఈ అభివృద్ధి పనుల అంచనాలు కూడా అధికంగా ఉంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గత ప్రభుత్వాల్లో మున్సిపల్ కాంట్రాక్టర్లు అంటు ప్రైవేటు విభాగం ఉండేది. వారే అభివృద్ధి పనుల టెండర్లు దక్కించుకుంటు క్షేత్రస్థాయిలో ఆ పనులు చేసి సీనియారిటీ క్రమంలో బిల్లులు తీసుకునేవారు. ఇటీవల కాలంలో నేతలే బడాకాంట్రాక్టర్లతో మాట్లాడి వారి పేరుపైన టెండర్లు వేయించి ఆ టెండర్లు పొంది వచ్చిన పనులను తమ అనుచర గణాలకు పంచిపెడుతున్నారు. దీంతో గతంలో ఉన్న ప్రయివేటు కాంట్రాక్టు వ్యవస్థ రోజురోజుకు వెనుకబడిపోయింది. ఒక వేళ కాంట్రాక్టర్లు ముందుకొచ్చి పనులు చేయాలని భావించి టెండర్లు వేసినా క్షేత్రస్థాయిలో పనులు చేయడం సాధ్యం కావడంలేదు. అడుగడుగునా ఆటంకాలు ఎదురవుతున్నాయి.

పనులు పూర్తయినా బిల్లులు రావడం చాలా కష్టతరంగా మారింది. అందుకే కార్పొరేషన్లో అనేక అభివృద్ధి పనులకు మేయర్ చేత ర్యాటిఫికేషన్ ఆర్డర్లు వేయించి చిన్నచిన్న విడిగా జనరల్ ఫండ్స్ నిధులను కేటాయించుకుంటున్నారు. తెరవెనుక నేతల సిఫారసులున్న వారికే బిల్లులు, లేనివారికి బిల్లులు అన్నచందంగా ఈ అభివృద్ధి వ్యవస్థ మారిపోయింది. ఒక వైపు అవినీతి అక్రమాలు జరిగితే చూస్తు ఊరుకోం అంటు ప్రకటనలు గుప్పిస్తున్న ఆ ప్రకటనలకు క్షేత్రస్థాయిలో జరిగే వ్యవహారాలకు అసలు సంబంధం ఉండడం లేదు. ఇక సిటీ ప్లానింగ్ విషయానికొస్తే ఈ వ్యవస్థపై ఒత్తిళ్లు రోజురోజుకు ఎక్కువవుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సిటీప్లానింగ్ కొందరు నేతలు తమ జేబుసంస్థగా మార్చుకున్నట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. దీంతో సిటీ ప్లానింగ్ అధికారుల పనితీరు ముందు నుయ్యి, వెనుక గొయ్యి అన్న చందంగా మారింది. ప్రజల ఓట్లతో గెలిచిన ప్రజాప్రతినిధులు కార్పొరేటర్లు క్షేత్రస్థాయిలో పెత్తనాలు కొరవడిపోయిన సంబంధిత కార్పొరేటర్ల బంధువుల పెత్తనాలు క్షేత్రస్థాయి లో ఎక్కువై పోయాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా మంత్రి ప్రాతినిధ్యం వహించే ఖమ్మం నియోజకవర్గంలోనే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయి. ఇక ఏళ్ల తరబడి స్థానచలనాలు లేకుండానే ఆయా విభాగాలలో పేరుకుపోయిన కొందరు ఉద్యోగులు తమకున్న రాజకీయ నేతల అండదండలతో ఆయా సీట్లలో పెత్తనాలు చలాయిస్తున్నట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. ఇలా పలు విభాగాల్లో పరిశీలించి చూస్తే ఖమ్మం కార్పొరేషన్లో ప్రతి విభాగంలో తెరవెనుక రాజకీయ జోక్యం రోజురోజుకు పెరిగిపోతుంది. దీనిని అరికట్టాల్సిన ఉన్నతస్థాయి ప్రజాప్రతినిధులు ఇంతవరకు ఆ దిశగా ఆలోచించి సరైన కఠిన నిర్ణయాలు తీసుకోవడంలేదన్న భావన నగర ప్రజల్లో వ్యక్తమవుతోంది.

# మావోయిస్టు శంకర్‌కు తీవ్రఅనారోగ్యం

**ప్రజాపక్షం/హైదరాబాద్:**ఒడిశా రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లోని సెంట్రల్ జైలులో గత ఐదేళ్లుగా రిమాండ్ ఖైదీగా ఉన్న సిపిఐ (మావోయిస్టు) పార్టీ కేంద్ర మిలిటరీ కమిషన్ సభ్యుడు దుబాషి శంకర్ అలియాస్ మహేందర్ అలియాస్ రమేష్ ప్రస్తుతం అనారోగ్యంతో బాధపడుతున్నాడు.

గత కొన్ని రోజులుగా జైలులోనే అతనికి కుడి కాలులో ఇన్ఫెక్షన్ తీవ్రంగా పెరిగింది. విశాఖపట్నం జిల్లా గొల్లపల్లి ప్రాంతంలో 2014లో జరిగిన ఎదురు కాల్పుల్లో కుడి కాలు గాయపడినప్పటి నుంచి అతడు నొప్పితో ఇబ్బందులు పడుతున్నాడు. ప్రస్తుతం ఆ గాయం మళ్లీ ఇన్ఫెక్షన్‌కు గురవడంతో పరిస్థితి మరింత విషమించింది. ఇప్పటికే రెండు రోజులుగా కుడి కాలులో ఇన్ఫెక్షన్ తీవ్రత పెరగడంతో భువనేశ్వర్ సెంట్రల్ జైలు అధికారులు వైద్య చికిత్సలు అందిస్తున్నారు. అయితే ప్రస్తుతం నడవలేని స్థితిలో ఉన్నట్లు సమాచారం. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంతకుముందు కూడా ఒకసారి అతడు తీవ్ర అనారోగ్యానికి గురికాగా జైలు అధికారులు చికిత్సలు అందించారు. దుబాషి శంకర్‌పై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, మహారాష్ట్ర రాష్ట్రాల్లో కలిపి 100కు పైగా కేసులు నమోదయ్యాయి. అలిపిరి, ఉమేష్ చంద్ర, వ్యాస్ హత్య కేసుల్లో కీలక నిందితుడిగా ఉన్నాడు. తెలంగాణ రాష్ట్రం సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం చెట్ల నర్సంపల్లి గ్రామానికి చెందిన దుబాషి శంకర్ గత 45 ఏళ్లుగా విప్లవ ఉద్యమంలో ఒడిస్సా ఎఒబిలో కొనసాగుతున్నాడు దుబాషి శంకర్ అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. 2018లో ఒరిస్సా రామడుగు లో జరిగిన ఎన్కౌంటర్‌లో దుబాషి శంకర్ సహచరి లత ఎన్కౌంటర్లో చనిపోయింది.

## సుదీర్ఘకాలం ప్రభుత్వాధినేతగా మోదీ రికార్డు

**ప్రజాపక్షం/హైదరాబాద్:**భారత ప్రధాని నరేంద్ర మోదీ సుదీర్ఘ కాలం పాటు (8,931 రోజులు) ప్రభుత్వాధినేతగా (ముఖ్యమంత్రి, ప్రధానిగా) సేవలు అందించి చారిత్రాత్మక మైలురాయిని అధిగమించినందుకు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అభినందనలు తెలిపారు. గత 24 ఏళ్లుగా ఒక్క సెలవు కూడా తీసుకోకుండా దేశ సేవకే అంకితమైన మోదీ ప్రయాణం యువతకు ప్రేరణాదాయకమన్నారు. ‘సబ్ కా సాథ్‌సబ్ కా వికాస్’ మంత్రంతో జనధన్, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాల ద్వారా పేదల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు.

## నేడు శాసనసభలో రెండు బిల్లులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:**‘తెలంగాణ విద్యా విధాన పరిషత్ బిల్లు– 2026, తెలంగాణ బిల్లు–2026 (రెగ్యులేషన్ ఆఫ్ అపాయింట్‌మెంట్స్ టు పబ్లిక్ సరీసెస్, రేషనలైజేషన్ ఆఫ్ స్టాఫ్ ప్యాట్రన్, పే స్ట్రక్షర్) బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం సోమవారం జరిగే శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెట్టనుంది. సోమవారం ఉదయం 10గం.కు ప్రశ్నోత్తరాల సమయం, రెండు బిల్లులను ప్రవేశపెట్టడం, ఆ తర్వాత రాష్ట్ర ఆర్థిక బడ్జెట్ 2026–27పై చర్చ ప్రారంభం కానుంది.

# రైతు భరోసా నిధులు విడుదల




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రైతు భరోసా నిధుల కోసం ఎప్పు డెప్పుడని ఎదురు చూస్తున్న రైతుల ముఖాల్లో ఆనందం వెల్లువిరిసింది.ఆదివారం సిద్దిపేట జిల్లా నర్మేట్ట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవ వేదిక నుంచి ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తన చేతుల మీదగా రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేశారు. రైతు భరోసా కోసం రూ.9 వేల కోట్లను కేటాయించిన ప్రభుత్వంఈ నిధులను మూడు విడుతలుగా రైతు ఖాతాల్లో జమ చేయనుంది. ఇందులో భాగంగా మొదటి విడుతగా1 ఎకరం వరకు ఉన్న 68, 89, 955 రైతులకు సంబంధించి 57, 44,907.19 ఎకరాలకుగాను మొత్తం రూ.34,46, 94,45,249లను సిఎం రేవంతరెడ్డి రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమచేశారు. రెండవ విడుతగా రెండు ఎకరాలకు వరకు ఉన్న రైతుల ఖాతాల్లో మరో 20 రోజుల్లో జమా చేయనున్న ప్రభుత్వం ఏప్రిల్ చివరి నాటికి అర్హులైన రైతులందరి ఖాతాలో రైతు భరోసా నిధులు పడనున్నాయి.

**జిల్లాల వారీగా మొదటి విడుత రైతు భరోసా – యాసంగి 2025–26 నిధులు**

| జిల్లా పేరు | రైతుల సంఖ్య | మొత్తం (రూ.) |
|---|---|---|
| ఆదిలాబాద్ | 1,59,655 | 92,76,74,979 |
| కుమురంభీమ్ ఆసిఫాబాద్ | 1,32,854 | 74,05,91,844 |
| మంచిర్యాల | 1,52,001 | 76,91,78,355 |
| నిర్మల్ | 1,86,817 | 99,32,88,462 |
| నిజామాబాద్ | 2,69,476 | 1,34,95,15,004 |
| కామారెడ్డి | 3,00,294 | 39,42,03,740 |
| కరీంనగర్ | 1,88,818 | 90,42,73,809 |
| పెద్దపల్లి | 1,50,049 | 72,45,61,430 |
| జగిత్యాల | 2,24,305 | 1,04,94,63,532 |
| రాజన్న సిరిసిల్ల | 1,25,855 | 62,38,48,243 |
| మెదక్ | 2,60,818 | 1,10,44,83,608 |
| సంగారెడ్డి | 3,53,351 | 1,67,80,87,158 |
| సిద్ధిపేట | 3,18,877 | 1,53,44,32,836 |
| వరంగల్ | 1,55,170 | 75,95,46,280 |
| హన్మకొండ | 1,43,394 | 70,05,61,045 |
| మహబూబాబాద్ | 2,11,287 | 1,08,38,93,098 |
| ములుగు | 79,040 | 40,98,59,892 |
| జయశంకర్ భూపాలపల్లి | 1,15,177 | 59,35,19,448 |
| జనగాం | 1,80,186 | 92,11,17,163 |
| ఖమ్మం | 3,35,377 | 1,69,51,40,594 |
| భద్రాద్రి కొత్తగూడెం | 1,77,201 | 98,75,18,195 |
| రంగారెడ్డి | 2,89,448 | 1,37,11,08,146 |
| వికారాబాద్ | 2,72,871 | 1,40,32,09,054 |
| మేడ్చల్‌మల్కాజిగిరి | 24,935 | 10,43,50,423 |
| మహబూబ్‌నగర్ | 2,15,923 | 1,04,77,74,728 |
| నారాయణపేట్ | 1,77,425 | 93,71,46,917 |
| నాగర్‌కర్నూల్ | 3,01,828 | 1,57,95,16,058 |
| వనపర్తి | 1,77,987 | 86,31,56,223 |
| జోగులాంబ గద్వాల్ | 1,68,142 | 91,45,37,186 |
| నల్గొండ | 5,22,313 | 2,68,57,20,042 |
| సూర్యాపేట్ | 2,84,332 | 1,45,23,28,895 |
| యాదాద్రి భువనగిరి | 2,34,749 | 1,16,58,38,862 |
| **మొత్తం రైతుల సంఖ్య:** | **68,89,955** | **34,46,94,45,249** |

# సోషల్ మీడియా స్వీయ నియంత్రణకు ఒక వ్యవస్థ అవసరం

## ‘ది వైర్ న్యూస్ పోర్టల్’ వ్యవస్థాపక సంపాదకుడు ఎంకె.వేణు సూచన




**ప్రజాపక్షం/హైదరాబాద్:** సోషల్ మీడియా నియంత్రణ పేరుతో ప్రభుత్వాలు జోక్యం చేసుకోవడం పెద్ద ప్రమాదకరమని, ఈ ప్రమాదానికి ఆస్కారం ఇవ్వకూడదని, సోషల్ మీడియా స్వీయ నియంత్రణకు ఒక అసోసియేషన్ లాంటి వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని ప్రముఖ ‘ది వైర్ న్యూస్ పోర్టల్’ వ్యవస్థాపక సంపాదకు లు ఎం.కె.వేణు సూచించారు. సోషల్ మీడియా కు స్వీయ నియంత్రణ వ్యవస్థ అవసరమన్నారు. ‘ఈ నెల 27–29 తేదీలలో’ విజయవాడలో జరగనున్న ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజెయు) జాతీయ ప్లీనరీని పురస్కరించుకుని తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టియుడబ్ల్యుజె), మీడియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఇండియా (మెఫి) సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్, బషీర్‌బాగ్‌లోని దేశోద్ధార క భవన్‌లో ‘‘సోషల్ మీడియా–మంచిచెడు’’ అనే అంశంపైన ఆదివారం జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు సీనియర్ పాత్రికేయులు సోమశేఖర్ అధ్యక్షత వహించగా, వక్తగా ఎం.కె.వేణు, మెఫీ మేనేజింగ్ ట్రస్టీ, ఐజెయు మాజీ అధ్యక్షులు డి.అమర్ స్వాగతోపన్యాసం చేశారు. టియుడబ్ల్యుజె రాష్ట్ర అధ్యక్షులు, కె. విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కె. రాం నారాయణ, ఐజెయు స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎం.ఎ. మాజీద్, జాతీయ కార్యదర్శి వై. నరేందర్ రెడ్డి, టియుడబ్ల్యుజె రాష్ట్ర కార్యదర్శులు కె. శ్రీకాంత్ రెడ్డి, వి.యాదగిరి,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని కిరణ్ కుమార్‌తో పాటు పాత్రికేయులు, సామాజిక కార్యకర్త లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎం.కె. వేణు మాట్లాడుతూ ప్రస్తుత యుద్ధ వార్తలను సిఎన్ఎన్, బిబిసి, అల్ జజీరా కంటే వేగంగా ట్విట్టర్ హ్యాండిల్ ద్వారా అందుతున్నాయన్నారు. సోషల్ మీడియా రాక తో వేగం పెరిగిందని, వార్తలను వెంటనే మరింత వేగంగా అందజేసేం దుకు అవకాశం లభించిందని, వార్తల శైలిలోనూ మార్పు వచ్చిందని వివరించారు. సోషల్ మీడియా డిస్ట్రిబ్యూషన్ ప్లాట్ ఫామ్‌గా ఉపయోగపడుతుందని, ఇంటర్‌నెట్ రాకతో మీడియా ప్రజాస్వామీకరణ జరిగి ఏకపక్ష ఆధిపత్యానికి తెరపడిందని తెలిపారు. నరేంద్రమోదీ ప్రధాని కాకముందు ప్రధానమంత్రుల కార్టూన్లు కనిపించేవని, ప్రస్తుతం దేశంలో అలాంటి పరిస్థితి లేదన్నారు. మీడియాలో ఏకఛత్రాధిపత్యం దిశగా జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో జర్నలిస్టుల పోరాటం కంటే, సమాజంలో వ్యక్తులు ఒకరితో ఒకరు చర్చించుకుంటే ఎక్కువ ఫలితం ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. జర్నలిస్టులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ కొత్త స్కిల్స్‌ను నేర్చుకోవాలని సూచించారు. సోషల్ మీడియాలో ఒక జర్నలిస్ట్ ఒక దగ్గర కూర్చొని చేసిన స్టోరీ క్షణాల్లో ప్రపంచం మొత్తం వెళ్తుందని, ఒకప్పుడు ఇంటింటికి తిరిగి న్యూస్ పేపర్స్ డిస్ట్రిబ్యూట్ చేసేవాళ్ళని, ఇప్పుడు ట్విట్టర్, ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ లాంటివి డిస్ట్రిబ్యూటర్స్‌గా ఉన్నాయని వివరించారు. యుపి ఎన్నికల్లో సోషల్ మీడియా ద్వారా బిజెపి ప్రతి వ్యక్తికీ దగ్గరయిందన్నారు. టెక్నాలజీ ఎలా వినియోగించుకోవాలనే అంశం తెలుసుకోవాల్సిన అవసరం యువతకు ఉన్నదని, సరైన విధానంలో తెలుసుకోకపోతే ఇబ్బందులు తలెత్తె ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సీనియర్ జర్నలిస్ట్ సోమశేఖర్ మాట్లాడు తూ నేటి ప్రస్తుత సమాజంలో సోషల్ మీడియా కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ప్రధాని మన్ కి బాత్ పేరుతో సోషల్ మీడియాను ఉపయోగిస్తున్నారని చెప్పారు. సోషల్ మీడియా వచ్చిన తర్వాత ఎవరికీ వాళ్ళు తమకు నచ్చిన విషయాలు రాస్తున్నారని, మాట్లాడుతున్నారని తెలిపారు.

# భగత్ సింగ్ వర్ధంతిని సామ్రాజ్యవాద వ్యతిరేక దినోత్సవంగా నిర్వహించాలి

## సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు సర్దార్ భగత్ సింగ్ వర్ధంతిని సోమవారం దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో సామ్రాజ్యవాద వ్యతిరేక దినోత్సవంగా నిర్వహించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సర్దార్ భగత్ సింగ్ బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి తన ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పించిన ఆ మహనీయుని స్ఫూర్తితో నేడు దేశవ్యాప్తంగా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందని, ఇందుకు అందరూ కూడా కలిసి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రపంచ వ్యాప్తంగా అమెరికన్ సామ్రాజ్యవాదం ప్రత్యేకించి డోనాల్డ్ ట్రంప్ రెండవసారి అధికారులకు వచ్చిన తర్వాత ఆయన ప్రపంచాన్ని బెదిరిస్తూ , వెనుజులా దేశం పై దాడి చేసి ఆ దేశ అధ్యక్షుడిని ఆయన భార్యను నిర్బంధించడమే కాకుండ గత 24 రోజులుగా అమెరికా ఇజ్రాయిల్ దేశాలు పెద్ద ఎత్తున యుద్ధాన్ని ప్రారంభించిందన్నారు. ఈ యుద్ధాన్ని అమెరికన్ పౌరుల్లో 62శాతం మంది వ్యతిరేకిస్తున్నారని, అయినా సరే ట్రంప్ యుద్ధాన్ని కొనసాగిస్తు ప్రపంచాన్ని భయపెట్టాలని చూస్తున్నారన్నారు. మరోవైపు క్యూబాను ఆర్థికంగా దిగ్బంధనం చేసి, వారికి డీజిల్ ,విద్యుత్తుతో పాటు వారికి సరైన ఆహారం లేకుండా చివరకు మందులు కూడా దొరకని పరిస్థితి కల్పించారని రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా సమయంలో క్యూబా తమ దేశ డాక్టర్లను ప్రపంచ దేశాలకు పంపించి వైద్య సేవలు అందించిన నేడు అలాంటి దేశంలో కూడా మందులు కూడా లేకుండా ప్రజలు ఆందోళన చెందే పరిస్థితిని కల్పించారని విమర్శించారు. ఇటీవల ప్రపంచంలో ఏనాడు లేని విధంగా ఉద్రిక్తతలు పెంచి, పోషిస్తూ అమెరికన్ సామ్రాజ్యవాదం నిసిగ్గుగా దేశాలపై దాడులు చేస్తున్నారన్నారు. ఇన్ని దాడులు దుర్మార్గాలు జరుగుతూ ఉంటే మన దేశ ప్రధాని నరేంద్ర మోదీ, భారత ప్రభుత్వం కనీసం ఈ దాడులను మానవత్వంగానైనా ఖండించలేని దిక్కుతోచని స్థితిలో ఉందంటే ఇంతకంటే సిగ్గుచేటున విషయం మరొకటి లేదన్నారు. అమెరికన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రపంచ వ్యాపితంగా ప్రజలంతా కుడా పోరాడుతున్న తరుణంలో మార్చి 23వ తేదీన దేశవ్యాప్తంగా పార్టీ శ్రేణులన్నీ నిరసన తెలుపాలని, సభలు సమావేశాల ద్వారా నిరసన తీర్మానాలు చేయాలని రామకృష్ణ కోరారు.

# యుద్ధంతో ఆర్థిక సంక్షోభం

## 29న హైదరాబాద్‌లో ‘నో వార్’ ప్రదర్శన

## తిరుమలకు అపకీర్తి తెచ్చిన వ్యక్తి పదవిలో కొనసాగడం తగదు: నారాయణ

**విశాలాంధ్ర బ్యూరోఅమరావతి:** ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ చేపడుతున్న యుద్ధం దేశవ్యాప్తంగా మానవాళిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని, ఈ యుద్ధం ద్వారా అమెరికాలోని కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూరుతున్నాయని సిపిఐ జాతీయ నాయకుడు డాక్టర్ కె.నారాయణ అన్నారు. ఈ యుద్ధం కారణంగా భయానకమైన మరణాలు సంభవిస్తున్నప్పటికీ, దాన్ని నివారించాలంటూ అమెరికాపై ఒత్తిడి తీసుకురావడంలో దేశ ప్రధాని నరేంద్ర మోదీ వైఖరి ప్రశ్నార్థకరంగా ఉందన్నారు. విజయవాడలోని దాసరి భవన్‌లో ఆదివారం మీడియా సమావేశంలో నారాయణ మాట్లాడుతూ... యుద్ధం ప్రధానంగా చమురు వనరులపై ఆధిపత్యం సాధించడానికి, కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చడానికి ట్రంప్ చేపడుతున్న చర్యగా అభివర్ణించారు. యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సంక్షోభ పరిస్థితులు ఏర్పడుతున్నాయని తెలిపారు. ఇప్పటికే భారత్‌లో పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు పెరిగిన విషయాన్ని గుర్తుచేశారు. గ్యాస్ కొరత ఏర్పడి హోటళ్లు, రెస్టారెంట్లు, హాస్టళ్లు మూతపడిన సందర్భాలు ఉన్నాయని, దీని ప్రభావం నేరుగా కార్మిక, శ్రామిక వర్గంపై పడుతోందన్నారు. ప్రపంచంలో అత్యధిక ప్రజాస్వామ్య దేశంగా గుర్తింపు పొందిన భారత్ ప్రధాని మోదీ... డోనాల్డ్ ట్రంప్ వైఖరిపై మౌనం పాటించడం సమంజసం కాదన్నారు. ఈ యుద్ధ అంశంపై మోదీపై ఒత్తిడి తేగల నాయకుడు...కేంద్ర ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు మాత్రమేనని ఆయన అభిప్రాయపడ్డారు. అమెరికా యుద్ధోన్మాద విధానాలను వ్యతిరేకిస్తూ, ఈ నెల 29న హైదరాబాద్‌లో ‘నో వార్’ (యుద్ధ వ్యతిరేక) పేరుతో అన్ని రాజకీయ పార్టీలతో కలిసి భారీ శాంతి ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలంతా భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. టిటిడి వంటి పవిత్ర క్షేత్రానికి అపకీర్తి తెచ్చే ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని చైర్మన్ పదవిలో కొనసాగించడం చంద్రబాబుకు తగదని అభిప్రాయపడ్డారు. ఆ పదవిలో ఉన్న వ్యక్తి కూడా ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూట మి నేతలు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ పేదలకు మూడు సెంట్లు, పట్టణ పేదలకు రెండు సెంట్ల స్థలం ఇవ్వడంతో పాటు గృహ నిర్మాణానికి రూ. ఐదు లక్షల ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఈ నెల 24న పార్టీ రాష్ట్ర సమితి పిలుపునిచ్చిన ఆందోళనల్లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా, ఇచ్చిన హామీల అమలులో పురోగతి కనిపించడం లేదని విమర్శించారు. టిడ్కో ఇళ్లను పూర్తిచేసి వెంటనే లబ్ధిదారులకు అందజేయాలని, అద్దె ఇళ్లలో నివసిస్తున్న పేదలకు అద్దెను ప్రభుత్వం భరించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టనున్నట్లు తెలిపారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు దోనేపూడి శంకర్ పాల్గొన్నారు.

# చెరువుల ప్రక్షాళనలో పౌరుల భాగస్వామ్యం





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ‘99 రోజుల కార్యాచరణ ప్రజా పాలన’లో భాగంగా మల్కాజిగిరి నగరపాలక సంస్థ పరిధిలో ని 33 చెరువులు, కుంటలను శుభ్రం చేసే కార్యక్రమం చేపట్టారు. కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు అధికారులు, సిబ్బందితో పాటు సుమా రు 300 మంది పౌరులు ఈ కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొన్నారు. ఈ బృహత్తర కార్యక్రమంలో భాగంగా చెరువుల గట్ల చుట్టూ ఉన్న సుమారు 44 మెట్రిక్ టన్నుల చెత్తను సేకరించారు. పౌరుల భాగస్వామ్యంతోనే నగరాభివృద్ధి సాధ్యమని ఎంఎంసి అదనపు కమిషనర్ సి.ఎన్.రఘుప్రసాద్ అన్నారు.

# ప్రభుత్వం చెల్లించిన అప్పులు రూ.1,67,742 కోట్లు మాత్రమే




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎఫ్‌ఆర్‌బిఎం రుణాల కింద రాష్ట్ర ప్రభుత్వం సుమా రు గడిచిన 24 నెలలుగా ప్రిన్సిపల్, వడ్డీ కలిపి మొత్తం రూ. 1,67,742 కోట్లు మాత్రమే చెల్లించిందని బిఆర్ఎస్ ఎంఎల్‌ఎసి దాసోజు శ్రవణ్ తెలిపారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్లు, ప్రత్యేక ప్రయోజన వాహనాలు (ఎస్‌పివి) తమ స్వంత ఆదాయాలతో చెల్లించిన అప్పులు రూ.1,02,744 కోట్లు అని, అలాగే కార్పొరేషన్లు స్వయంగా చెల్లించిన నాన్ గ్యారంటీ రుణాలు రూ. 33,717కోట్లు అని, ఈ రుణాలతో రాష్ట్ర ప్రభుత్వానికి ఎటువంటి ప్రత్యక్ష బాధ్యత లేకపోయినప్పటికీ, వాటినీ తమ ప్రభుత్వమే చెల్లించినట్లు సిఎం రేవంత్ రెడ్డి చూపిస్తున్నారని మండిపడ్డారు. సిఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా తన ప్రభుత్వం రూ. 3,30,570 కోట్లు అప్పులు తీర్చిందని ప్రకటించడం ప్రజలను తప్పుదారి పట్టించడమేనని అన్నారు. ఆర్థిక శాఖ నివేదిక ప్రకారం డిసెంబర్ 1వ తేదీ, 2023 నుండి 31 డిసెంబర్ 2025 వరకు ప్రభుత్వ అప్పుల చెల్లింపులను నాలుగు విభాగాలుగా చూపించారని, ఇందులో ఎఫ్‌ఆర్‌బిఎం ప్రిన్సిపల్ రూ. 40,660 కోట్లు, వడ్డీ రూ.56,350 కోట్లు కలిపి మొత్తం రూ.97,010 కోట్లు మాత్రమే ప్రభుత్వం చెల్లించిందని వివరించారు. ప్రభుత్వ గ్యారంటీతో ఎస్‌పివి తీసుకున్న, ప్రభుత్వం సర్వీస్ చేసిన రుణాలు లోన్స్ ఇందులో ప్రిన్సిపల్ రూ.47,043 కోట్లు, వడ్డీ రూ. 23,689కోట్లు కలిపి మొత్తం రూ.70,732 కోట్లు ప్రభుత్వం చెల్లించిందన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
ఖమ్మం
సోమవారం
23-03-2026
www.prajapaksham.in




## పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** రాష్ట్రాభివృద్ధి కొరకు అనేక సంక్షేమ పథకాలు ముఖ్యమంత్రి నేతృత్వంలో అమలు అవుతున్నాయని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు.ఆదివారం నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయంలో 48 మంది లబ్ధిదారులకు సీఎం ఆర్ ఎఫ్ పథకం ద్వారా మంజూరు అయిన 19,00,000 వేల చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కొరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని సిఎంఆర్ఎఫ్ పథకం చాలా ఉపయోగకరమైన పథకమని ఆయన తెలిపారు.ఈ పథకం ద్వారా పేదప్రజలకు ఎంతో లబ్ది చేకూరుతుందని అన్నారు.అర్హులైన వారందరు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈకార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్,ఇంద్రసేనారెడ్డి, నాయకులు,కార్యకర్తలు,లబ్ధిదారులు పాల్గొన్నారు.

## సర్పంచ్‌లు అభినందనీయులు

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో మండలంలోని గానుగబండ, రంగాపురం గ్రామాల్లో సిపిఐ పార్టీ తరుపున ఎన్నికైన కడియాల పద్మ అప్పయ్య, కట్టా కళ్యాణి అశోక్ లు వారి గ్రామాల్లో వున్న ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం ఆయనమండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో ఎప్పటికప్పుడు డ్రైనేజీ శుభ్రపరుస్తూ, అంధకారం లేకుండా వీధిలైట్లను వేయిస్తూ, రహదారి వెంట ఉన్న కంపచెట్లను తొలగిస్తూ, వేసవిలో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా బోర్లను రిఫేర్ చేయించి వాడకంలోకి తీసుకవచ్చారని అన్నారు. గ్రామంలో ఏ వీధిలై సిసిరోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు అవసరం ఉన్నాయో వాటిని ఎస్టిమేట్ తయారు చేసి అధికారులకు పంపించినట్లు తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్న వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## గ్రామాభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** అవంతీపురం గ్రామాభివృద్ధికి తాను నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని అవంతీపురం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రజా ప్రభుత్వం అనునిత్యం పల్లెల ప్రగతికి కృషి చేస్తూ గ్రామాల్లో కావాల్సిన మౌలిక వసతులు సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను, నూతన గ్రామపంచాయతీ భవనాలను నిర్మిస్తున్నామని అన్నారు. అనంతరం గ్రామానికి చెందిన పలువురు వార్డు సభ్యులు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరగా ఆయన వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి ఆహ్వానించి మాట్లాడారు. ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో అనేక మంది చేరుతుండడం శుభపరిణామమని అన్నారు.

## అమెరికా అడుగులకు మడుగులొత్తుతున్న మోదీ

సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** సామ్రాజ్యవాది అయిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నేడు ఇరాన్ దేశంపై యుద్ధాన్ని ఆపాలంటూ భారత ప్రధాని మోడి పార్లమెంట్‌లో తీర్మాణం కూడా ప్రవేశపెట్టకుండా ఆయన అడుగులకు మడుగులొత్తుతున్నారని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. జిల్లా సీపీఎం కమిటీ సహావేశం పట్టణంలో డబ్బికార్ మల్లేష్ అధ్యక్షతన జరగగా ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న యుద్ధం కారణంగా ఆయిల్ సంక్షోభం, గ్యాస్ ధరలు పెరిగి ప్రజలు కోలుకోలేని స్థితి ఏర్పడిందన్నారు. యుద్ధాన్ని ఐక్యరాజ్యసమితి వ్యతిరేకించినా ట్రంప్ తన ఆధిపత్య ధోరణి మానుకోవడం లేదన్నారు. దేశంలో ఉపాది హామి పథకాన్ని నిర్వీర్యం చేసి 120 రోజుల పని దినాలకు తగ్గించిందన్నారు. కార్మికుల హక్కులను కాలరాసేందుకు కార్మిక చట్టాలను లేబర్ కోడ్‌లుగా మార్చిందన్నారు. గిరిజనులకు అండగా ఉంటున్న మావోయిస్టులను అంతమొందించే విధంగా వారిని ఏరవేత కార్యక్రమం చేపట్టారన్నారు. అదేవిధంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రంగారెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని, ప్రజా ఉద్యమాల ద్వారా ప్రజలను చైతన్యం చేస్తామన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం ఉద్యమాలు జరిగినప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, నారి ఐలయ్య, చినపాక లక్ష్మీ నారాయణ, పాలడుగు నాగార్జున, వీరేపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## చేవెళ్ల ఎస్‌సి డిక్లరేషన్ మాటేమిటి?

**ప్రజాపక్షం/నకిరేకల్:** చేవెళ్ల ఎస్‌సి డిక్లరేషన్ పేరుతో దళితుల అభివృద్ధికి హామీలు ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం, బడ్జెట్‌లో మాత్రం దళిత సంక్షేమానికి భారీగా కోతలు విధించడం అన్యాయమని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వంటపాక కృష్ణ విమర్శించారు. ఆదివారం నకిరేకల్‌లో కెవిపిఎస్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ ప్రతులను దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బడ్జెట్‌లో ఎస్సీ సంక్షేమానికి రూ.40,232 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో కేవలం రూ.11,784 కోట్లు మాత్రమే కేటాయించడం సుమారు 70 శాతం కోతగా నిలిచిందన్నారు.అంబేద్కర్ ఓవర్సీస్ పథకానికి ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం దళితులపై నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. వెంటనే బడ్జెట్‌ను సవరించి కనీసం రూ.50,000 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రాచకొండ వెంకన్న, సకుంట్ల నరసింహ, ఏర్పుల తాజేశ్వర్, జమదగ్ని నాగార్జున, సైదులు, బక్కయ్య పాల్గొన్నారు.




# కాంగ్రెస్‌కి కార్యకర్తలే బలం

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రజాక్షేత్రంలోనే పార్టీ బలోపేతం కావాలి : టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

భువనగిరి వేదికగా డిసిసి నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



**ప్రజాపక్షం/యాదాద్రి:** కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే అసలైన బలమని, పార్టీ అధికారంలో ఉన్నా లేకపోయినా శాశ్వతంగా నిలిచేది కార్యకర్తల కృషితోనే అని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన డీసీసీ నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మహేష్ కుమార్ గౌడ్ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. జిల్లా ఎన్ఎస్‌యుఐ అధ్యక్షుడి స్థాయి నుంచి తాను నేడు రాష్ట్ర అధ్యక్ష పదవికి చేరుకున్నానంటే అది కేవలం కాంగ్రెస్‌లోనే సాధ్యమని, క్రమశిక్షణతో పనిచేసే ప్రతి సామాన్య కార్యకర్తకు పార్టీలో సముచిత గౌరవం, గుర్తింపు లభిస్తాయని ఆయన భరోసా ఇచ్చా రు. కార్యకర్తల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తు న్న ఇన్సూరెన్స్ స్కీమ్ దేశంలోనే ఒక చారిత్రాత్మక నిర్ణయమని ఆయన కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తోందని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ అప్పులమయంగా మారిందని, కేవలం కేసీఆర్ కుటుంబానికి మాత్రమే ఉద్యోగాలు వచ్చాయని విమర్శించారు. ఆనాడు జరిగిన లక్షల కోట్ల దోపిడీని తుడి చేస్తూ, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి న కొద్ది కాలంలోనే 65 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగుల కలలను సాకారం చేసిందన్నారు. జిల్లాల పర్యటనను భువనగిరి నుంచే ప్రారంభించానని, బుధవా రం మెదక్ జిల్లాలో పర్యటించనున్నట్లు ఆయన వెల్లడించారు.

**పనితనమే నాయకుడికి గీటురాయి : ఎంపి చామల**

రాజకీయాల్లో నాయకుడి పనితనమే అతనికి అసలైన గీటురాయి అని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎన్నికల్లో మొదటిసారి గెలవడం పార్టీకున్న బలంతో సాధ్యం కావొచ్చు కానీ, రెండోసారి గెలవాలంటే మాత్రం చేసిన అభివృద్ధి, ప్రజలతో ఉండే మమేకం, నిరంతర సాన్నిహిత్యం మాత్రమే తోడ్పడతాయని ఆయన స్పష్టం చేశారు.

**పదవులు అలంకారప్రాయం కాదు..**
**బాధ్యతగా చేపట్టాలి : ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య**

పదవులు కేవలం అలంకారప్రాయం కాదని, వాటిని ఒక బాధ్యతగా గుర్తించి ప్రజలకు సేవ చేయాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే , డీసీసీ అధ్యక్షులు బీర్ల ఐలయ్య పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత డీసీసీ నాయకులపైనే ఉందన్నారు. పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు తక్షణమే వార్డుల వారీగా కమిటీలను వేయాలని ఆదేశించారు. మిమ్మల్ని నమ్ముకున్న ప్రజలకు అండగా ఉండి సేవ చేయడానికే ఈ పదవులని, కార్యకర్తలు క్రమశిక్షణతో పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, మందుల సామేల్, కార్పొరేషన్ చైర్మన్ శోభా రాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేస్ చిస్తి, మున్సిపల్ చైర్మన్ తంగేళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, కాంగ్రెస్ నాయకులు బీర్ల శంకర్, కానుగు బాలరాజు, ఎండి నజీర్, ఎలిమినేటి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## 'డ్రగ్స్'ను అరికట్టడంలో విద్యార్థులదే కీలకపాత్ర

**ప్రజాపక్షం/హాలియా:** డ్రగ్స్‌ని అరికట్టడంలో విద్యార్థులే కీలక పాత్ర పోషించాలని హాలియా సిఐ దేశిడి సతీష్ రెడ్డి అన్నారు. ఆదివారం ఎస్ఎఫ్ఐడివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన 2కే రన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగత్ సింగ్ విద్యార్థి యువజన ఉత్సవాల సందర్భంగా సే నో టు డ్రగ్స్ నినాదంతో నిర్వహించిన ఈ 2కే రన్‌తో యువత డ్రగ్స్‌పై పోరాడాలన్నారు. సమాజంలో పెరిగిపోతున్న డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టడంలో విద్యార్థులదే కీలకపాత్ర అని చెప్పారు. గంజాయి, మత్తు పదార్థాలు సేవించడం ద్వారా అనారోగ్యంతో పాటు కుటుంబం కూడా తీవ్రంగా నష్టపోతుందని సూచించారు. డ్రగ్స్‌పై పోలీస్ శాఖ ఉక్కు పాదం మోపి మత్తు పదార్థాలను అరికట్టేందుకు పూర్తిస్థాయిలో కఠినంగా వ్యవహరిస్తుందని చెప్పారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా యువతలో చైతన్యం తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్దవూర ఎంఈఓ తరి రాము, నరేష్, మల్లం మహేష్, కొండేటి శ్రీను, కోరే రమేష్, అవుతా సైదయ్య, నల్లవెల్లి జగదీష్, మంద నరేందర్ రెడ్డి, రాజు,కత్తి శ్రీనివాస్ రెడ్డి, వెంకన్న,ధనమ్మ, కోటిరెడ్డి పాల్గొన్నారు.

## సాగర్‌ను సందర్శించిన మహారాష్ట్ర ఎన్నికల కమిషనర్



**ప్రజాపక్షం/నందికొండ:** అంతర్జాతీయ పర్యాటక కేంద్రం నాగార్జునసాగర్‌ను మహారాష్ట్ర రాష్ట్ర ఎన్నికల కమిషనర్ దినేష్ వామరే కుటుంబ సమేతంగా సందర్శించారు. హైదరాబాద్‌లోని ఇవిఎంల తయారీ సంస్థ ఈసీఐఎల్ ఉన్నతాధికారులతో మహారాష్ట్ర ఎన్నికల కమిషనర్ కార్యదర్శి సురేష్ కాకాని కలిసి సమావేశమైన అనంతరం,సాగర్ సందర్శనలో భాగంగా విజయ విహార్ అతిథి గృహానికి చేరుకున్నారు.వారికి తిరుమలగిరి సాగర్ తహసీల్దార్ అనిల్ కుమార్,ప్రోటోకాల్ ఆర్ఐ దండ శ్రీనివాస్ రెడ్డి,విజయ విహార్ మేనేజర్ కిరణ్ ఘన స్వాగతం పలికారు.అనంతరం టూరిజం లాంచీలో నాగార్జునకొండ మ్యూజియంను సందర్శించారు. నాగార్జునకొండలో పునర్నిర్మించిన సింహల విహారం, అశ్వమేధ యజ్ఞశాల, మహాస్తూపాన్ని వీక్షించారు.తదనంతరం బుద్ధవనం చేరుకుని బుద్ధ పాదాల వద్ద పుష్పాంజలి ఘటించి వందనం సమర్పించారు. బుద్ధవనం సందర్శనలో భాగంగా బుద్ధ చరితవనం,జాతకవనం,ధ్యానవనం, స్తూపవనాలను సందర్శించి,మహాస్తూపంలోని సమావేశ మందిరంలో బుద్ధవనం విశేషాలను తెలియజేసే లఘు చిత్రాన్ని వీక్షించారు.అనంతరం మహాస్తూపంలోని ధ్యాన మందిరంలో బుద్ధ జ్యోతులను వెలిగించారు.ఈ సందర్భంగా బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, ఎస్టేట్ మేనేజర్ రవిచంద్రులు వారిని బుద్ధవనం కండువాలు, బ్రోచర్లతో సత్కరించారు. స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ నాగార్జునకొండ, బుద్ధవనం చారిత్రక విశేషాలను వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఇసిఐఎల్ సంస్థ ప్రతినిధి సౌరబ్, లైజనింగ్ అధికారులు సుధీర్ రెడ్డి, పాండు, అభిషేక్, స్థానిక ఎస్సై ముత్తయ్య పాల్గొన్నారు.

## మహిళల ఆర్థిక సాధికారతకు మహిళా సంఘాలు కీలకం

దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్



**ప్రజాపక్షం/డిండి:** కోటి మంది మహిళా సంఘాల్లోని మహిళలను కోటీశ్వరులను చేయాలన్నదే ప్రభుత్వ సంకల్పమని ఆ దిశగా ప్రభుత్వం ముందు కెళ్తుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు.ఆదివారం డిండి మండలంలోని సోమ్లా తండా,కామేపల్లి గ్రామాలలో ఎన్ఆర్‌జిఎస్ నిధుల నుండి మంజూరైన 10.00లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న స్త్రీశక్తి భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మండలంలోని ఎర్రారం,టీ.గౌరారం,ఖానాపూర్,పెద్ద తండా, చెరుకు పల్లి గ్రామాలలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు.అనంతరంటీ.గౌరారం,ఖానాపూర్ గ్రామాలలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొని,ఇంటి యజమానులకు శుభాకాంక్షలు తెలిపారు.టీ.గౌరారం గ్రామంలో హై స్కూల్ ప్రహరీ గోడ,ఆహార ధాన్య నిల్వ గోదాం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, మహిళా సంఘాల బలోపేతానికి స్త్రీశక్తి భావనలు ఎంతో దోహదపడతాయనీ,నిర్ణీత కాలపరిమితిలోగా నాణ్యతతో ఈ భవన నిర్మాణాలను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొంతినేని వెంకటేశ్వర రావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి,యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జర్పుల లక్ష్మి,సర్పంచ్‌లు బొడ్డుపల్లి వరసాల లక్ష్మయ్య,ఇస్లావత్ రుక్కి,రాములు, లింగయ్య పాల్గొన్నారు.


## అంతరిస్తున్నా... కన్నెత్తి చూడని అధికారులు





**ప్రజాపక్షం/మోతె:** ఆటవీ సంరక్షణ ఎవరి బాధ్యత అటు వైపు కన్నెత్తి చూడని అధికారుల తిరుకు రోజు రోజుకు అంతరిస్తున్న ఆటవి సంపద ప్రతి సంవత్సరం కోట్లు ఖర్చు చేసి ప్రతి గ్రామానికి ఒక నర్సరీని ఏర్పాటు చేసి ప్రతి ఇంటికి ప్రతి ఒక్కరికి పండ్లు, పూల మొక్కలతో పాటు నీడనిచ్చే మొక్కలు పెంచాలని ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న వన సంపద పెంచ దంతో పాటు పెరిగి పెద్దైన కొన్ని యేండ్ల నాటి వృక్ష సంపద నెలరాలిపోతున్న ఎవరికి పట్టనట్లు కన్పించడం లేదు. రాజకీయ పలుకుబడితో పాటు ఆర్థిక అవసరాలు తీర్చే స్థోమత కలిగిన నాయకులు వ్యాపారులు యదేశ్చగా ఆటవిఆ సంపదను కొల్లగొట్టి లక్షలు పొగేస్తున్న అక్రమ వ్యాపారులకు ముడుపులు పుచ్చుకుని నిద్ర నటిస్తున్న అధికారులకు రోజు రోజుకు కాసుల వర్షం కురుస్తున్నాయి. మండలంలోని కొందరు కలప వ్యాపారులకు అడ్డు అదుపు లేకుండా పర్మిషన్ పేరుతో అటవిని ధ్వంసం చేస్తున్నారని పలు గ్రామాల ప్రజలు చర్చించుకుంటున్నారు. బొగ్గు బట్టీలతో కాలుష్యం పెరుగుతున్న అడిగే వారు లేక నెలలో బొగ్గుబట్టీల వ్యాపారం లక్షలు పొగు చేసుకుంటూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. ఇది చాలక మాకు ఎవరు అడ్డు అన్న చందంగా మండలంలోని పలు గ్రామాల్లో బొగ్గు బట్టీల దర్శనం ఊరులోకి వెళ్తుండగా కన్పిస్తుంటాయి. తక్షణమే ఈ కలప వ్యాపారులకు అడ్డుకట్ట వేసి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని గ్రామాల ప్రజలు అధికారులను కోరుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వృక్షాలను నరకకుండా, అటవీ శాఖ అధికారులు ముడుపులు తీసుకోకుండా ఉంటే వృక్షాలను రక్షించుకోవచ్చని రైతులు వేడుకుంటున్నారు.

## ఇంట్లో చోరీ రూ.50 వేల నగదు అపహరణ



**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండల పరిధిలోని శివన్నగూడ గ్రామంలో చోరీ ఘటన చోటుచేసుకుంది.గ్రామానికి చెందిన మేకల నవిత తన కుమారుడితో కలిసి నివాసముంటోంది.శనివారం రాత్రి సుమారు 9 గంటల సమయంలో ఆమె తన ఇంటికి తాళం వేసి, అదే గ్రామంలో ఉన్న తన తల్లి ఇంటికి నిద్రించడానికి వెళ్లింది. ఈ అవకాశాన్ని వినియోగించుకున్న గుర్తు తెలియని దొంగలు ఇంటి తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. అనంతరం బీరువాలో ఉంచిన సుమారు రూ.50 వేల నగదును అపహరించారు. తరువాత ఉదయం ఇంటికి వచ్చిన నవిత తాళం పగిలి ఉండటాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని ఎస్సై మొనగాల కృష్ణారెడ్డి తెలిపారు. పోలీసులు ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు.




## ప్రతీ చెరువునూ నింపి రైతులకు సాగునీరు అందిస్తాం

రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** 'నియోజకవర్గంలోని ప్రతి చెరువునూ నింపి, రైతులకు సాగునీరు అందించడమే మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. ఎన్నో ఏళ్లుగా నీటి కోసం ఎదురుచూస్తున్న ఆలేరు రైతాంగానికి అండగా ఉండి, వారి జీవితాల్లో వెలుగులు నింపుతాం' అని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య స్పష్టం చేశారు. యాదగిరిగుట్ట మండలం మల్లాపూర్ గ్రామంలో మల్లన్న సాగర్ జలాలతో నిండి అలుగు పోస్తున్న చెరువుకు ఆయన ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో కలిసి సంతోషాన్ని పంచుకుంటూ ఆయన మాట్లాడారు. సాగునీటి కల సాకారం గతంలో నీటి ఎద్దడితో ఇబ్బంది పడిన మల్లాపూర్ ప్రాంతం, నేడు మల్లన్న సాగర్ జలాలతో కళకళలాడుతుండటం శుభసూచకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. చెరువులు నిండితేనే భూగర్భ జలాలు పెరుగుతాయని, తద్వారా పచ్చని పంటలతో గ్రామాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఆలేరు నియోజకవర్గాన్ని పూర్తిగా అభివృద్ధి చేసి, రైతుల జీవితాల్లో వెలుగులు నింపడమే తమ సంకల్పమని, రైతు ఆనందంగా ఉండటమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మంగ సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు వార్డు మెంబర్లు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రియల్ ఎస్టేట్ రంగంలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** రియల్ ఎస్టేట్ రంగంలో ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర రియల్ ఎస్టేట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పతంగి వీరస్వామిగౌడ్ అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎస్ఎస్ గార్డెన్స్‌లో జరిగిన అసోసియేషన్ నూతన రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన వివిధ జిల్లాల అధ్యక్షులకు నియామక పత్రాలు అందజేసిన అనంతరం మాట్లాడారు. 5 ఎకరాల లోపు వెంచర్లు చేసిన ప్రాంతాలలో ప్లాట్ నెంబర్లతోనే రిజిస్ట్రేషన్ చేసేలా ప్రత్యేక జీవో తీసుకరావాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అనంతరం నూతన రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన పతంగి వీరస్వామిగౌడ్‌ను రాష్ట్ర 33 జిల్లాల నుండి వచ్చిన ప్రతినిధులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

**రాష్ట్ర కమిటీ ఎన్నిక :** రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా నిమ్మల శ్రీనివాసగౌడ్, రాష్ట్ర గౌరవ సలహాదారులుగా కుమ్మరికుంట్ల లింగయ్య, పందిరి మల్లేష్, రాష్ట్ర అధ్యక్షులుగా పతంగి వీరస్వామిగౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మాదగాని శ్రీనివాసగౌడ్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా బొమ్మగాని శ్రీనివాసగౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నల్లమాన చంద్రశేఖర్, బండి నాగేశ్వరరావు, బెల్లంకొండ యాదగిరి, రాష్ట్ర కార్యదర్శులుగా ఖమ్మంపాటి అంజయ్య, పర్వతం వెంకటేశ్వరచారి, అమరవాది శ్రావణ్, రాష్ట్ర సహాయ కార్యదర్శులుగా సాముల జగ్గారెడ్డి, ఏటా సతీష్, మొక్క రాములు ఎన్నుకున్నారు.

## ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తా

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** రాష్ట్ర ప్రభుత్వం అవాలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తూ జిల్లా వ్యాప్తంగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆమ్ ఆద్మీపార్టీ జిల్లా అధ్యక్షుడు యార శ్రీను పేర్కొన్నారు.ఆదివారం నల్లగొండలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ తనపై నమ్మకంతో అమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా తనను నియమించిన ఆ పార్టీ తెలంగాణ ఇంచార్జి ప్రియాంక కాక్కర్‌కి,రాష్ట్ర కన్వీనర్ హేమాజిల్లోకి, వర్కింగ్ ప్రెసిడెంట్ రాముగౌడ్‌కి, జనరల్ సెక్రటరీ అన్సారీకి ధన్యవాదములు తెలియజేస్తున్నామన్నారు. తనకిచ్చిన బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజా సమస్యల పైన పోరాడుతానని పేర్కొన్నారు. అదేవిధంగా తమ ఎన్నికకు సహకరించిన నాయకులకు, కార్యకర్తలకు, ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు.

### జైళ్ల పరిస్థితులపై

# సమగ్ర వివరాలు పంపండి

**రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు 'సుప్రీం' ఆదేశాలు**

**న్యూఢిల్లీ:** దేశంలోని అన్ని రాష్ట్రాలు మరియు కేంద్ర పాలిత ప్రాంతాలకు జైళ్ల పరిస్థితులపై తాజా, సమగ్ర వివరాలను సమర్పించాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. ముఖ్యంగా జైళ్లలో ఉన్న అధిక జనసాంద్రత (ఓవర్‌క్రౌడింగ్) సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈ ఆదేశాలను న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన సుప్రీం కోర్టు బెంచ్ జారీ చేసింది. కోర్టు సూచనల ప్రకారం, ప్రతి జైలుకు సంబంధించి, అనుమతించిన సామర్థ్యం (సాంక్షన్డ్ కెపాసిటీ), ప్రస్తుతం ఉన్న ఖైదీల సంఖ్య, ప్రతి జైలులో ఎంత మంది అధికంగా ఉన్నారు వంటి వివరాలతో సమగ్ర సమాచారం ఇవ్వాలి. ఇది సాధారణ గణాంక సేకరణ మాత్రమే కాకుండా, ప్రతి జైలు పరిస్థితిని స్పష్టంగా అర్థం చేసుకోవడానికి అవసరమైన చర్యగా నిపుణులు పేర్కొంటున్నారు. ఇప్పటివరకు రాష్ట్రాలు సమర్పించిన డేటా 2023 సంవత్సరానికి చెందినది. ఈ పాత సమాచారం ఆధారంగా ప్రస్తుత పరిస్థితిని అంచనా వేయడం కష్టమని కోర్టు అభిప్రాయపడింది. అందువల్ల తాజా, సమకాలీన డేటా లేకుండా సరైన నిర్ణయాలు తీసుకోవడం అసాధ్యమని పేర్కొంది. ఈ ఆదేశం కేవలం సామర్థ్యం, ఖైదీల సంఖ్యతో మాత్రమే పరిమితం కాలేదు. మహిళల జైళ్ల గురించి కూడా ప్రత్యేకంగా వివరాలు ఇవ్వాలని కోర్టు సూచించింది. మహిళా ఖైదీల కోసం ఉన్న సదుపాయాలు, ముఖ్యంగా వారితో కలిసి జైల్లో నివసిస్తున్న పిల్లల విద్య, ఆరోగ్యం, సంక్షేమానికి తీసుకున్న చర్యలపై వివరాలు ఇవ్వాలని సూచించింది. ఇది జైలు వ్యవస్థను మానవ హక్కుల కోణంలో పరిశీలిస్తున్నట్లు చూపిస్తుంది. ఇంకా, జైళ్లలో పనిచేసే సిబ్బంది సంఖ్య, ఖాళీలు, వాటిని భర్తీ చేయడానికి తీసుకున్న చర్యల గురించి కూడా సమాచారం ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. సిబ్బంది కొరత కూడా జైళ్లలో సమస్యలను పెంచే ముఖ్య కారణమని కోర్టు భావిస్తోంది. ఈ మొత్తం సమాచారాన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు తమతమ హోం సెక్రటరీల ద్వారా ప్రమాణపూర్వక అఫిడవిట్ల రూపంలో మే 18, 2026లోపు సమర్పించాలి. ఆ తర్వాత ఈ వివరాలను సీనియర్ న్యాయవాది గౌరవ్ అగర్వాల్ సమీక్షించి, కోర్టుకు సమగ్ర నివేదిక అందిస్తారు. ఈ కేసు తదుపరి విచారణ మే 26న జరగనుంది. ఈ చర్య ద్వారా కోర్టు జైళ్లలో ఉన్న సమస్యలను తీవ్రంగా పరిగణిస్తూ, సమర్థవంతమైన పరిష్కారాల కోసం దిశానిర్దేశం చేస్తోంది.



### న్యాయ వ్యవస్థ బలోపేతానికే ఏఐ

# భర్తీ చేయడానికి కాదు..

**సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్య కాంత్**

**న్యూఢిల్లీ:** కృత్రిమ మేధస్సు (ఏఐ) న్యాయ వ్యవస్థను బలోపేతం చేయాలే తప్ప, దానిని భర్తీ చేయడానికి కాదని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ వ్యాఖ్యానించారు. బెంగళూరులోని కర్నాటక జ్యుడిషియల్ అకాడెమీలో నిర్వహించిన సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, న్యాయ వ్యవస్థలో భారీ స్థాయిలో ఉన్న డేటా, కేసుల వివరాలు, పత్రాలను నిర్వహించడంలో ఏఐ చాలా ఉపయోగపడుతుందని అన్నారు. ఉదాహరణకు, కేసులలో ఉన్న నమూనాలను గుర్తించడం, సమాచారాన్ని వేగంగా విశ్లేషించడం, విధానపరమైన ఆలస్యాలను తగ్గించడం వంటి పనుల్లో ఏఐ ఒక శక్తివంతమైన సాధనంగా పనిచేయగలదని చెప్పారు. ఈ దృష్టిలో ఏఐ అనేది సహాయక పాత్ర పోషించాలని, అంటూ, న్యాయ నిర్ణయాల వంటి కీలక అంశాల్లో ఏఐకి అధిక ప్రాధాన్యం ఇస్తే, పారదర్శకత, బాధ్యత దెబ్బతినే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. న్యాయ తీర్పులు ఇవ్వడం అనేది కేవలం డేటా విశ్లేషణతో ముగిసే ప్రక్రియ కాదని, ఇందులో న్యాయమూర్తుల అనుభవం, వివేచన, సామాజిక అవగాహన కూడా కీలక పాత్ర పోషిస్తాయని వ్యాఖ్యానించారు. అందువల్ల తుది తీర్పు ఇవ్వడం మాత్రం మనుషుల చేతుల్లోనే ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఏఐ అనేది ఒక సాధనం మాత్రమేనని, దిశను నిర్దేశించేది మాత్రం మానవ మేధస్సేనని ఆయన అన్నారు. న్యాయమూర్తులు తమ అనుభవం, విశ్లేషణా సామర్థ్యంతో తీర్పులు ఇవ్వాలని, ఏఐ కేవలం వారికి సహాయపడాలని అన్నారు. ఇది న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యాన్ని కాపాడటానికి అవసరమైన సమతుల్యతను కల్పిస్తుందని చెప్పారు. కాగా, కర్నాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ విభు బఖ్రూ మాట్లాడుతూ భవిష్యత్తులో ఏఐ కేవలం సహాయకంగా ఉంటుందా, లేక న్యాయమూర్తుల స్థానాన్ని తగ్గించే స్థాయికి చేరుతుందా అన్న సందేహాన్ని వ్యక్తం చేశారు. అదే సమయంలో, ఏఐ ద్వారా కేసులపై ముందస్తు విశ్లేషణ చేయడం, ఆన్‌లైన్ వివాద పరిష్కార వ్యవస్థలను మెరుగుపరచడం ద్వారా వేగంగాను, తక్కువ ఖర్చుతోనూ కేసులను పరిష్కరించవచ్చని ఆయన చెప్పారు. ఏఐ వల్ల కోర్టు తీర్పులను స్థానిక భాషల్లో వేగంగా అనువదించడం సాధ్యమైందని చెప్పారు. దీని వల్ల గ్రామీణ ప్రాంతాల ప్రజలకు న్యాయం చేరువ అవుతుందని అన్నారు. న్యాయవాదులు తమ క్లయింట్లతో సులభంగా కమ్యూనికేట్ చేయగలుగుతారని పేర్కొన్నారు.




### ఒబిసి ఉద్యమ నాయకుడు షబ్బీర్ అన్సారీ మృతి



**జాల్నా:** ఒబిసిఉద్యమానికి ప్రముఖ నాయకుడు షబ్బీర్ అహమ్మద్ అన్సీరీ మహారాష్ట్రలోని జల్నాలో దీర్ఘకాల అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన వయస్సు 79 సంవత్సరాలు. ఆల్ ఇండియా ముస్లిం ఒబిసి ఆర్గనైజేషన్ జాతీయ అధ్యక్షుడిగా ఆయన నాలుగు దశాబ్దాలకు పైగా సామాజిక న్యాయం, వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం పనిచేశారు. రిజర్వేషన్లు, సమాన హక్కుల కోసం దేశవ్యాప్తంగా ప్రజలను చైతన్యపరిచారు. మండల్ కమిషన్ సిఫార్సుల అమలు కోసం కృషి చేసి, ముస్లిం సమాజంలోని వెనుకబడిన వర్గాలను ఒబిసి కేటగిరీలో చేర్చేందుకు పోరాడారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు, ఆరు కుమార్తెలు ఉన్నారు.

# ఫ్లెమింగోలకు కష్టకాలం!

**కనుమరుగవుతున్న పక్షుల నివాస ప్రదేశాలు**



**ముంబయి:** నవి ముంబై ప్రాంతంలో ఫ్లెమింగోపక్షుల నివాస ప్రదేశాలు తీవ్రంగా క్షీణిస్తున్నాయని పర్యావరణ కార్యకర్తలు హెచ్చరిస్తున్నారు. డిపిఎస్ లేక్ నెరూల్, ఎన్ఆర్ఐ లేక్ నెరూల్, టిఎస్ చాణక్య లేక్ అనే మూడు కీలక సరస్సులు విషపూరితంగా మారుతున్నాయని తాజా పరీక్షలు వెల్లడించాయి. ఇవి థానే క్రీక్ ఫ్లెమింగ్ సాంక్చువరీకి అనుబంధంగా ఉన్న ఉపచిత్తడి బయళ్లు కావడం వల్ల ఈ పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. సాధారణంగా నవంబర్ నుండి మే వరకు ఈ ప్రాంతంలో ఫ్లామింగోలు కనిపిస్తాయి. ముఖ్యంగా జనవరి నుంచి మార్చి వరకు వీటి సంఖ్య ఎక్కువగా ఉండటంతో పక్షి ప్రేమికులు పెద్ద సంఖ్యలో వచ్చి వీటిని వీక్షిస్తారు. అయితే ఈసారి ఫ్లామింగోలు రాకపోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నది. ఇది సహజ వాతావరణంలో ఏదో మూలపూర్వక మార్పు జరిగిందని సూచిస్తోంది. పర్యావరణ సంస్థ నాట్‌కనెక్ట్ ఫౌండేషన్ నిర్వహించిన నీటి నమూనాల పరీక్షలు పరిస్థితి ఎంత దిగజారిందో స్పష్టంగా చూపిస్తున్నాయి. పరీక్షా ఫలితాలను అనుసరించి, టిడిఎస్ (మొత్తం కరిగిన ఘనాలు), పిహెచ్ స్థాయి, బిఓడి (జీవరసాయన ఆక్సిజన్ అవసరం), సిఓడి (రసాయన ఆక్సిజన్ అవసరం) స్థాయిలు ప్రమాదకరంగా ఉన్నాయి. అక్కడ నీరు సహజంగా ప్రవహించడం లేదు. సాధారణంగా ఈ చిత్తడి నేలలు సముద్రపు అలల ప్రభావంతో శుభ్రపడాలి. కానీ ఇప్పుడు ఆ ప్రవాహం అడ్డంకులకు గురై, నీరు నిలిచిపోయి కాలుష్యంతో నిండిపోతోంది. ఈ పరిస్థితి ఫ్లామింగోలకు ప్రత్యక్షంగా హానికరం. ఇవి ప్రధానంగా ఆల్గీ , సూక్ష్మ జీవులపై ఆధారపడి జీవించడమే ప్రమాదానికి కారణం. నీటి నాణ్యత క్షీణిస్తే, ఆహార గొలుసు కూలిపోతుంది. అప్పుడు ఆ ప్రదేశం జీవించడానికి అనుకూలంగా ఉండదు. గతంలో కొన్ని సందర్భాల్లో ఫ్లెమింగోలు కాలుష్య ప్రాంతాలకు కూడా తగినంతగా అలవాటు పడ్డాయి. కానీ ఇప్పుడు అవి పూర్తిగా రాకపోవడం, ఈ వ్యవస్థ ఒక ప్రమాదకరమైన స్థాయిని దాటిందని సూచిస్తోంది. కార్యకర్తలు ఈ పరిస్థితికి ప్రధాన కారణంగా పాలనాపరమైన వైఫల్యాన్ని సూచిస్తున్నారు. ముఖ్యంగా సిటీ అండ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌పై తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. అభివృద్ధి పేరుతో ప్రకృతి వనరులను నిర్లక్ష్యం చేయడం వల్ల ఈ సమస్య వచ్చిందని అంటున్నారు. అలాగే, మహారాష్ట్ర కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ, అటవీ శాఖ కూడా సరైన చర్యలు తీసుకోలేదని విమర్శిస్తున్నారు. ఈ చిత్తడి నేలలు కేవలం పక్షుల నివాసాలే కాకుండా ప్రజల సహజ సంపద కూడా. ఇవి భూగర్భ జలాలను పరిరక్షించడం, జీవ వైవిధ్యాన్ని నిలుపుకోవడం వంటి అనేక కీలక పాత్రలు పోషిస్తాయి. ఇప్పుడు ఇవి కాలుష్యంతో నిండిపోతే, దీని ప్రభావం పర్యావరణంపై మాత్రమే కాకుండా మన ఆరోగ్యంపై కూడా పడుతుంది. పర్యావరణ కార్యకర్తలు దీనిని వెట్‌ల్యాండ్ ఎమర్జెన్సీగా ప్రకటించి, వెంటనే ప్రభుత్వ జోక్యం అవసరమని కోరుతున్నారు. పర్యావరణంలో సమస్యలు ఎంత తీవ్రమయ్యాయో తెలియజేసే సూచికగా ఈ హెచ్చరికలను భావించాల్సి ఉంటుంది. పరిస్థితిని సరిచేయకపోతే, భవిష్యత్తులో మరింత పెద్ద పర్యావరణ సంక్షోభం ఎదురయ్యే అవకాశం ఉంది.

# యువతరానికి మార్గదర్శకులు భగత్ సింగ్, సుఖ్‌దేవ్, రాజ్ గురు



**న్యూఢిల్లీ:** మనం నేడు స్వేచ్ఛావాయువులు పీల్చుకుంటున్నామంటే, దాని వెనుక ఎంతో మంది త్యాగం ఉంది. పోరాటం ఉంది. అంతులేని పట్టుదల ఉంది. ఎంచుకున్న మార్గాలు వేరుకావచ్చుగానీ, స్వాతంత్ర్య కాంక్ష మాత్రం అందరిలో ఒకే రకంగా ఉంది. మొదటి స్వాతంత్ర్య యుద్ధం తర్వాత, అలాంటి చారిత్రక ఘటనగా 1931 , మార్చి 23వ తేదీని పేర్కోవాలి. ఆ రోజు యువ దేశ భక్తులు భగత్ సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురును బ్రిటిష్ ప్రభుత్వం ఉరి తీసింది. దేశం కోసం వారు చేసిన త్యాగం, భారత స్వాతంత్ర్య యుద్ధాన్ని మరింతగా ప్రభావితం చేసింది. లక్షలాది మంది వీధుల్లోకి వచ్చి, స్వాతంత్ర్యం కోసం నినదించడానికి అవసరమైన ధైర్యాన్నిచ్చిన ఆ యువత్రయం త్యాగం సదా స్మరణీయం. అందుకే ఆ రోజు 'షహీద్ దివస్' లేదా అమరుల దినోత్సవంగా స్థిరపడింది. దేశభక్తిని నరనరాన జీర్ణించుకున్న యువకులు భగత్ సింగ్, సుఖ్‌దేవ్ తాపర్, శివరామ్ రాజ్‌గురు త్రయం హిందుస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ అసోసియేషన్ సభ్యులుగా పోరాట భూమిలోకి దిగారు. బ్రిటిష్ పాలనను వ్యతిరేకిస్తూ యువ విప్లవ జ్యోతులుగా వెలుగొందారు. లాలా లజపతిరాయి మరణానికి స్పందనగా నాటి బ్రిటీష్ అధికారి జె పి సార్స్‌ను చంపారనే అభియోగాల మీద ఈ ముగ్గురు యువకులను అరెస్టు చేసి 'లాహోర్ కాన్స్పిరసీ' కేసును కొనసాగించిన బ్రిటిష్ వలస పాలకులు ఈ ముగ్గురికీ ఉరి శిక్ష విధించారు. అంతర్జాతీయ పౌర సమాజం క్షమా భిక్ష పెట్టాలని వేడుకున్నప్పటికీ కక్ష పూరితంగా వలస పాలకులు 23 మార్చి 1931న వీరిని ఉరి తీయడం జరిగింది. అంతకు ముందు, 1929, ఏప్రిల్ 8వ తేదీన, 'ఇంక్విలాబ్ జిందాబాద్' అని నినదిస్తూ భగత్ సింగ్ సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీపై బాంబులు విసిరాడు. అతనిపై అధికారులు కేసును నమోదు చేసి లాహోర్ జైల్‌లో ఉరి శిక్ష అమలు చేసారు. దేశవాసుల అశ్రునయనాల మధ్య వారి పార్థివ దేహాలను సుత్లజ్ నదీ తీరాన దహన సంస్కారాలు జరిగాయి. ఈ ముగ్గురు అగ్గిరవ్వలు చూపిన తెగువ, దేశభక్తి, అంకితభావం, త్యాగగుణం, ధైర్య సాహసాలు నేటి భారతీయ యువతకు దారి దీపాలుగా నిలుస్తున్నాయి. వారి త్యాగాలను గుర్తు చేసుకుంటూ, వారు అందించిన స్వాతంత్ర్యాన్ని భాధ్యతాయుతంగా అనుభవిస్తూ దేశ అభ్యున్నతికి సమిధలుగా మారాలని కోరుకుందాం.

### రోప్‌వే ప్రమాదంలో

**మహిళ మృతి..ఆరుగురికి గాయాలు**

**మహాసమ్మండ్ (ఛత్తీస్‌గఢ్):** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని మహాసముంద్ జిల్లాలో జరిగిన విషాద ఘటనలో ఒక మహిళ మృతి చెందగా, మరో ఆరుగురు గాయపడ్డారు. కొండపై ఉన్న దేవాలయం నుంచి దిగుతూ వస్తున్న రోప్‌వే ట్రాలీ ప్రమాదానికి గురై కింద పడిపోవడంతో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. అధికారుల వివరాల ప్రకారం, ఈ ప్రమాదం ఆదివారం ఉదయం సుమారు 10 గంటల సమయంలో జరిగింది. ట్రాలీ దిగుతున్న సమయంలో కేబుల్ అకస్మాత్తుగా తెగిపోవడంతో, అందులో ఉన్న ప్రయాణికులు భారీ ఎత్తు నుంచి కిందకు పడిపోయారు. ఈ ట్రాలీలో మొదట ఎనిమిది మంది ఉన్నారని భావించినప్పటికీ, చివరకు ఏడు మంది ఉన్నట్లు అధికారులు స్పష్టం చేశారు. ఈ రోప్‌వే సేవలు భక్తులు కొండపై ఉన్న కల్లారీ మాతా టెంపుల్ చేరుకోవడానికి సాధారణంగా ఉపయోగిస్తారు. ఈ ఆలయం సముద్ర మట్టానికి సుమారు 1,100 అడుగుల ఎత్తులో ఉంది. భక్తులు ఈ ఆలయానికి చేరుకోవడానికి రోప్‌వేతో పాటు సుమారు 900 మెట్లు ఎక్కే మార్గం కూడా ఉంది. ప్రస్తుతం జరుగుతున్న నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు అక్కడికి చేరుకున్నారు. కాగా, ప్రమాదంలో రాయ్‌పూర్‌కు చెందిన అయుషి సట్కర్ (28) అక్కడికక్కడే మరణించగా, ఆమె భర్త రిషభ్ ధ్రావే (29), 16 ఏళ్ల బాలుడు చయాంశ్ ధ్రావే, గోవింద్ స్వామి (47), నమితా స్వామి (48), కుష్మితా స్వామి (10), మాన్వి గోదారియా (12) గాయాలపాలయ్యారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించి, అందులో నలుగురిని మెరుగైన చికిత్స కోసం రాయ్‌పూర్‌కు పంపించారు. ఈ ప్రమాదం తర్వాత, పైకి ఎక్కుతున్న మరో ట్రాలీని వెంటనే నిలిపివేసి సురక్షితంగా కిందకు తీసుకువచ్చారు. అందులో ఉన్న ప్రయాణికులు గట్టిగా షాక్‌కు గురైనప్పటికీ, వారికి పెద్దగా గాయాలు కాలేదు.

### అమెరికా గ్యాస్, రష్యా చమురు

# మంగళూరు చేరిన నౌకలు



**మంగళూరు:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, భారత్ తన ఇంధన భద్రతను పటిష్టం చేసుకునేందుకు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఇందులో భాగంగా అమెరికా నుంచి ద్రవీకత పెట్రోలియం గ్యాస్ (ఎల్‌పిజి), రష్యా నుంచి ముడి చమురుతో కూడిన భారీ నౌకలు మంగళూరు పోర్టుకు చేరుకున్నాయి. అమెరికాలోని టెక్సాస్ నుంచి ఎల్‌పిజితో బయలుదేరిన 'పైక్సిస్ పయనీర్' అనే కార్గో నౌక విజయవంతంగా మంగళూరు పోర్టులో లంగరేసింది. ఇదే సమయంలో రష్యా నుంచి ముడి చమురును తీసుకొచ్చిన మరో నౌక కూడా పోర్టుకు 18 నాటికల్ మైళ్ల దూరంలో నిలిపి ఉంచారు. సింగిల్‌పాయింట్ మూర్తింగ్ వ్యవస్థ ద్వారా ఈ చమురును పైప్‌లైన్‌లోకి, అక్కడి నుంచి మంగళూరు రిఫైనరీ అండ్ పెట్రో కెమికల్స్ లిమిటెడ్‌కు తరలించనున్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రపంచ ఇంధన ధరలను స్థిరీకరించే లక్ష్యంతో సముద్రంలో అప్పటికే ప్రయాణంలో ఉన్న రష్యా ముడి చమురు అమ్మకాలకు అమెరికా తాత్కాలికంగా అనుమతి ఇచ్చింది. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని భారత్... రష్యా నుంచి చమురు కొనుగోళ్లను గణనీయంగా పెంచింది. ఇరాన్ ప్రమేయంతో నెలకొన్న వివాదాల వల్ల సరఫరాలో ఆటంకాలు ఏర్పడటంతో భారత్ ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇదే క్రమంలో, ఈ వారం గుజరాత్‌లోని వాడినార్, ముంద్రా పోర్టులకు 'నందా దేవి', 'శివాలిక్' అనే రెండు భారత ఎల్‌పిజి ట్యాంకర్లు కూడా సురక్షితంగా చేరుకున్నాయి. ప్రమాదకరమైన హోర్మజ్ జలసంధి గుండా ఇవి ప్రయాణించి రావడం గమనార్హం. ప్రస్తుతం పశ్చిమ పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో 611 మంది భారత నావికులతో కూడిన 22 భారత నౌకలు ఉన్నాయని, డిజి షిప్పింగ్ పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తోందని అధికారులు పేర్కొన్నారు.

### మమతపై ప్రజల్లో అసంతృప్తి లేదు

# 'సర్'తో అది కనుమరుగైపోయింది

**టిఎంసి రాజ్యసభ ఎంపి సాగరికా ఘోష్**



**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్‌లో స్థానికంగా ఉన్న ప్రభుత్వ వ్యతిరేకత, ఎస్ఐఆర్ ప్రక్రియ పర్యవసానంగా చాలా వరకు మరుగున పడిందని, ఇది రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో బిజెపిపై తమ పార్టీకి స్పష్టమైన ఆధిక్యాన్ని ఇస్తుందని టిఎంసి రాజ్యసభ ఎంపీ సాగరిక ఘోష్ అన్నారు. ఈ ఎన్నికల కోసం టిఎంసి స్టార్ క్యాంపెయినర్లలో ఒకరిగా ఎంపికైన, పాత్రికేయురాలిగా రాజకీయాల్లోకి వచ్చిన ఘోష్ ఆదివారం మాట్లాడుతూ ఒక నాయకురాలిగా మమతా బెనర్జీ పట్ల ఆమె మద్దతుదారులలో ఎటువంటి అసంతృప్తి లేదు. ఎన్నికలలో అభ్యర్థులుగా మార్చబడిన స్థానిక నాయకులలో ఒక వర్గం పట్ల మాత్రమే ఇటువంటి భావనలు నెలకొని ఉండవచ్చని తెలిపారు. మార్చి 17న బెనర్జీ ప్రకటించిన 291 మంది అభ్యర్థుల జాబితాలో, టిఎంసి తన శాసనసభ బలంలో దాదాపు మూడో వంతు అయిన 74 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలను తొలగించింది. ఇది ప్రభుత్వ వ్యతిరేకతను ఎదుర్కోవడానికి అనుసరిస్తున్న ఒక ప్రణాళికాబద్ధమైన వ్యూహానికి సంకేతం. గత 15 ఏళ్లుగా కాషాయ పార్టీని నిరంతరం ఓడిస్తూ వస్తున్న మమతా బెనర్జీని ఓడించి, ఏ విధంగానైనా పశ్చిమ బెంగాల్‌ను కైవసం చేసుకోవడానికే ఎస్ఐఆర్ ప్రక్రియను ఉపయోగించుకోవాలన్నది బిజెపి అజెండా. పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో సాగరికా ఘోష్ మాట్లాడుతూ 'ఈ ప్రక్రియ ఇప్పుడు తలకిందులైంది. టిఎంసికి స్పష్టమైన ప్రయోజనాన్ని చేకూర్చింది. స్థానిక స్థాయిలో ఏమైనా ప్రభుత్వ వ్యతిరేకత ఉండి ఉంటే, ఎస్ఐఆర్ ప్రక్రియ వల్ల అది పూర్తిగా మరుగున పడిపోయింది. ఇది బిజెపి చేసిన ఘోరమైన తప్పు' అని అన్నారు. 'వారు ఎన్ని పేర్లు తొలగించాలనుకుంటే అన్ని తొలగించుకోనివ్వండి. మేము ఎలాగైనా గెలుస్తాము' అని అన్నారు. 'హడావిడిగా రుద్దిన' ఎస్ఐఆర్ ప్రక్రియ, కేవలం సామాన్య ప్రజలపైనే కాకుండా, నోబెల్ బహుమతి గ్రహీత అమర్త్య సేన్, మాజీ చీఫ్ సెక్రటరీ నందిని చక్రవర్తి, మంత్రి శశి పంజా, క్రికెటర్ రిచా ఘోష్ వంటి నిష్ణాతులైన పౌరులపై కూడా పౌరసత్వ సందేహాలను రేకెత్తించిందని, ఇది రాష్ట్రంలో బిజెపి వ్యతిరేక పవనాన్ని సృష్టించిందని టిఎంసి ఎంపీ అన్నారు. 'బిజెపి ఎవరి గురించి అయితే అంత గట్టిగా మాట్లాడిందో, ఆ చొరబాటుదారులు ఎక్కడ ఉన్నారు?' అని ఆమె ప్రశ్నించారు. ''ఆమె 24 గంటలూ తన ప్రజలతో మమేకమై ఉండే రాజకీయ నాయకురాలు. మూడు పర్యాయాల పాలన తర్వాత స్థానిక స్థాయిలో కొంతమేర ప్రభుత్వ వ్యతిరేకత సహజమే. కష్టకాలంలో తాము ఆమెను ఆశ్రయించవచ్చని, ఆమె తమ సమస్యలను పరిష్కరిస్తుందని ప్రజలకు తెలుసు' అని తెలిపారు. బెనర్జీని 'దక్షిణాసియాలోనే అరుదైన ఒక రాజకీయ శక్తి'గా అభివర్ణిస్తూ, ఎటు వంటి రాజకీయ వారసత్వం లేదా గురువు అండ లేకుండానే 'భారత రాజకీయాల్లోని తీవ్రమైన స్త్రీ వ్యతిరేక, పితృస్వామ్య వాతావరణంలో ఒక రాజకీయ నవ సంస్థను విజయవంతంగా నడిపినందుకు ఘోష్ టిఎంసి అధినేత్రిని ప్రశంసించారు. ఉత్తర ప్రదేశ్, బిహార్, ఢిల్లీ వంటి డబుల్ ఇంజిన్' రాష్ట్రాల్లో మహిళలపై జరుగుతున్న నేరాలను ప్రస్తావిస్తూ, ఆర్జీకర్ బాధితురాలి కుటుంబానికి భారతదేశంలో మరే ఇతర ప్రాంతం కంటే పశ్చిమ బెంగాల్‌లోనే న్యాయం పొందే అవకాశం ఎక్కువగా ఉంది' అని తెలిపారు. ''బిజెపి బెంగాల్ వ్యతిరేక విధానాల వల్ల, అలాగే ఎస్ఐఆర్ నిర్వహణలో సన్నద్ధం కాని ఎన్నికల సంఘంపై ఒత్తిడి తీసుకురావడం వల్ల ప్రజలు ఎదుర్కొన్న వేధింపులు రాష్ట్రంలో టిఎంసి స్థానాన్ని మరింత బలోపేతం చేశాయి' అని ఆమె పేర్కొన్నారు.

# 'అస్సామీయ గుర్తింపు' ప్రధాన ఎజెండా

**అస్సాం అసెంబ్లీ ఎన్నికల్లో రసవత్తర పోరు**



**గౌహతి:** అస్సాంలో ఏప్రిల్ 9న జరుగబోయే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో 'అస్సామీయ గుర్తింపు' (అస్సామీయ జాతి యోతబాది) ప్రధాన రాజకీయ అంశంగా మళ్లీ ముందుకు రావడంతో, పోరు రసవత్తరంగా సాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. దశాబ్దాలుగా బయటి వ్యక్తులు, ప్రత్యేకించి అక్రమ వలసదారులు, స్థానిక సంసృతి, భాష, భూమిపై ప్రభావం చూపుతున్నారనే అభిప్రాయం ప్రజల్లో బలంగా ఉంది. ఈ భావజాలాన్ని ప్రాంతీయ పార్టీలతో పాటు జాతీయ పార్టీలు కూడా తమ ఎన్నికల వ్యూహాల్లో కీలకంగా వినియోగిస్తున్నాయి. ఒకప్పుడు ఈ అంశంపై ఆధిపత్యం చూపిన అసోమ్ గణ పరిషద్ (ఎజిపి) వంటి ప్రాంతీయ పార్టీలు ఇప్పుడు జాతీయ పార్టీలతో కూటములు కట్టడం వల్ల తమ స్వతంత్రత కోల్పోయినట్లుగా విశ్లేషకులు భావిస్తున్నారు. 1985, 1996లో ప్రభుత్వాలను ఏర్పాటు చేసిన ఎజిపి, ప్రస్తుతం భారతీయ జనతా పార్టీ (బిజెపి)కి చిన్న భాగస్వామిగా మారింది. గత ఎన్నికల్లో 126 స్థానాల్లో కేవలం 26 సీట్లకే పరిమితమవడం, ప్రాంతీయ రాజకీయాల బలహీనతను సూచిస్తుంది. విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, అస్సామీయ జాతీయత అనే ప్రధాన అంశాన్ని జాతీయ పార్టీలు హైజాక్ చేశాయి. 2016లో బిజెపి 'జాతి, భూమి, స్థానం' అనే నినాదంతో అధికారంలోకి రావడం దీనికి ఉదాహరణ. అక్రమ వలసదారులను గుర్తించి పంపిస్తామనే హామీతో ప్రజల మద్దతు పొందింది. ఇదే అంశం గతంలో ఎజిపికి విజయాన్ని అందించింది. అయితే ఇప్పుడు పరిస్థితి మారింది. ఎజిపిలో కూడా సిద్ధాంతపరమైన మార్పులు కనిపిస్తున్నాయి. గతంలో అనుమానంతో చూసిన బెంగాలీ మాట్లాడే ముస్లింలకు చెందిన అభ్యర్థులను కూడా ఈసారి పెద్ద ఎత్తున నిలబెట్టడం రాజకీయ వ్యూహంలో మార్పును సూచిస్తోంది. ఇది అధికార రాజకీయాలు సిద్ధాంతాలపై పైచేయి సాధిస్తున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇంకొకవైపు, కొత్త ప్రాంతీయ పార్టీలు, రైజోర్డాల్, అస్సాం జాతీయ పరిషత్ అస్సామీయ గుర్తింపును కాపాడటానికి ఏర్పడ్డప్పటికీ, ఇవి కూడా కాంగ్రెస్‌తో కలవడం గమనార్హం. ఇది ప్రాంతీయ పార్టీలకు స్వతంత్ర రాజకీయ స్థలం తగ్గుతున్నదని సూచిస్తుంది. కాగా, అస్సాం ప్రజల్లో స్థానిక సంస్కృతి, భాష, గుర్తింపుపై ఉన్న ఆందోళన ఇప్పటికీ బలంగానే ఉందని పరిశీలకులు అంటున్నారు. అయితే జాతీయ పార్టీలు ఈ అంశాన్ని విస్తృతంగా ప్రదర్శించడం వల్ల ప్రాంతీయ పార్టీల ప్రాధాన్యం తగ్గింది. అయినప్పటికీ, ఈ భావజాలం పూర్తిగా మాయం కాలేదు. ఏదిఏమైనా, అస్సాం రాజకీయాల్లో ప్రస్తుతం ఒక ద్వంద్వ పరిస్థితి కనిపిస్తోంది. ఒకవైపు జాతీయ పార్టీలు పెద్ద వనరులు, విస్తృత వ్యూహాలతో ముందుకు వస్తుంటే, మరోవైపు ప్రాంతీయ పార్టీలు తమ ప్రాముఖ్యతను నిలబెట్టుకోవడానికి పోరాడుతున్నాయి. అస్సామీయ గుర్తింపు అనే భావన ఇంకా ప్రజల్లో బలంగా ఉన్నందున, భవిష్యత్తులో ప్రాంతీయ రాజకీయాలకు మళ్లీ అవకాశాలు ఉండే అవకాశం ఉంది.


# మమతా బెనర్జీ విజయం తథ్యం: అఖిలేశ్ యాదవ్



**లక్నో:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో మమతా బెనర్జీ చారిత్రక విజయం సాధించి, మరోసారి ముఖ్యమంత్రి పదవి చేపడతారని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాద్ అన్నారు. లక్నోలోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ అనేక ఇబ్బందులు ఉన్నప్పటికీ మమత విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల కమిషన్ బిజెపితో కుమ్మక్కై ఎంతో మంది అధికారులను బదిలీ చేసిందన్నారు. డిజిపి, చీఫ్ సెక్రెటరీ, ఇతర అధికారులను బదిలీ చేసినప్పటికీ మమత తిరిగి అధికారంలోకి వస్తుందని చెప్పారు. ఇటీవల జరిగిన యూపీ ఎన్నికలను పరిశీలిస్తే... ఒక్క అధికారిని కూడా బదిలీ చేసిన దాఖలాలు లేవన్నారు. యూపీ నుంచి బెంగాల్‌కి బిజెపి ఆర్ఎస్ఎస్ కార్యకర్తలను భారీగా తరలిస్తోందనే సమాచారం ఉందన్నారు. వారు ఇక్కడ లక్షలాదిమందికి శిక్షణలు ఇస్తున్నారన్నారు. వారి అండర్ గ్రౌండ్ సామ్రాజ్యంలో పోలీస్, కేంద్ర బలగాలను రూపొందిస్తున్నారని అఖిలేశ్ యాదవ్ విమర్శించారు. పోలింగ్ బూత్‌లను ఎలా ఎత్తుకెళ్లాలి, ఎలా డబ్బు ఖర్చు చేయాలనేదానిపై శిక్షణలు ఇస్తున్నారని చెప్పారు. ఇప్పటికే బెంగాల్‌లో బూత్ స్థాయి వరకు డబ్బు తరలించడం జరిగిందని తెలిపారుతెలిపారు.

# జీవితాలను మింగుతున్న యుద్ధాలు

**'రణరంగం కానిచోటు**
**భూస్థలమంతా వెదికినా దొరకదు**
**గతమంతా తడిసె రక్తమున,**
**కాకుంటే కన్నీళ్ళతో'...**
**'చల్లారిన సంసారాలూ**
**మరణించిన జన సందోహం**
**అసహాయుల హాహాకారం**
**చరిత్రలో నిరూపించినవి'** అంటాడు మహాకవి శ్రీశ్రీ 'దేశ చరిత్రలు' కవితలో. యుద్ధాల చరిత్రను.. పర్యవసానాలను అతి కొద్ది పదాలతో సూక్ష్మంగా, ఆలోచనాపరంగా ఎంతో లోతుగా విశ్లేషిస్తాడు. అలాంటి రచనలు నేటి అవసరంగా మారింది. దేశదేశాలు యుద్ధాల్లో తలమునకలై, ఆస్తి ప్రాణ నష్టాలకు పాల్పడుతున్న వేళ 'యుద్ధ సాహిత్యం' ప్రాధాన్యతను సంతరించుకుంది. యుద్ధం విధ్వంసాన్ని మిగిలిస్తుంది. యుద్ధం ప్రాణాలను హరిస్తుంది. అత్యంత హేయమైన యుద్ధాలకు వీరత్వాన్ని ఆపాదించి, కీర్తించే సాహిత్యం పుట్టుకురావడం మరింత దారుణం. వీటిలో, రాజులు, పాలకులు, అధికారుల ప్రాపకం కోసం రాసినవి కొన్ని... మతపరమైన విశ్వాసాలను ప్రజల్లో బలంగా నాటడానికి రాసినవి మరికొన్ని... యుద్ధాలు ఎంతటి దారుణ పరిస్థితులను సృష్టిస్తాయో మొదటి, రెండో ప్రపంచ యుద్ధాలు నిరూపించాయి. అప్పటికీ పాఠాలు నేర్చుకొని సామ్రాజ్యవాద దేశాలు యుద్ధాలకు కాలు దువ్వుతునే ఉన్నాయి. ప్రపంచాన్ని రావణకాష్టంలా మారుస్తున్నాయి. యుద్ధాలను గొప్పగా భావించడం, యుద్ధోన్మాదులను వీరులుగా కీర్తిచడం ఒకప్పుడు సాహిత్యంలో ఒక భాగంగా ఉండేది. క్రమంగా ఆ ఉధృతి తగ్గినప్పటికీ, పరంపర ఇప్పటికీ ఎంతోకొంత ప్రభావం చూపుతునే ఉంది. ఈ యుద్ధ సాహిత్యం అనే భావనను మనం లోతుగా పరిశీలిస్తే మాత్రం, అది యుద్ధాల గురించి చెప్పే రచనల సమాహారంగానేగాక, మానవజాతి తన చరిత్రలో చేసిన అత్యంత ఘోరమైన చర్యలను అర్థం చేసుకునే ఒక ప్రయత్నం. మనిషి చేతులారా సృష్టించిన విధ్వంసాన్ని చూసి, దానికి అర్థం వెతికే ఒక ఆత్మపరిశీలనా ప్రక్రియ. వేల సంవత్సరాలుగా యుద్ధాలు కొనసాగుతున్నాయి. ప్రతి తరంలో రక్తపాతం, నష్టం, బాధ పునరావృతమవుతూనే ఉన్నాయి. సాధారణంగా చూస్తే, ఇంత అనుభవం తర్వాత మనుషులు యుద్ధాన్ని కీర్తించే ఆలోచనను విడిచిపెట్టాలి. కానీ, వాస్తవ పరిస్థితి భిన్నంగా కనిపిస్తుంది. యుద్ధాన్ని అర్థం చేసుకోవడానికి మరింత రచనలు పుట్టుకొస్తున్నాయి. ఇది ఒక విచిత్ర పరిస్థితి. మనిషి ఒక వైపు యుద్ధం చేస్తాడు... మరోవైపు ఆ యుద్ధాన్ని అర్థం చేసుకోవడానికి సాహిత్యాన్ని సృష్టిస్తాడు... ప్రాచీన సాహిత్యంలో యుద్ధాన్ని ప్రశ్నించే ధోరణి చాలా తక్కువ. ఆ కాలంలో యుద్ధం అనేది గౌరవం, పరాక్రమం, వీరత్వం అనే భావనలతో ముడిపడి ఉండేది. 'ది ఇలియాడ్' వంటి గ్రంథాల్లో యోధులు తమ కీర్తి కోసం యుద్ధంలో పాల్గొంటారు. అక్కడ యుద్ధం ఒక గొప్ప వేదికగా కనిపిస్తుంది. కానీ, అదే రచనలో రాజు తన కుమారుడి మృతదేహం కోసం వేడుకునే దృశ్యం మన




సును కలచివేస్తుంది. ఈ రెండు విభిన్న భావనలు ఒకే రచనలో అత్యంత సహజంగా కనిపిస్తాయి. ఈ పరిణామం యుద్ధ సంక్లిష్టతను తెలియజేస్తుంది. భారతీయ సాహిత్యంలో కూడా ఇదే ద్వంద్వ భావన కనిపిస్తుంది. 'మహాభారతం'లోని యుద్ధం కేవలం విజయం కోసం జరగలేదని, దానిని ధర్మం, కర్తవ్యాలు, సంబంధాలు, బాధ్యతల మధ్య జరిగే సంఘర్షణగా చూడాలని అంటారు. ఫలతంగా దాయాదుల మధ్య జరిగిన పోరు లక్షలాది మందిని పొట్టనబెట్టుకున్నప్పటికీ, యుద్ధానికి కారణమైన వారిని ఘనంగా కీర్తించడం కనిపిస్తుంది. దాదాపుగా, యుద్ధాలను పొగడ్తల్లో ముంచెత్తే అన్ని రచనల్లోనూ అవి అనివార్యమనే అభిప్రాయాన్ని పాఠకుల మెదళ్లలో నాటే ప్రయత్నం జరుగుతుంది. కొన్ని సందర్భాల్లో మాత్రమే నైతిక సవాళ్లు విసురుతుంది. ప్రాచీన రచనలు యుద్ధాన్ని పూర్తిగా ఖండించకపోయినా, దాని వెనుక ఉన్న బాధను దాచలేకపోయాయి.

కాలక్రమేణా మానవ అనుభవం మారింది. యుద్ధాల తీవ్రత పెరిగింది. ముఖ్యంగా మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత సాహిత్యంలో ఒక పెద్ద మార్పు కనిపించింది. యుద్ధాన్ని గొప్పగా చూపించే ధోరణి క్రమంగా తగ్గింది. దాని స్థానంలో యుద్ధాన్ని విమర్శించే, ప్రశ్నించే ధోరణి పెరిగింది. 'విల్ఫ్రెడ్ అవెన్' రాసిన కవిత్వం ఈ మార్పుకు ఉదాహరణ. అతని రచనలు యుద్ధాన్ని దేశ భక్తి పేరుతో మహిమాపరిచే భావనను నేరుగా సవాలు చేస్తాయి. అదేవిధంగా, ఎరిచ్ మారియా రెమార్క్ రాసిన 'ఆల్ క్వైట్ ఆన్ ది వెస్టర్న్ ఫ్రంట్' వంటి రచనలు యుద్ధంలో పాల్గొనే యువ సైనికుల అంతర్గత ప్రపంచాన్ని చూపిస్తాయి. అక్కడ యుద్ధం ఒక వీరగాథ కాదు. అది మానవత్వాన్ని క్రమంగా కరిగించే ప్రక్రియ. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత సాహిత్యం మరింత లోతుగా మారింది. యుద్ధం కేవలం యుద్ధభూమిలోనే జరుగదని రచయితలు గ్రహించారు. అది ప్రజల జీవితాల్లోకి ప్రవేశిస్తుంది. వారి రోజువారీ జీవితాలను మార్చేస్తుంది. అన్నే ఫ్రాంక్ 'ది డైరీ ఆఫ్ ఆ యంగ్ గర్ల్'లో ఒక చిన్నారి భయం, ఆశ, నిరాశల మధ్య జీవిస్తుంది. అక్కడ బాంబులు కనిపించకపోయినా, భయం ప్రతీ పేజీలో కనిపిస్తుంది. అలాగే, కుర్ట్ వొన్నెగట్ రచించిన 'స్లాటర్ హౌస్ ఫైవ్' (ది చిల్డ్రన్స్ క్రూసేడ్: ఎ డ్యూటీ డాన్స్ విత్ డెత్' యుద్ధాన్ని ఒక విరుద్ధమైన, అర్థంకాని అనుభవంగా చూపిస్తుంది. ఇది యుద్ధం మనసులో ఎలా నిలిచిపోతుందో తెలియజేస్తుంది. తర్వాతి దశలో యుద్ధ సాహిత్యం ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. ఒకప్పుడు పాశ్చాత్య దేశాల అనుభవాలకే పరిమితమైన ఈ సాహిత్యం, ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికా వంటి ప్రాంతాల అనుభవాలను కూడా ప్రతిబింబించడం ప్రారంభించింది. చినువా అచెబె రచనలు వలస పాలన వల్ల జరిగే సాంస్కృతిక విధ్వంసాన్ని చూపిస్తాయి. తొలుత 'డెస్టినీ ఆఫ్ లవ్' అని పేరుపెట్టి, ఆ తర్వాత 'ది సారో ఆఫ్ వార్'గా మార్చిన పుస్తకంలో యుద్ధం విజయం లేదా పరాజయం అనే కోణంలో కనిపించదు. యుద్ధం అనేది ప్రతి వ్యక్తి జీవితాన్ని చెదరగొట్టే శక్తిగా రచయిత బవొ నిన్హ్ ఈ రచనలో పేర్కొంటాడు. 'ట్రైన్ టు పాకిస్తాన్' నవలలో రచయిత కుష్వంత్ సింగ్, ఆ నాటి దేశ విభజన సమయంలో జరిగిన హింస మనుషుల మధ్య ఉన్న నమ్మకాన్ని ఎలా చెదరగొడుతుందో చూపిస్తుంది. ఇలాంటి ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. ఈ రకమైన రచనలన్నీ యుద్ధాన్ని వ్యక్తీకరించడంలో ప్రత్యేక పాత్ర పోషిస్తాయి. కొన్ని అనుభవాలను గద్యంతో పూర్తిగా చెప్పడం కష్టం. అక్కడ కవిత్వం సహజంగా ముందుకు వస్తుంది. సీగ్‌ఫ్రైడ్ శాస్సూన్ తన కవిత్వంలో వ్యంగ్యాన్ని ఉపయోగించి యుద్ధపు అర్థంలేని స్వభావాన్ని బయటపెడతాడు. పాబ్లో నెరుడా రచనలు యుద్ధాన్ని ఒక ప్రపంచ వ్యాప్త విషాదంగా చూపిస్తాయి. మహమ్మద్ డార్విష్ రచనల్లో యుద్ధం ఒక నిరంతర జీవన పరిస్థితిగా కనిపిస్తుంది. అక్కడ యుద్ధం ఒక సంఘటన మాత్రమేగాక, ఒక స్థితిగా మన కళ్ల ముందు కదలాడుతుంది.

ఆధునిక కాలంలో యుద్ధ సాహిత్యం మరింత సంక్లిష్టంగా మారింది. వాస్తవం, కల్పితం మధ్య గీత మసకబారింది. టిమ్ ఒబ్రియెన్స్ పుస్తకం 'ది థింగ్స్ దె క్యారీడ్'లో కథలు నిజమైనవా? కావా? అనే ప్రశ్న పాఠకులకు రాదు. ఎందుకంటే, వీటిలో అత్యంత భావోద్వేగం నిండి ఉంటుంది. ఫలితంగా, వాస్తవికతకు, కల్పనకు మధ్య ఉండే గీత చెదిరిపోతుంది. ఇలాంటి రచనల్లో అభూత కల్పనలు చోటు చేసుకునే ప్రమాదం లేకపోలేదు. ఖలీద్ హొస్సేనీ రచన 'ది కైట్ రన్నింగ్'లో యుద్ధం ఒక వ్యక్తి జీవితాన్ని సంవత్సరాల పాటు వెంటాడే నీడలా కనిపిస్తుంది. ఎంతో మంది రచయితలు... ఎన్నో రకాల విశ్లేషణలు... కానీ, ఒకప్పటి మాదిరి యుద్ధకారకులను వీరుగానో, ఘనులుగానో కీర్తించడం లేదు. గొప్పతనాన్ని చాటడం లేదు. పైగా యుద్ధం అవసరాన్ని ప్రశ్నిస్తున్నారు. ఎవరి కోసం ఈ యుద్ధాలు? అని ప్రశ్నిస్తున్నారు.

**'సామ్రాజ్యపు దండయాత్రలో**
**సామాన్యుల సాహసమెట్టిది?'** అని నిలదీసిన శ్రీశ్రీ తత్వాన్ని ఆవాహన చేసుకుంటే, సామ్రాజ్యవాద పదఘట్టన కింద నలిగిపోతున్న బడుగు జీవుల కోసం.. వారి జీవితాల కోసం గళం ఎత్తాల్సిన అవసరం అవగతమవుతుంది. యుద్ధ సాహిత్యం అధికారిక కథనాలను ప్రశ్నిస్తుంది. బాధితుల గళాన్ని వినిపిస్తుంది. శత్రువును కూడా మనిషిగా చూపిస్తుంది. యుద్ధం ఎంత అర్థంలేనిదో బయటపెడుతుంది. ఈ ప్రక్రియలో ఇది పాఠకుడిని అసౌకర్యానికి గురిచేస్తుంది. కానీ అదే దీని అసలు శక్తి. మానవ చరిత్రలో యుద్ధం ఒక నిరంతర వాస్తవం. అది రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక కారణాల వల్ల పునరావృతమవుతుంది. కానీ యుద్ధ సాహిత్యం ఈ చక్రాన్ని అర్థం చేసుకోవడానికి ఒక సాధనం. ఇది మనిషి తనను తాను చూసుకునే అద్దం. ఆ అద్దంలో కనిపించే చిత్రం అందంగా ఉండదు. కానీ అది నిజం. అదే ఈ సాహిత్యపు ప్రాముఖ్యత.

**– బిఎల్**

## భగత్‌సింగ్ ఓసారి రావయ్య..

మొన్న జుట్టుకు పన్నువేస్తే తిరుగుబాటు చేశారు జనం.
ఉప్పుపై పన్ను వేస్తే ఊరు ఊరు ''దండి''లా కదిలింది.
పన్ను వేసినోడు తెల్లోడు కాబట్టి వాడ్ని వెళ్లిపోమన్నారు.
మరి నేటి నల్లోడి సంగతేంటి ?
తెలియకుండానే పన్నేసి గుంజుతుండు.
జిఎస్‌టి పేర ప్రజలనెత్తురు జుర్రుతుండు..
మతంపేర, కులంపేర విభజించి ఎల్లకాలం
తానే ఏలచూస్తుండు.
ప్రశ్నిస్తే జైలు, కాదంటే దేశద్రోహి.
ఇంత జరుగుతున్నా.. నోరు మెదపరేం?
పోరాట జవ చచ్చిపోయిందా?
తలవంచి బతకటం అలవాటు అయిందా..
ఓ భగత్‌సింగ్ మళ్లీ ఓ సారి రావయ్యా
నిశ్చలమైన ఈ సమాజాన్ని చలింపజేయగా
కొలువు వేతనం, సరదాలు తప్ప
ప్రజలకోసం కొట్లాడలేని యువతరాన్ని మేల్కొల్పగా
ఆలోచన, అధ్యయనం ఆయుధాలుగా
సమరానికి యువతరాన్ని సన్నద్ధం చేయగ.
ఓ భగత్‌సింగ్ ఓసారి రావయ్య..


**(భగత్‌సింగ్ 95వ వర్ధంతి సందర్భంగా నివాళులర్పిస్తూ.. )**

**– ఏనుగు వెంకటేశ్వరావు, ప్రజాపక్షం, ఖమ్మం.**



## చదవాల్సిన పుస్తకం

### సంపూర్ణ ప్రపంచ నిర్మాణం..




జీవితాన్ని ఎలా ఉండాలో కాదు.. ఎలా ఉందో అలానే పట్టుకునే సామర్థ్యం రచయితల్లో లియో టాల్‌స్టాయ్ అగ్రగణ్యుడు. ఆయన రచించిన 'వార్ అండ్ పీస్' (యుద్ధము మరియు శాంతి) అనే మహత్తర కృతి ఈ లక్షణానికి అత్యంత స్పష్టమైన ఉదాహరణ. ఇది ఒక యుద్ధ గాథగానో, ఒక ప్రేమ కథగానో కాకుండా, ఒక సంపూర్ణ ప్రపంచ నిర్మాణంలా ప్రాభవాన్ని సంపాదించుకుంది. వందలాది పాత్రలు, విభిన్న స్థాయిలలో జీవించే మనుషులు, సమాజంలోని అంతర్గత మార్పులు వంటి ఎన్నో అంశాలు కలిసి ఒక శ్వాసించే ప్రపంచాన్ని నిర్మిస్తాయి. ఇది కథానాయకుడి చుట్టూ తిరిగే కథ కాదు.. ఎందుకంటే, ఇందులో సమాజం మొత్తం ఒక జీవిగా కదులుతుంది. యుద్ధభూమిలో గర్జించే తుపాకీ శబ్దాల నుంచి, రాజవంశీయుల గదుల్లో నిశ్శబ్దంగా జరిగే సంభాషణల వరకు అన్నీ సమాన ప్రాధాన్యం పొందుతాయి. ఈ రచనలో యుద్ధం ఒక రాజకీయ సంఘటనగా ఉంటుంది. అదే సమయంలో మానవ జీవితంపై ప్రశ్నలు వేసే అద్దంలా మారుతుంది. ఒక వ్యక్తి చరిత్రలో ఎంతవరకు ప్రభావం చూపగలడు? స్వేచ్ఛ అనే భావన నిజంగా ఉందా లేక విధి అన్నదే అన్నింటినీ నడిపిస్తుందా? ఒక చిన్న నిర్ణయం లేదా అనుకోని సంఘటన ఒక దేశ గమ్యాన్ని మార్చగలదా? వంటి అనేక ప్రశ్నలు యుద్ధం ద్వారా ముందుకు వస్తాయి. ఒక మహా సైన్యాధిపతి ప్రకృతిలోని చిన్న మార్పులకు లోబడిపోవచ్చు. ఒక సాధారణ సైనికుడు కూడా ఒక పెద్ద మార్పుకు కారణమవుతాడు. ఈ విధంగా యుద్ధం కేవలం చరిత్రలోని సంఘటనగా కాకుండా, ప్రతి మనిషిని తాకే అస్తిత్వ ప్రశ్నగా మారుతుంది. ఇదే సమయంలో, ఈ విస్తృత ప్రపంచంలో మరో వైపు రాజభవనాల జీవితం కనిపిస్తుంది. అక్కడ కూడా పోరాటాలే జరుగుతాయి. కానీ, అవి కనిపించవు. ప్రేమ సామాజిక నియమాల వల్ల పరిమితం అవుతుంది. స్నేహాలు ఆశల ఒత్తిడితో చీలిపోతాయి. కలలు మెల్లగా కూలిపోతాయి. టాల్‌స్టాయ్ ప్రతిభ ఈ చిన్న సంఘటనలను కూడా జీవితంలోని పెద్ద సత్యాలతో మేళవించడంలో కనిపిస్తుంది. పాఠకుడు కేవలం కథను చదవడంతో ఆగిపోడు. పాత్రలతో కలిసి ఆందోళనను, ఆశను, నిరాశను అనుభవిస్తాడు. ఈ నవల ఒకే కథ కాదు. అనేక కథల సంగమం. నటాషా రొస్టొవా అమాయకత, తప్పిదాలు, ప్రిన్స్ ఆండ్రెయ్‌లోని అంతర్గత బాధ, పియెరీ బెజుఖోవ్ అర్థాన్వేషణ తదితరాలన్నీ వేర్వేరు ప్రవాహాల్లా కనిపిస్తాయి. కానీ చివరికి అవి ఒకే నదిగా కలుస్తాయి. చిన్న చిన్న క్షణాలు కూడా పెద్ద సంఘటనలతో సమానంగా ప్రాధాన్యం పొందుతాయి. ఒక చూపు, ఒక మాట, ఒక నిశ్శబ్దం కూడా దేశ గమ్యాన్ని మార్చే నిర్ణయాలంత భారాన్ని కలిగి ఉంటుంది. చరిత్రను అత్యంత సాధారణమైన గతంలా చూపించకపోవడం వల్లే, ఇది కాలాతీత సాహిత్యం జాబితాలోకి చేరుతుంది. తప్పక చదవాల్సిన పుస్తకంగా మారింది. రష్యా సమాజాన్ని ఒక జీవిగా, విభిన్నతలతో, విరుద్ధతలతో, పాఠకుడి ముందుంచడంలో రచయిత సఫలమయ్యాడు. నిజమైన మహాకావ్యం అంటే మనల్ని మనమే ఇతరుల్లో చూడగలిగేలా చేయడం. ఈ నవల ఆ అనుభూతిని పాఠకులకు అందిస్తుంది.

ప్రతులకు

నవచేతన పబ్లిషింగ్ హౌస్ గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్) జిఎస్‌ఐ (పోస్ట్), హైదరాబాద్: 500068. (నవచేతన బుక్ హౌస్ అబిడ్స్, సుల్తాన్ బజార్, బండ్లగూడ (నాగోల్) హైదరాబాద్, హన్మకొండ, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం శాఖల్లోనూ లభిస్తుంది).

## ఈవారం కవితలు

### ఎర్రని జెండను చూసి...

**పల్లవి:**
ఎర్రని జెండను చూసి దండం పెడుతున్నా
ఎర్రాని రెపరెప చూసి సెల్యూట్ అంటున్నా
గడ్డిపూల గర్జన వింటూ అబ్బుర పడుతున్నా
గుండెనే జెండా చేసి సంబర పడుతున్నా
గానమై ప్రవహిస్తున్నా...
మేఘమై ప్రభవిస్తున్నా...
చూపుల దారుల్లోన...
దీపమై వెలుగుతు వున్నా...
రేలారే రేలారే రేపటి సూరీడు నువ్వేలే
నువ్వైనా నేనైనా తూరుపు దిక్కయి నడవాలే
రేలారే ....
రేలారే ...
రేలారే ....
॥ఎర్రని॥

**చరణం : I**
రాలిపోయే ఆకులు చూసి
కాలుతున్న కలలను చూసి
ఎండుతున్న డొక్కలు చూసి
మండుతున్న గుండెలు చూసి
మరణం లేని వీరుల పాటల తోరణమవుతున్నా
సూర్యున్ని డప్పుగ మార్చి దరువే వేస్తున్నా
నాగేటి చాళ్ళనుండి పొడిచే పిడికిలినై
రెల్లుగడ్డి సందుల్లోంచి జెండై వస్తున్నా
॥ఎర్రని॥

**చరణం : II**
గుప్పెడంత మట్టిని చూసి
గుబులుగున్న మనిషిని చూసి
నిన్నటి గాయం చూసి
నెత్తుటి గేయం చేసి
కంటిరెప్ప విడుదల చేసిన కన్నీరవుతున్నా
గున్నమావి కొమ్మన కూసిన కోయిల అవుతున్నా
ఆయుధాలు దాచిన జమ్మిచెట్టును అవుతున్నా
రాలిన చినుకుల పలుకుల పాటను అవుతున్నా
॥ఎర్రని॥

**చరణం : III**
సంద్రాల రోదన చూసి
కెరటాల వేదన చూసి
నిదురలేని రాత్రులు చూసి
కుదురు లేని కష్టాలు చూసి
అస్తమించినా మళ్ళీ ఉదయిస్తూ వున్నా
ఆంక్షలు అవరోధాలు దాటుకు వస్తున్నా
వీరుల దరహాసాలను మోసుకు వస్తున్నా
తూరుపు వాకిలి నేనై స్వాగతిస్తూ వున్నా
॥ఎర్రని॥

– బాబ్జీ


# ప్రియతమ నాయకుడు సురవరం సుధాకరరెడ్డి



ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ
పూర్వ ఉపకులపతి,
తెలుగు విశ్వవిద్యాలయం

'ఆదర్శం ఆచరణల సముచిత సమన్వయం కమ్యూనిజమే నిజమని చెదరని విశ్వాసం'గా జీవితాంతం అరుణపతాకం నీడ కింద జీవితాన్నీ, వ్యక్తిత్వాన్నీ తీర్చిదిద్దుకున్న ఆదర్శ కమ్యూనిస్టు సురవరం సుధాకరరెడ్డి. 1942 మార్చి 25న అప్పటి మహబూబ్‌నగర్ జిల్లా కొండ్రావుపల్లెలో సురవరం వెంకట్రామరెడ్డి దంపతులకు పుట్టిన సుధాకరరెడ్డి పెదనాన్న సురవరం ప్రతాపరెడ్డి. పెదనాన్న నుండి సంక్రమించిన సాహిత్యాభినివేశం, తండ్రి నుండి లభించిన స్వాతంత్రోద్యమ స్ఫూర్తితో బాల్యం నుండి ఉద్యమ లక్షణాలు పుణికిపుచ్చుకున్న సుధాకరరెడ్డి పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్నట్లు పాఠశాల విద్యార్థిగా ఉన్నప్పుడే స్కూల్‌లో బ్లాక్‌బోర్డులు, చాక్‌పీసులు, పాఠ్యపుస్తకాలు కావాలంటూ 15ఏళ్ళ ప్రాయంలోనే ఆందోళనకు నాయకత్వం వహించాడు. అది క్రమంగా జిల్లా వ్యాప్త ఆందోళనగా విస్తరించి, సమస్య పరిష్కారానికి దారితీసింది. విద్యార్థి దశలోనే కమ్యూనిస్టు భావజాలం ఆయనను ఆకర్షించింది. 1950లో అఖిల భారత విద్యార్థి సమాఖ్య కర్నూలు పట్టణ కార్యదర్శిగా, తర్వాత జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించాడు. 1964లో కర్నూలు కళాశాల విద్యార్థిసంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. 1967 ఉస్మానియా విశ్వవిద్యాలయం న్యాయకళాశాల విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయి, ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర బాధ్యతలు చేపట్టాడు. 1970లో అఖిల భారత విద్యార్థి సమాఖ్యకు, 1972లో అఖిల భారత యువజన సమాఖ్యకు జాతీయ అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహించాడు. 2000లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి చారిత్రాత్మకమైన విద్యుత్ ఉద్యమంతో క్రియాశీలకంగా వ్యవహరించాడు. 1988లో ఒకసారి 2004లో రెండోసారి నల్లగొండ నియోజకవర్గం నుండి పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికయ్యాడు. నల్లగొండలో ఫ్లోరైడ్ సమస్య పరిష్కారానికి కృషిచేశాడు. కేరళ యువనేత సి.కె.చంద్రప్పన్‌తో కలిసి 18 ఏళ్ళకే ఓటుహక్కు కోసం లోక్‌సభలో గళమెత్తి, తమ డిమాండ్‌ను సాధించాడు. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా పార్లమెంట్‌లో పీడిత ప్రజల పక్షాన, శ్రామిక జనం, రైతాంగం, మహిళల సమస్యలపై బలమైన గళ గర్జనలు వినిపించాడు. ప్రజల న్యాయమైన హక్కుల సాధన కోసం అవిశ్రాంతంగా కృషిచేశాడు. ప్రభావవంతమైన వక్తగా మూడుతరాల విద్యార్థులను, యువజనులను, శ్రామికులను ప్రభావితం చేసిన సుధాకరరెడ్డి మూడు పర్యాయాలు (2012 నుండి 2019 వరకు) సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాడు. చండ్ర రాజేశ్వర రావు తరువాత భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన రెండవ తెలుగు నేత కావడం విశేషం.

సుధాకరరెడ్డి నేతృత్వంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ, జాతీయస్థాయిలోనూ అన్ని ప్రజాసంఘాలలో క్రియాశీలంగా పనిచేశాయి. వారి ప్రత్యక్ష పర్యవేక్షణలోనే 2003లో హైదరాబాద్ నగరంలో అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం జాతీయ మహాసభలు ఘనంగా జరిగాయి. తెలంగాణ తొలిదశ ఉద్యమం (1969) సందర్భంగా 'సమైక్యాంధ్ర' నినాదం చేపట్టిన భారత కమ్యూనిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర సాధన తుది దశ ఉద్యమ కాలంలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు సంపూర్ణమైన మద్దతును ప్రకటించడం వెనుక కామ్రేడ్ సురవరం సుధాకరరెడ్డి ప్రమేయం నిత్య స్మరణీయం. కామ్రేడ్ సురవరం సుధాకరరెడ్డితో నా పరిచయం 52 ఏళ్ళ క్రితం ఏర్పడింది. 1973లో తెనాలిలో జరిగిన చారిత్రాత్మక విద్యార్థుల రాజకీయ శిక్షణా తరగతుల్లో నేనూ, బి.వి.విజయలక్ష్మి, రాంభట్ల అరుణ, విద్యాసాగర్ (ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర హైకోర్టు సీనియర్ న్యాయవాది), పద్మ (వి.రామనరసింహారావు సతీమణి), సిహెచ్. అప్పన్న, కమలమ్మ తదితరులం విద్యార్థులం. కె.నారాయణ, రామనరసింహారావు నిర్వాహకులు. సురవరం సుధాకర రెడ్డి మాకు అధ్యాపకులుగా వచ్చి, నక్సలిజం పుట్టుపూర్వోత్తరాలపై విశ్లేషణాత్మక ప్రసంగం చేశారు. ఆయన వాగ్ధాటికి నేను ఆకర్షితుడనయ్యాను. 'ఏనాటికైనా ఆయనలాగా ప్రసంగించాలి' అని నిర్ణయించుకున్నాను. ఆ రకంగా వక్తృత్వంలో ఆయన నాకు గురుతుల్యులు. ఆనాటి శిక్షణాశిబిరంలో నేనూ, బి.వి. విజయలక్ష్మి సాంస్కృతిక కార్యక్రమాల నిర్వాహకులుగా ఉన్నాం. 19–2–1974 నాడు జరిగిన సుధాకరరెడ్డి–విజయలక్ష్మిల కులాంతర వేదిక వివాహానికి హాజరైన అనేకమందిలో నేనొకడ్ని. కందిమళ్ళ ప్రతాపరెడ్డి వాళ్ల అమ్మాయి భారతితో నా పెళ్లి జరిగిన నాటి నుండి సుధాకరరెడ్డి కుటుంబంతో మా అనుబంధం రోజురోజుకూ పెరుగుతూ వచ్చింది. భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా సుధాకరరెడ్డి, రాష్ట్ర అభ్యుదయ రచయితల సంఘానికి అధ్యక్షుడిగా ఉన్న నన్ను ఎంతో ప్రోత్సహించారు. కార్యదర్శిగా సుధాకరరెడ్డి రాష్ట్ర పార్టీ కార్యదర్శిగా ఉన్నప్పుడు నేను అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించాను. అలాగే 2000, 2006 మధ్యకాలంలో ఆరేళ్ళపాటు 'విశాలాంధ్ర' దినపత్రిక సాహిత్యం పేజీకి అనధికారికంగా బాధ్యతలు నిర్వహిస్తూ నారాయణ సుర్వే, రాజ్ బహదూర్ గౌర్ మొదలైన ప్రసిద్ధ సాహితీవేత్తలతో ఇంటర్వ్యూలు చేయించి ప్రచురించాం. ఆనాటి యువ సాహితీవేత్తలకు 'విశాలాంధ్ర' దినపత్రిక ఒక వేదికలాగా చేయూతనందించింది.



మార్చి 25 సురవరం సుధాకర్‌రెడ్డి జయంతి

రాష్ట్రవ్యాపితంగా అనేకచోట్ల జరిగిన సభలకు, సదస్సులకు సుధాకరరెడ్డితో కలిసి వెళ్ళి, పాల్గొనే అవకాశం నాకు లభించింది. వారితో కలిసి ప్రయాణం చేయడం ఒక మరువరాని జ్ఞాపకం. ఒక ఎడ్యుకేషన్. వేదికపై ఎంత గంభీరంగా ప్రసంగిస్తారో, వేదిక దిగిన తర్వాత ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతున్నప్పుడు చలోక్తులతో, హాస్యోక్తులతో చుట్టూతా వాతావరణాన్ని ఆహ్లాదపరిచేవారు. మా ఇంట్లో జరిగిన శుభకార్యాలకు, వేడుకలకు, విందులకు, పండుగలకు సురవరం సుధాకరరెడ్డి విజయలక్ష్మి కుటుంబ సభ్యులందరూ పాల్గొని నిండు హృదయంతో మమ్మల్ని అభినందించేవారు, ఉత్సాహపరచేవారు. వారితో పెనవేసుకున్న జ్ఞాపకాలు ఎన్నో... ఎన్నె న్నో... 19–2–2024 నాడు సుధాకరరెడ్డి ఇంట్లో నిరాడంబరంగా జరిగిన వారి వివాహ స్వర్ణోత్సవం సందర్భంగా 'వైవాహిక స్వర్ణం' శీర్షికన ఒక కవితను రాసి, లేమినేట్ చేయించి, వారికి బహూకరించాను. ఆ కవితను ఇక్కడ ఉటంకిస్తున్నాను

**యాభై సంవత్సరాల పెళ్ళిరోజు వేడుక**
**సుధాకరరెడ్డి విజయలక్ష్మి వైవాహిక గీతిక**
**వందనం అభినందనం ॥ వందనం ॥**

**ఆదర్శం ఆచరణల సముచిత సమన్వయం**
**కమ్యూనిజమే నిజమని చెదరని మీ విశ్వాసం**
**॥ వందనం ॥**
**ఒడిదుడుకుల నెదుర్కొన్న మీ జీవన ప్రస్థానం**
**ఎన్నెన్నో విజయాలను సాధించిన మీ గమ్యం**
**॥ వందనం ॥**
**ఉద్యమాలు ఊపిరిగా కొనసాగిన పయనం**
**అనురాగం, ఆత్మీయత విరిసిన అనుబంధం**
**॥ వందనం ॥**
**నిఖిల లోకమర్శించు కపిల పుత్రరత్నాలు**
**వినయ విధేయత నిండిన నిత్య స్నేహ హస్తాలు**
**॥ వందనం ॥**
**చిరునవ్వులు చిందించే మీ సుందర వదనాలు**
**ఆప్యాయత కురిపించే మీ సుమధుర వచనాలు**
**॥ వందనం ॥**
**వామపక్ష ఉద్యమాన విరబూసిన దాంపత్యం**
**కులాతీత వివాహాల యువతరాని కాదర్శం**
**॥ వందనం ॥**

ఇంకా ఎన్నో సందర్భాల్లో వారిని గురించి వ్యాసాలూ, అనుభవాలూ, జ్ఞాపకాలూ, కవితలు రాయాలని భావిస్తున్న నాకు వారి మరణవార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. 'ప్రజాగ్రహ గళం ఉద్యమాల దళం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' దినపత్రికకు ఒక నివాళి వ్యాసాన్నీ, 'ప్రజాపక్షం' దినపత్రికకు ఒక స్మృతి గీతాన్ని (ఎలిజీ) రాసి నా శ్రద్ధాంజలి ఘటించాను. ఆ స్మృతిగీతం ఇది

**మృదువైన స్వభావమున్న కమ్యూనిస్టు యోధుడా!**
**ఆత్మీయత ప్రతిరూపం ఓ అమృత హృదయుడా!**
**నిండు జీవితం గడిపిన ఎర్రసేన నాయకుడా!**
**ఎర్రెర్రని వందనాలు అందుకో లాల్ సలాం !**
**॥మృదు॥**

**చెదిరిపోని చిరునవ్వు మీ మోమున కాభరణం**
**ప్రేమపూర్వ పలకరింత మిత్రత్వపు పులకరింత**
**పాతతరం కమ్యూనిస్టు వారసత్వ సారథి**
**నేటితరం నాయకులకు నికార్సయిన వారధి**
**॥మృదు॥**

**విద్యార్థుల ఉద్యమాల మీ సమగ్ర నేతృత్వం**
**విజయాలను సాధించిన అసామాన్య సామర్థ్యం**
**ఎన్నెన్నో సమరాలను నడిపిన మీ అనుభవం**
**తెలుగునాట రాజసంగ ఎగిరిన జయకేతనం**
**॥మృదు॥**

**నిరంతర అధ్యయనం నిర్విరామ సాధనం**
**సిద్ధాంతం ఆచరణల తిరుగులేని సమన్వయం**
**లక్షలాది ప్రజలను ఉర్రూతలూపిన వక్తృత్వం**
**లక్ష్యం సాధించే దిశగా నిబద్ధకార్యకర్తృత్వం**
**॥మృదు॥**

**జాతీయస్థాయిలోన వెలిగిన తెలుగుతేజం**
**వామపక్ష ప్రజాతంత్ర ఉద్యమ ప్రవాహం**
**పార్లమెంట్లో మార్మోగిన ప్రజాగ్రహగళం**
**జనచేతన విరబూసిన ఉద్యమాలదళం**

**మీ ఆశయ సాధనకై శ్రమిస్తాము మేము !**
**మీ ప్రేరణ కాగడాగ గ్రహిస్తాము మేము !**
**ఎర్రెర్రని వందనాలు అందుకో సురవరం !**
**మీ ఉద్యమ ప్రస్థానం**

### మాకు స్ఫూర్తిదాయకం !

జీవితంలోనూ, ఉద్యమ ప్రస్థానంలోనూ ఎన్నో ఒడిదుడుకులనూ, జయాపజయాలనూ ఎదుర్కొంటూనే తాను నమ్ముకున్న కమ్యూనిస్టు సిద్ధాంతాలకోసం అంకితమై పురోగమించిన సురవరం సుధాకరరెడ్డి జీవితం, వ్యక్తిత్వం, సిద్ధాంతం నేటితరానికీ, రానున్న తరాలకూ స్ఫూర్తిదాయకం, ఆదర్శప్రాయం.



# శనగల కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు

**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ :** శనగలు పండించిన రైతులు పూర్తి మద్దతు ధర పొందాలని సిర్పూర్ శాసనసభ్యులు డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు అన్నారు. కాగజ్ నగర్ పట్టణంలోని బీట్ మార్కెట్లో మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శనగల కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దహెగాం మండలం కర్జి, గిరివెల్లి ప్రాంతాల్లో దాదాపు వెయ్యి క్వింటాళ్ల శనగల ఉత్పత్తి జరిగిందని రైతుల ద్వారా తెలుసుకున్నట్లు చెప్పారు. రైతుల సౌకర్యార్థం మార్క్ ఫెడ్ అధికారులతో చర్చించి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, శనగలు పండించిన రైతులు కేంద్రాన్ని వినియోగించుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ జిల్లా అధికారి వెంకటి, మార్కెట్ కమిటి చైర్మన్ సిద్ధల దేవయ్య, జిల్లా మార్కెటింగ్ అధికారి అష్ఫాక్, ఎడిఎ మనోహర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సామ్యూల్, మండల వ్యవసాయ శాఖ అధికారులు ప్రేమలత, కార్తీష, ఏఈఓలు దుర్గా భవానీ, సృజన, శ్రీనివాస్, పిఏసిఎస్ కార్యదర్శి సతీష్ గౌడ్, రైతులు పాల్గొన్నారు.




# అడవులను కాపాడితేనే నీటి వనరుల పెరుగుదల

జిల్లా అటవీ అధికారి నీరజ్ కుమార్ తివారి

**ప్రజాపక్షం/తిర్యాణి :** అడవులను కాపాడితేనే నీటి వనరులు పెరుగుతాయని, ప్రకృతిని నాశనం చేస్తే భవిష్యత్తులో నీటి కొరత తీవ్రమవుతుందని జిల్లా అటవీ అధికారి నీరజ్ కుమార్ తివారి పేర్కొన్నారు. ఆదివారం తిర్యాణి మండలంలోని ఎన్‌టిఆర్ ప్రాజెక్టు వద్ద ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నీటి కాలుష్యం, చెట్ల నరికివేత, వాతావరణ మార్పుల వల్ల కలిగే ప్రమాదాలను విద్యార్థులకు వివరించారు. చలమల ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, దీని ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వెల్లడించారు. పర్యావరణానికి హాని కలగకుండా ప్రకృతి అందాలను కాపాడుతూ అభివృద్ధి పనులు చేపడతామని స్పష్టం చేశారు. అనంతరం విద్యార్థులకు డ్రాయింగ్ బుక్స్, పెన్సిల్స్ పంపిణీ చేసి నీటి సంరక్షణపై అవగాహన కల్పించి చెరువు వద్ద నీటి వనరుల సంరక్షణపై ప్రత్యేక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిర్యాణి ఫారెస్ట్ అధికారి శ్రీనివాస్, గిన్నెదారి ఫారెస్ట్ అధికారి సరోజిని, అటవీ శాఖ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



# సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/నేరడిగొండ :** బోత్ నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన 76 మంది లబ్ధిదారులకు 25 లక్షల 66వేల రూపాయల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆదివారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్,నేరడిగొండ మండల కేంద్రంలోని తన నివాసంలో చెక్కుల పంపిణి చేశారు.అనంతరం లబ్ధిదారులను ఉద్దేశించి అయన మాట్లాడుతూ ఆపద కాలంలో ప్రజలకు ఒక వరంగా ఈ పథకం పేద ప్రజలకు అండగా ఉందని అన్నారు.బోథ్ నియోజకవర్గంలో ఇంకా పేద ప్రజలు ఎవరైనా ప్రైవేటు హాస్పిటల్ లో డబ్బులు పెట్టి చూపెట్టుకున్న వారు ఉంటే హాస్పిటల్ ఒరిజినల్ బిల్లులు,పేసెంట్ ఆధార్‌కార్డు,రేషన్ కార్డు,బ్యాంకు పాస్ బుక్, ఫోటో, తీస్కోని వస్తే వారికి ప్రభుత్వం నుంచి నిధుల అందేవిధంగా చూస్తాను అని అన్నారు.ఈఈ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గం నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# ఎల్లమ్మ ఆలయం వద్ద సిసి రోడ్డు పనులు ప్రారంభం

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నిజాంపేట మండల కేంద్రంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఎమ్మెల్యే నిధులలో భాగంగా సీసీ రోడ్డు పనులకై 7 లక్షల రూపాయలు మంజూరు కాగా ఆదివారం గ్రామ సర్పంచ్ చలిమేటి నరేందర్, మండల కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో సిసి రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు సహకారంతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించామన్నారు. మండలానికి అహర్నిశలు కృషి చేస్తూ మండల అభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యేకు నాయకులు గౌడ సంఘ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల పోరం అధ్యక్షులు భాను ప్రకాష్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెల్దుర్తి వెంకటేష్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు కొమ్మాట బాబు,కాంగ్రెస్ సీనియర్ నాయకులు నసీరుద్దీన్, మాజీ సర్పంచ్‌లు కొమ్మట సత్యనారాయణ, బజార్ తిరుమల గౌడ్, ఉప సర్పంచ్ గేరిగంటి బాబు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# యువకుడి హత్య కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్

పట్టణ సిఐ ప్రమోద్ రావు

**ప్రజాపక్షం/మంచిర్యాల :** మంచిర్యాల కాలేజీ రోడ్డులో ఈనెల 19న జరిగిన దీపక్ (35) అనే యువకుడి హత్య కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసినట్లు పట్టణ సిఐ ప్రమోద్ రావు తెలిపారు. ఆదివారం మంచిర్యాల పట్టణ పోలీస్ స్టేషన్‌లో వివరాలను వెల్లడించారు. యువకుడి హత్యత కేసులో కాసిపేట మండలం పల్లంగూడకు చెందిన భీమిని సంజీవ్ (28), మహారాష్ట్రలోని ఆహెరికి చెందిన సీడం దీపక్ (37)ను అదుపులోకి తీసుకొని, నిందితుల వద్ద నుండి హత్యకు ఉపయోగించిన ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. నిందితులను మంచిర్యాల కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారని అన్నారు. నిందితులను పట్టుకోవడంలో లక్షెట్టిపేట సిబ్బంది కీలక పాత్ర పోషించారని ఆయన తెలిపారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

రాష్ట్ర గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద





**ప్రజాపక్షం/రామకృష్ణాపూర్ :** ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. ఆదివారం జిల్లాలోని క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, అధికారులతో కలిసి ఆయన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ క్యాతనపల్లి మున్సిపాలిటీలో 200 కోట్ల రూపాయల అంచనా నిధులతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. అమృత్ పథకంలో భాగంగా మందమర్రి మున్సిపాలిటీలో 30 కోట్లు, క్యాతనపల్లిలో 40 కోట్లు, చెన్నూర్ మున్సిపాలిటీలో 30 కోట్ల రూపాయలతో పనులు జరుగుతున్నాయని వివరించారు. ఇంటింటికి నల్లా కనెక్షన్ ద్వారా తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, క్యాతనపల్లిని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. పట్టణంలో 60 లక్షల రూపాయల నిధులతో 40 హైమాస్ లైట్లను ఏర్పాటు చేస్తున్నామని, అమృత్ 2.0 పథకం కింద 2.09 కోట్ల రూపాయలతో చెరువు సుందరీకరణ పనులు చేపడుతున్నామని వెల్లడించారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో 30 కోట్ల రూపాయల డిఎంఎఫ్టి నిధులతో చేపట్టిన పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. పట్టణంలో 21 సోలార్ హైమాస్ లైట్లు మంజూరయ్యాయని, వీటిద్వారా మున్సిపాలిటీకి విద్యుత్ బిల్లులు తగ్గుతాయని పేర్కొన్నారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా అమృత్ పథకం ద్వారా శుద్ధమైన జలాన్ని సరఫరా చేస్తామని వివరించారు. మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# విద్యారంగంపై పాలకుల మాటలు నీటిమూటలు

24న కలెక్టరేట్ ఎదుట ఆందోళన


పెద్ద ఎత్తున టీచర్లు పాల్గొనాలని టిపిటిఎఫ్ పిలుపు

**ప్రజాపక్షం/మెదక్ :** విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని పదే పదే చెప్పుకుంటున్న పాలకుల మాటలన్ని నీటి మూటలే నని ఈ బడ్జెట్లో 8.2 శాతం విద్యారంగానికి నిధులు కేటాయించి ప్రజలను మళ్లీ ఒకసారి నిరాశ పరిచిందని, ప్రభుత్వ నిరంకుశ వైఖరి ని నిరసిస్తూ ఈ నెల 24న కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపడుతున్నట్లు తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టిపిటిఎఫ్) మెదక్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కొంగోటి యాదగిరి, పి వెంకట్రామిరెడ్డి లు పిలుపునిచ్చారు. ఆరివారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నట్లుగా విద్యారంగానికి 20 శాతం, తెలంగాణ విద్యా కమిషన్ సూచించినట్లు 18 శాతం, కనీసం కాంగ్రెస్ పార్టి తన మ్యానిఫెస్టోలో ప్రకటించినట్లుగా 15 శాతం కూడా బడ్జెట్ లో ప్రకటించక పోవడం విడ్డురంగా ఉందన్నారు. ప్రభుత్వం మాటలకు చేతలకు పొంతన లేదని ఆవెదన వ్యక్తం చేశారు. తక్కువ బడ్జెట్ తో పథకాలు ప్రకటనలకే పరిమితం అయ్యే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ లో విద్యారంగ కేటాయింపుల పై పునఃపరిశీలన చేసి మానవ వనరుల అభివృద్ధికి కీలక పాత్ర పోషించే విద్యారంగానికి అధిక బడ్జెట్ కనీసం 15 శాతం కేటాయించలని డిమాండ్ చేశారు. ఈ నెల 24 న జిల్లా కలెక్టరెట్ ఎదుట చేపట్టే ఆందోళన కార్యక్రమం లో ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలునిచ్చారు.

# నిర్మల్ జిల్లా లైసెన్స్‌డ్ సర్వేయర్ల సంఘం అధ్యక్షుడిగా నాగుల ఉదయ్ కిరణ్ రెడ్డి



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో జిల్లా లైసెన్స్‌డే సర్వేయర్ల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలో సంఘం అధ్యక్షుడిగా నాగుల ఉదయ్ కిరణ్ రెడ్డిని సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.ఉపాధ్యక్షుడిగా దశరథ, నిఖిల్, కె.చంద్రకాంత్ ఎన్నికవగా,ప్రధాన కార్యదర్శులుగా కొండూరు భీమేష్, దుద్దిల్ల సరిల్ బాధ్యతలు చేపట్టారు. సంఘం కోశాధికారిగా షేక్ కైసర్,సహాయ కార్యదర్శులుగా కొప్పుల రాకేష్,పార్థులను నియమించారు.ప్రచార కార్యదర్శులుగా బట్టి ప్రవీణ్,ఎనుగందుల రాజశేఖర్,ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా సచిన్ కుమార్,జాదవ్ రోహిదాస్ ఎన్నికయ్యారు.సంఘ కార్యవర్గ సభ్యులుగా కరణ్,రణధీర్,గంగాధర్ బాధ్యతలు స్వీకరించగా,లీగల్ అడ్వైజర్‌గా సట్లపల్లి ప్రవీణ్ కుమార్ వ్యవహరించనున్నారు.మహిళా ప్రతినిధులుగా దేవి శ్వేత,నాగరాణిలను సభ్యులు ఎన్నుకున్నారు.జిల్లాలోని లైసెన్స్‌డ్ సర్వేయర్ల సమస్యల పరిష్కారం కోసం,వారి సంక్షేమం కోసం నూతన కార్యవర్గం ఐక్యంగా కృషి చేస్తుందని ఈ సందర్భంగా ఎన్నికైన ప్రతినిధులు ధీమా వ్యక్తం చేశారు.నూతన కార్యవర్గాన్ని తోటి సభ్యులు అభినందిస్తూ ఘనంగా సన్మానించారు.



# పాడి పంటలతో సస్యశ్యామలంగా ఉండాలి

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/శివ్వంపేట :** అమ్మవారి దయతో పాడి పంటలతో సస్యశ్యామలంగా ఉండాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. శివ్వంపేట మండలం లింగోజిగూడ గ్రామంలో గత రెండు రోజులుగా జరుగుతున్న రేణుక ఎల్లమ్మ జాతర ఉత్సవాలకు ఆదివారం జరిగిన అమ్మవారి కళ్యాణ మహోత్సవానికి ఎమ్మెల్యే, పార్టీ శ్రేణులతో కలసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవాలయంలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం ముందు పటం వేసి అమ్మవారి కళ్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి బోనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షులు రమణాగౌడ్, నాయకులు తాటికొండ రాజశేఖర్‌గౌడ్, సత్యం, లాయక్, నాగేశ్వర్‌రావు, కన్నారం దుర్గేష్, యాదాగౌడ్, సర్పంచ్ అమృత అశోక్ గౌడ్, ఉపసర్పంచ్ గన్య, మాజీ సర్పంచ్ మెగావత్ రవి, అరవింద్‌గౌడ్, నాగ్యారి యాదగిరి, కిష్టాగౌడ్, వెంకటేష్‌గౌడ్, కొమ్రెగారి రాజు, భక్తులు పాల్గొన్నారు.



# గ్రామ అభివృద్ధికి మరో ముందడుగు

**ప్రజాపక్షం/శివ్వంపేట :** శివ్వంపేట మండలం గుండ్లపల్లి గ్రామంలో గ్రామ అబివృద్ధికి మరో ముందడుగు పడింది. గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి శంఖుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. గ్రామ ప్రజలు చాలా కాలంగా ఎదురుచూస్తున్న సీసీరోడ్ల నిర్మాణం ద్వారా రాకపోకలు సులభమవుతాయని వర్షాకాలంలో ఎదురయ్యే సమస్యలు తగ్గుతాయని పేర్కొన్నారు. ఈ రోడ్ల నిర్మాణంతో గ్రామంలో పరిశుభ్రత పెరగడంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఆయన అన్నారు. అభివృద్ధి కార్యక్రమాలలో ప్రజల సహకారం అవసరమని, గ్రామాన్ని ఆదర్శ గ్రామంగగా తీర్చిదిద్దేందుకు అందరు కలసి పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మమత నర్సింలు, సీనియర్ నాయకులు మాధవరెడ్డి, పులిమామిడి నవీన్‌గుప్తా, లక్ష్మి కాంతం, సర్పంచ్‌లు మమత ఆంజనేయులు, హైమావతి ఆంజనేయులు, దొంతి శ్రీనివాస్, వార్డు సభ్యులు వినోద్, సత్యనారాయణ, దుత్తు, యువకులు గ్రామస్థులు పాల్గొన్నారు.

# కోదండ సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికావిష్కరణ

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



**ప్రజాపక్షం/పటాన్‌చెరు :** శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకొని ఈ నెల 25వ తేది నుండి 29వ తేది వరకు పటాన్చెరు డివిజన్ పరిధిలోని శ్రీ కోదండ సీతారామచంద్రస్వామి దేవాలయంలో నిర్వహించనున్న బ్రహోత్సవాల ఆహ్వాన పత్రికను ఆదివారం ఉదయం దేవాలయం ఆవరణలో పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. దశాబ్దాల చరిత్ర కలిగిన శ్రీ కోదండ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో ప్రజలు ,భక్తుల సహకారంతో ప్రతి ఏటా ఐదు రోజుల పాటు వేద మంత్రోచ్చరణాల మద్య భక్తుల జయ,జయ ధ్వనాలతో స్వామి వారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈ నెల 27 వ తేదిన వేలాది భక్తుల సమక్షంలో అభిజిత్ లగ్న సుముహూర్తమున శ్రీ సీతారామచంద్రస్వామి వార్ల కళ్యాణమహోత్సవాన్ని నిర్వహించబోతున్నట్లు తెలిపారు. ఐదు రోజుల పాటు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు భక్తులందరూ భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాలను దిగ్విజయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్లు శంకర్ యాదవ్, సఫాన్‌దేవ్, మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మేన్ విజయ్ కుమార్ , అర్చక స్వామి నరసింహాచార్యులు, సీనియర్ నాయకులు కుమార్ యాదవ్, వృథ్వీరాజ్, వృథ్వీరాజ్ ,అశోక్, వెంకటేష్, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# క్యాసారం రేణుక ఎల్లమ్మ మూడవ వార్షికోత్సవానికి ఆహ్వానాలు

ముఖ్యఅతిథిగా బిఆర్ఎస్ నాయకుడు గడీల శ్రీకాంత్ గౌడ్



**ప్రజాపక్షం/పటాన్‌చెరు :** పటాన్‌చెరు మండలం క్యాసారం గ్రామంలో 29 మార్చి నుంచి 2 ఏప్రిల్ వరకు జరగనున్న శ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి మూడవ వార్షికోత్సవానికి గౌడ సంఘం సభ్యులు ప్రముఖులను ఆహ్వానిచారు. పటాన్‌చెరు నియోజకవర్గం ఇస్నాపూర్ లోని తనకార్యాలయంలో ఈ ఆహ్వానాలు జరిగాయి. పటాన్‌చెరు మండల ఇంచార్జీ ,మాజీ జెడ్పిటీసి గడీల శ్రీకాంత్ గౌడ్ ను ప్రధాన అతిథిగా ఆహ్వానించారు. అంతేకాకుండా ఇస్నాపూర్ మున్సిపల్ కౌన్సిలర్ మచ్చ కిషోర్ రెడ్డి,, తలారి అంజనేయులు ,బస్‌రెడ్డి, జనార్దన్ రెడ్డి వారిని కూడా గౌడ సంఘం సభ్యులు ఆహ్వానించారు . ఈ కార్యక్రమంలో బాలగౌడ్, నర్సింహ గౌడ్, మల్లేష్ గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రామకృష్ణ గౌడ్, సత్యనారాయణ గౌడ్, ప్రభుగౌడ్, రాజుగౌడ్, యోగిష్ గౌడ్, సాయి గౌడ్‌లు పాల్గొన్నారు. గ్రామవాసులు ఈ ఉత్సవాన్ని విజయవంతం చేయాలని కోరుచున్నారు.



# పంటను కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

**ప్రజాపక్షం/ముధోల్ :** ఆరుగాలం కష్టపడి రైతులు పండించిన పంటను కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. బైంసా పట్టణంలోని మార్కెట్ యార్డ్,తానూర్ మండల కేంద్రంలోని డాంగేపల్లి గోదాంలో, కుబీర్ మార్కెట్ యార్డులో,ముథోల్లోని పిఎసిఎస్ గోదాంలో మార్క్‌ఫెడ్, నాఫెడ్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో కేంద్రాంన్ని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల శ్రేయస్సు కోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని తెలిపారు. శనగ పండించిన రైతులు ప్రైవేటు వ్యాపారుల వద్ద అమ్మకాలు చేయకుండా,ప్రభుత్వం ఏర్పాటు చేసిన మద్దతు ధర కేంద్రాలను వినియోగించుకోవాలని సూచించరు.ప్రస్తుతం శనగకు క్వింటాలుకు రూ.5875 మద్దతు ధర ఉన్నదని,పంటలో తేమ 14 శాతానికి మించకూడదని ఆయన స్పష్టం చేశారు.ప్రైవేటు మార్కెట్ ధరలతో పోలిస్తే,ఎంఎస్పీ ఎక్కువగా ఉండటం వల్ల రైతులు ప్రభుత్వ కేంద్రాల్లోనే తమ పంటను విక్రయించి లాభపడాలని అయన పేర్కొన్నారు.అలాగే త్వరలోనే మక్కా, జొన్న కొనుగోలు కేంద్రాల ప్రారంభం కోసం రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లినట్లు తెలిపారు.త్వరలోనే ఆ కేంద్రాలు కూడా ప్రారంభం కానున్నాయని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆనందరావు పటేల్,మాజీ జడ్పిటిసి లక్ష్మి నర్సాగౌడ్,సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు కల్లెడ కిష్టయ్య,సర్పంచులు నారాయణ,మహేందర్‌రెడ్డి,ఏఎంసీ డైరెక్టర్ రామ్నాథ్,బిజెపి మండల అధ్యక్షుడు కోరి పోతన్న,నాయకులు లడ్డు పోతన్న,లక్ష్మి నారాయణ జంబుల సాయిప్రసాద్,ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు

ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా




**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలాచూస్తానని, ఆర్థిక స్థోమత లేని వారికి సిఎంఆర్ఎఫ్ పథకాన్ని అందించడం నా బాధ్యత అని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌లోగల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు పడుతు వైద్యం పొందలేని వారికి సిఎంఆర్‌ఎఫ్ పథకం ద్వారా చెక్కులు అందించడం తన బాధ్యత అని అన్నారు. నియోజకవర్గంలోని పేదలు దరఖాస్తు విషయంలో ఎటువంటి జాప్యం లేకుండా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తన బృందం ఎప్పుడు అందుబాటులో ఉంటుందన్నారు. దరఖాస్తు మొత్తంలో వీలైనంత ఎక్కువగా చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. గత ప్రభుత్వం డబుల్‌బెడ్ రూం ఇల్లు నియోజకవర్గంలో ఒకటి కూడా ఇవ్వలేదని ఎమ్మెల్యే గుర్తుచేశారు. నాగారంలో గల 396 ఇల్లు, కలెక్టరేట్ సమీపంలోని 200 ఇల్లు ఉన్నాయని వీటిని అర్హులైన నిరుపేదలకు అందించే ఏర్పాటు చేస్తానన్నారు. ఈ సందర్భంగా మొత్తం 85 మందికి రూ.56,20,500 విలువగల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జగదీష్ కులకర్ణి, మఠం పవన్, చింతకాయల రాజేందర్, ఇప్పకాయల కిషోర్, దాంపల్లి జ్యోతి మురళి, బొబ్బిలి సుమిత్ర వేణు, కలిపె అర్చన చిరంజీవి, బంటు ప్రీతి ప్రవీణ్, నాయకులు బద్దం కిషన్, పుట్ట వీరేందర్ నాయకులు పాల్గొన్నారు.

# భూ నిర్వాసితులకు సింగరేణి యాజమాన్యం మొండిచేయి

నేతకాని మహార్ సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు దుర్గం గోపాల్

**ప్రజాపక్షం/కాసిపేట :** పదేళ్ల క్రితం భూములు సేకరించిన సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా సింగరేణి యాజమాన్యం భూ నిర్వాసితులకు మొండిచేయి చూపిస్తోందని నేతకాని మహార్ సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు దుర్గం గోపాల్ ఆవేదన వ్యక్తం చేశారు.
కాసిపేట మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని కొమిటిచేను, పల్లంగుడ, సోమగూడ ప్రాంతాల్లో భూమిని కోల్పోయిన రైతులకు ఇంటికో ఉద్యోగం ఇస్తామని, గ్రామాభివృద్ధితో పాటు విద్య, వైద్యం, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పిస్తామని నమ్మబలికి భూములను సేకరించారని, కానీ నేడు ఓపెన్ కాస్ట్ గనుల కోసం భూములు ఇచ్చిన వ్యవసాయదారులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. గత పదేళ్లుగా కెకె 2 ఓపెన్ కాస్ట్ లో దుర్గ, ఆర్‌విఆర్ కంపెనీలలో డంపర్ ఆపరేటర్లుగా పని చేస్తున్న తమను కాదని, కొత్తగా వచ్చిన సమ్మర్ మ్యాక్స్ ఏజెన్సీ వారు స్థానిక నిర్వాసితులకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని బాధితులు పేర్కొన్నారు.
గోదావరిఖని, రామగుండం, తాండూరు వంటి ప్రాంతాల వారికి పనులు కల్పిస్తూ స్థానికులను విస్మరిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి శేఖర్, దుర్గం వెంకటస్వామి, తాళ్లపల్లి శంకర్, కుడుమేత చంద్రమౌళి, కుమ్మరి శ్రీకాంత్, ఎడమ శ్రీకృష్ణ, కేలోత్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# నాటక ప్రదర్శన పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/సిర్పూర్ టి :** సిర్పూర్ టి మండలం కోనేరు కాలనీలో ఏప్రిల్ 5న నిర్వహించనున్న నాటక ప్రదర్శన పోస్టర్లను మాజీ ఎంఎల్ఏ కోనేరు కోనప్ప ఆదివారం ఆవిష్కరించారు. బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం సందర్భంగా మధ్యాహ్నం 3 గంటలకు ఈ నాటక ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మహారాష్ట్ర, ఒడిశా ప్రాంతాలకు చెందిన కళాకారులు ప్రత్యేక ప్రదర్శనలు ఇవ్వనున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## రైతును రాజును చేయడమే కాంగ్రెస్ లక్ష్యం

**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** కాంగ్రెస్ ప్రజాపాలనలో రైతును రాజును చేయడమే లక్ష్యంగా సిఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నాడని గజ్వేల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ నాయకులు, తిగుల్ మాజీ సర్పంచ్ భానుప్రకాశ్‌రావు పేర్కొన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా నర్మేటలో ఆయిల్‌పామ్ కంపెనీ ప్రారంభకార్యక్రమానికి రైతులతో కలిసి వెల్లిన సందర్భంగా పార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు. రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని వ్యవసాయ రంగాన్ని వాణిజ్యరంగంగా మార్చేందుకు సిద్దిపేట జిల్లాలో రూ. 3వందల కోట్లతో ప్యాక్టరీని ఏర్పాటు చేసి ప్రారంభించడం హర్షనీయమని ఆయన అన్నారు. ఆర్థికంగా వెనుకబాటుకు గురైన రైతాంగాన్ని ఆదుకునేందుకు పంట పెట్టుబడి సాయం కింద సంవత్సరానికి రూ. 12వేల చొప్పున అందిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే నర్మేట్ట వేదికగా రైతు భరోసాను సిఎం ప్రారంభించగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని సంతృప్తిని వ్యక్తం చేశారు. అలాగే జగదేవ్‌పూర్ మండల కేంద్రంలో రూ. 9 కోట్లతోని ర్మాణం పూర్తైన ఇంటిగ్రేటేడ్ భవనాలకు వర్చువల్‌గా సభ ప్రాంగాణంలో సిఎం ప్రారంభించడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు.

## జల సంరక్షణ కోసం నడుంబిగించాలి:మేయర్




**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:**వేసవికాలంలో భూగర్భ జలాలు అడుగంటిపోయే పరిస్థితులు ఉన్నాయని, జలసంరక్షణ కోసం ప్రతి ఒక్కరు నడుం బిగించాలని, నీటి ఎద్దడి శాశ్వత నివారణ జల సంరక్షణతోనే సాధ్యమని, నీటిని సంరక్షించే బాధ్యత ప్రజల చేతుల్లోనే ఉందని నగరపాలక సంస్థ మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఉదయం స్థానిక వైశ్యభవన్‌లో మానేరు పర్యావరణ సమితి ఆధ్వర్యంలో ప్రపంచ జల దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన ఆయన ముందుగా సుజలాం సుఫలాం అనే గోడ ప్రతులను ఆవిష్కరించి మాట్లాడారు. ఎండాకాలం త్రాగునీరు లేక ఎంతోమంది ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.నగరంలో ప్రతి ఒక్కరు తమ ఇంటిలో కచ్చితంగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. 66వ డివిజన్ కార్పోరేటర్ వంగల పవన్, మానేరు పర్యావరణ సమితి బాధ్యులు గంజి స్వరాజ్యబాబు, సామ నారాయణ, కొమురవెల్లి వెంకటేశం, గంగిశెట్టి సత్యనారాయణ తదితరులున్నారు.

## అక్రమంగా రవాణా చేస్తున్న ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**ప్రజాపక్షం/కొత్తపల్లి:**కరీంనగర్ రూరల్ మండల పరిధిలో ఆదివారం పోలీసులు గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా సుల్తానాబాద్ మండలం నారాయణరావు పల్లె గ్రామానికి చెందిన బర్రె సతీష్ అనే వ్యక్తి తన యజమాని చిగురి సుధాకర్ ఆదేశాల మేరకు అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను రవాణా చేస్తుండగా మొగ్దుంపూర్ గ్రామం వద్ద కరీంనగర్ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. అట్టి ట్రాక్టర్లు సీజ్ చేసి నిందితులపై కేసు నమోదు చేసి తదుపరి చర్య నిమిత్తం కోర్టుకు పంపించినట్లు కరీంనగర్ రూరల్ సిఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఎవరైనా అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## 'ఆల్ఫోర్స్' విద్యార్థులకు నైతిక విలువలపై అవగాహన సదస్సు




**ప్రజాపక్షం/కొత్తపల్లి:**విద్యార్థులకు విజయంతో పాటు నైతిక విలువల పట్ల ఆసక్తి ఉండాలని, తరగతి గదిలో నేర్చుకున్నటువంటి నైతిక విలువలను ప్రతినిత్యం పరిరక్షించాలని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి అన్నారు. ప్రముఖ స్త్రీల వైద్య నిపుణులు శ్రీదేవి, డాక్టర్ సంగీతరెడ్డి, డాక్టర్ వనజా నరేందర్‌రెడ్డి, యోగా గురువు లక్ష్మణ్, సంస్కృతం అధ్యాపకురాలు అరుణలతో కలిసి స్థానిక వావిలాలపల్లిలోని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల కేంద్ర కార్యాలయంలో సుఫథాం వారితో కలిసి సంయుక్తంగా ఏర్పాటు చేసిన వ్యక్తిత్వ వికాసం అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ విద్యాసంవత్సరం నుంచి భగవద్గీత శ్లోకాల పఠనం, సంగీతం, సంస్కృతం శిక్షణ నిపుణులచే ఇప్పించడం జరుగుతుందని చెప్పారు. నైతిక విలువలు వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందిస్తాయన్నారు. 4 నుంచి 8వ తరగతి విద్యార్థులకు ప్రతి ఆదివారం మే 15 వరకు కొనసాగుతుందని వారు చెప్పారు. కార్యక్రమంలో పలు పాఠశాలల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతు భరోసా నిధులు విడుదల



**ప్రజాపక్షం/కొత్తపల్లి:**కొత్తపల్లి మండలంలోని రైతు వేదికలో ఆదివారం సిఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం, రైతు భరోసా పథకం కింద ఎకరానికి రూ.6 వేలు విడుదల చేసే కార్యక్రమాన్ని లైవ్ టెలికాస్ట్ ద్వారా వీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, సహాయ వ్యవసాయ సంచాలకులు రణధీర్, మండల వ్యవసాయ అధికారి సంతోష్ కుమార్, ప్రజాప్రతినిధులు, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగు రైతులకు దీర్ఘకాలిక ఆదాయం కలిగించే పంటగా ఉండి, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలతో రైతులు దీనిని విస్తృతంగా చేపట్టాలని సూచించారు. ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ స్థాపనతో స్థానికంగా మెరుగుపడడంతో పాటు రైతులకు సరైన ధరలు లభించే అవకాశం ఉంటుందని తెలిపారు.

# 'సింగరేణి'బకాయిలను వెంటనే చెల్లించాలి

'సేవ్ సింగరేణి' పోరు జాతా కార్నర్ మీటింగ్‌లో ఎఐటియుసి నాయకుల డిమాండ్




**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సింగరేణి సంస్థకు రావాల్సిన 51 వేల కోట్ల రూపాయల బకాయిలను వెంటనే చెల్లించాలని, కొత్త గనులు ప్రారంభించాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాల్ రాజ్,సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఆదివారం గోదావరిఖని చౌరస్తా లో జరిగిన సేవ్ సింగరేణి పోరు జాత కార్నర్ మీటింగ్‌లో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. సింగరేణిలో కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరించడంలో యాజమాన్యం వైఫల్యం చెందిందని వారు ఆరోపించారు. ముఖ్యంగా సింగరేణిలో రాజకీయ జోక్యం వల్ల కొత్త గనులు రావడం లేదని,ఉన్న గనులు మూసివేతకు దగ్గరలో ఉన్నాయని, వెంటనే కొత్త గనులను ప్రారంభించాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన 51 వేల కోట్ల రూపాయల బకాయిలను చెల్లించకుండా సంస్థను నిర్వీర్యం చేస్తుందని వారు ఆరోపించారు.వెంటనే రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి రావాల్సిన బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఎసిబి విచారణ పేరుతో నిలిపి వేసిన మెడికల్ బోర్డును వెంటనే నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా సింగరేణిలో మారుపేర్లు, విజిలెన్స్ కేసుల కార్మికుల డిపెండెంటులకు ఉద్యోగాలు ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం వల్లే ఇవ్వడం లేదని వారు ఆరోపించారు, వెంటనే వారికి ఉద్యోగాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. సింగరేణి యాజమాన్యం ఎఐటియుసితో జరిపిన స్ట్రక్చర్ కమిటీ సమావేశాల్లో ఒప్పుకున్న డిమాండ్‌లను అమలు చేయకుండా యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తుందని వారు ఆరోపించారు, వెంటనే ఒప్పుకున్న డిమాండ్‌లను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలని తదితర డిమాండ్‌లపై సింగరేణి వ్యాప్తంగా మార్చి 30 వరకు ఎఐటియుసి సేవ్ సింగరేణి పోరు జాత ను నిర్వహించడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. యాజమాన్యం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణి కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని లేకుంటే ఎప్రిల్ లో సమ్మెకు పిలుపు నిస్తామని వారు హెచ్చరించారు. ఇట్టి సమావేశానికి సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ అధ్యక్షత వహించగా నాయకులు వీరభద్రం, వై.వి. రావు, ముస్కె సమ్మయ్య, కవ్వంపల్లి స్వామి, బాజీసైదా, కనకరాజు, సూర్య, సంకె అశోక్, మాదన మహేష్, రంగు శ్రీను, ఎం.ఎ.గౌస్, విజయలక్ష్మి, ఓదెమ్మ తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి ముందు గోదావరిఖని భాస్కర్ రావు భవన్ నుంచి ప్రధాన రోడ్డు మీదుగా చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు.ప్రజానాట్య మండలి కళాకారులు కన్నం లక్ష్మి నారాయణ,లెనిన్, మోహన్,జాలిగం రాజు,రాంచందర్,చంద్ర మోహన్ లు విప్లవ గేయాలు ఆలపించారు.

## హమాలీల సమస్యలను పరిష్కరిస్తా

ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ ఎస్. బాలరాజ్ పిలుపు



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** హమాలీల సమస్యలను పరిష్కరిస్తానని నూతనంగా ఎన్నికైన సివిల్ సప్లై హమాలి యూనియన్ పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు కడారి సునీల్ అన్నారు.ఆదివారం రోజునపెద్దపల్లి జిల్లా కేంద్రంలో జరిగినఏఐటీయూసీ సివిల్ సప్లై హమాలీ యూనియన్ జిల్లా మహాసభలో జిల్లా అధ్యక్షులుగా కడారి సునీల్ ను జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎం గట్టయ్యను జిల్లా ఉపాధ్యక్షులుగా ఎం కుమారును జిల్లా సహాయ కార్యదర్శిగా ఎం తిరుపతిని కోశాధికారిగా బూత్కూరు పోచమలును కార్యవర్గ సభ్యులుగా గుర్రాల సమ్మయ్య ఓంకార్ మహేష్ లను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్టు ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాల్రాజ్ తెలియజేశారు.సమస్యల పరిష్కారం కై ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సివిల్ సప్లై హమాలి వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన కడారి సునీల్ మరియు ఎం కుమార్ ఎంతిరుపతి ఏం గట్టయ్య అండ్ కార్యవర్గానికి శుభాకాంక్షలు అభినందనలు సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శులు సమ్మయ్య వై ఓమయ్య జిల్లా అధ్యక్షులు ఏఐటీయూసీ వైవి రావు మిడ్ డే మిల్స్ వర్కింగ్ ప్రెసిడెంట్ పూసల రమేష్ వివిధ సంఘాల నాయకులు అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు.

## యువత చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దు

చొప్పదండి సిఐ ప్రదీప్ కుమార్, ఎస్ఐ నరేష్‌రెడ్డి



**ప్రజాపక్షం/చొప్పదండి:**యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా సన్మార్గంలో నడిచి బావి భారత పౌరులుగా ఎదగాలని చొప్పదండి సిఐ ప్రదీప్ కుమార్, ఎస్ఐ నరేష్‌రెడ్డిలు పేర్కొన్నారు. ఆదివారం చొప్పదండి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో చొప్పదండి పోలీస్ వర్సెస్ పాత్రికేయుల స్నేహపూర్వక క్రికెట్ పోటీ నిర్వహించారు. ఈ పోటీలో పాత్రికేయులు గెలుపొందగా సిఐ ప్రదీప్ కుమార్, ఎస్ నరేషన్‌రెడ్డిలు బహుమతి ప్రధానం చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ క్రీడల ద్వారా శారీరక వ్యాయామం, మానసిక ఉల్లాసం పెంపొందుతుందన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా క్రీడలపై దృష్టి పెట్టి క్రీడలలో రాణించాలని ఆకాంక్షించారు. క్రీడల ద్వారా శారీరక దారుఢ్యంతో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. విధి నిర్వహణలో నిత్యం ఒత్తిడిని ఎదుర్కొనే పోలీసులు, పాత్రికేయులు క్రీడల్లో పాల్గొనడం ద్వారా మానసిక ప్రశాంతత పొందుతారని పేర్కొన్నారు. ఈ సంధర్బంగా సిఐ, ఎస్ఐలను పాత్రికేయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి ఇప్పనపల్లి సాంబయ్య, కౌన్సిలర్లు గుర్రం రాజేందర్‌రెడ్డి, కనుమల్ల రాజశేఖర్, ఒలగొత్తుల సురేష్, నాయకులు వడ్లూరి శ్రీనివాస్, పెరుమాండ్ల గంగయ్య, ముద్దం తిరుపతి, కొట్టె అశోక్, మరిమండ్ల రాజిరెడ్డి, పోలీసు సిబ్బంది, పాత్రికేయులు న్నారు.

## '420' హామీలపై బరాబర్ నిలదీస్తాం



**ప్రజాపక్షం/ధర్మపురి :** ఎన్నికల మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు,420 హామీలను అమలు చేసేదాకా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బరాబర్ నిలదీస్తామని డిసిఎంఎస్ మాజీ చైర్మన్ డా.ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి, ధర్మపురి మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు అయ్యోరి రాజేష్ కుమార్‌లు తెలిపారు. జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రెస్ మీట్ నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో హామీలన్నీ నెరవేర్చుతామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కి 840 రోజులు గడిచినప్పటికీ ఏ ఒక్క హామీని అమలు చేయక ప్రజలందరినీ వంచించిందని ఆగ్రహం వ్యక్తంచేశారు.ఇక ప్రభుత్వం ముచ్చటగా మూడోసారి బడ్జెట్ ప్రవేశపెట్టగా ఆరు గ్యారెంటీల అమలుకోసం ఎదురు చూస్తున్న 70 లక్షల మంది రైతులు,22 లక్షల మంది కౌలు రైతులు, కోటిమంది అక్కాచెల్లెళ్ళు,లక్షలాది మంది విద్యార్థులు, వృద్ధులు, దివ్యాంగులు,దళితులు, బిసిలు,మైనారిటీలు ఇలా అన్నివర్గాల ప్రజలు దగాకోరు బడ్జెట్ తో తీవ్ర నిస్పృహకు లోనయ్యారని శ్రీకాంత్ రెడ్డి, రాజేష్ లు పేర్కొన్నారు.ఆరు గ్యారెంటీల చట్టబద్ధతకై అసెంబ్లీలో ప్రయివేట్ బిల్లు బిఆర్ఎస్ ఆధ్వర్యంలో పెట్టబోతున్నట్లు వారు తెలిపారు. నమ్మించి మోసంచేయడమే కాంగ్రెస్ నైజమని దుయ్యబట్టారు. ఇచ్చిన హామీలను అమలు చేసేదాకా ప్రభుత్వాన్ని వదిలిపెట్టబోమని బిఆర్ఎస్ పార్టీ ఉద్యమిస్తుందని తెలిపారు.ఈ సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ సంగి సత్తెమ్మ,పట్టణ కన్వీనర్ బండారి రంజిత్,నాయకులు వి.మల్లేశం,ఎస్.శేఖర్, సి.శ్యాంసుందర్, ఆసిఫ్,మహేష్,కార్తీక్,అశోక్,సుధాకర్,నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు లోక మల్లారెడ్డి, జలందర్, రాంచందర్‌గౌడ్, జగన్, మహేష్ పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై ఉద్యమించాలి



**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:**కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజావ్యతిరేక చట్టాలు తెచ్చి దేశ సంపదను కార్పొరేట్లకు, బహుళజాతి సంస్థలకు అప్పగించే ప్రయత్నం చేస్తుందని, ఐక్య ఉద్యమ పోరాటాలతో ప్రజా వ్యతిరేక చట్టాలను వెనక్కి కొట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. ఆదివారం మానకొండూర్ పార్టీ మండల కమిటీ సమావేశంలో జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయం ముకుందలాల్ మిశ్రాభవన్‌లో జరిగింది. ఈ సంధర్బంగా వాసుదేవరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు అనుసరిస్తూ దేశంలో ఆర్థిక అసమానతలు పెంచి పోషిస్తున్నారన్నారు. రైతు వ్యతిరేక, విత్తన, విద్యుత్ చట్టాలు తెచ్చిందని, బహుళజాతి సంస్థలకు ఉపయోగపడే విధంగా చట్టం రూపొందించారన్నారు. రైతాంగాన్ని భూమి నుంచి వేరు చేసే కుయుక్తులు పన్నుతుందన్నారు. కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందన్నారు. పేద,మధ్యతరగతి కష్టజీవులు ఎదురక్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24న కలెక్టరేట్ ముందు పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి చాతరాజు భద్రయ్య, మండల కమిటీ సభ్యులు శ్రీరాముల నారాయణ, ఎండి గోరే మియా, పప్పు నారాయణ తదితరులున్నారు.

## నర్మెట్టకు తరలిన రైతులు


జెండా ఊపి సాగనంపిన మంత్రి అడ్లూరి



**ప్రజాపక్షం/ధర్మపురి :** సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం నర్మెట్ట గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆయిల్ పామ్ కర్మాగార ప్రారంభోత్సవానికి ఆదివారం ధర్మపురి నుండి పలువురు రైతులు తరలివెళ్లారు.రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ బస్సులకు జెండా ఊపి రైతులను సాగనంపారు.ప్రజాపాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతులమీదుగా ఈ ఆయిల్ పామ్ కర్మాగారం ప్రారంభోత్సవం జరిగింది.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి , మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ చిలుముల లావణ్య,వైస్ చైర్మన్ సంగ నర్సింహులు,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సంగనబట్ల దినేష్,తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్‌లో కొనసాగే పరిస్థితి లేదు

* ప్రత్యర్థిపై పోరాటం సహజం, సొంత పార్టీపై పోరాటం చేయటం బాధాకరం
* కాంగ్రెస్ పార్టీని ఫిరాయింపు దారులు నడిపిస్తున్నారు
* నాకు అన్యాయం జరగడంలో ఎమ్మెల్యే పాత్ర సైతం ఉంది
* మీడియా సమావేశంలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి



**ప్రజాపక్షం /జగిత్యాల :** జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్ లో మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జీవన్ రెడ్డి మాట్లాడుతూ 20 మాసాల నుండి జగిత్యాలలో జరుగుతున్న పరిణామాలు కాంగ్రెస్ లో కొనసాగటం ఆలోచించుకునే పరిస్థితి కల్పించాయని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. నా సమస్యకు పరిష్కారం లేకపోవడంతో కాంగ్రెస్ పార్టీలో కొనసాగటం సాధ్యం కాదు అని అభిప్రాయానికి వచ్చాను అని మాజీ మంత్రి అన్నారు. నాలుగు దశాబ్దాల అనుబంధం తెంచుకోవడం బాధాకరం అని మాజీ మంత్రి తెలిపారు.అది నుండి ప్రజల పక్షం నిలబడి అధికార పార్టీలో ఉండి కూడా పోరాటం చేసిన ఉమ్మడి రాష్ట్రంలో వై.ఎస్ సకాలంలో రుణాలు చెల్లించిన వారికి ప్రోత్సాహకంగా రూ.5000 చెల్లిస్తామని హామీ ఇచ్చి జగిత్యాలలో అమలు చేయకపోవడంతో రైతులకు ప్రోత్సాహకం అందించాలని మంత్రిగా ఉండి ధర్నా చేసిన అని మాజీ మంత్రి గుర్తు చేశారు. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలు అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోకుండా చూడాలని వారు సూచించాను. ప్రతిపక్ష పార్టీగా దశాబ్ద కాలంగా పని చేసి, అధికారం వచ్చిన తర్వాత మా హక్కులు కాలారాస్తుంటే ఎంతకాలం భరించాలి అని కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపు దారులు పార్టీనీ నడిపిస్తున్నారు. రాజకీయమే గౌరవం కోసం ఆ గౌరవం లేకపోవడంతో పార్టీలో కొనసాగటం వల్ల ప్రయోజనం ఏమిటి అని మాజీ మంత్రి ప్రశ్నించారు. నా పరిస్థితి వివరించిన తర్వాత శ్రీధర్ బాబు సమాధానం చెప్పలేకపోయారు. జగిత్యాలలో కాంగ్రెస్ ఐక్యంగా నిలపడానికి ఎంతో మంది కార్యకర్తలు, నాయకులు అండగా నిలిచారు. ప్రత్యర్థి పై పోరాటం చేయటం సహజం కానీ సొంత పార్టీ పై పోరాటం చేయటం ఎంత బాధాకరం. కాంగ్రెస్ లో కొనసాగటం సరి కాదని వైదొలగాలని అభిప్రాయానికి వచ్చిన మాజీ మంత్రి అన్నారు. 25 న స్థానిక బండారి గార్డెన్ లో రాజకీయ సహచరులు, అభిమానులు, శ్రేయోభిలాశులతో భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకుంటనాని రాష్ట్ర నాయకత్వం అధిష్ఠానం పై నెట్టివేస్తున్నారు. నాకు అన్యాయం జరగడంలో ఎమ్మెల్యే పాత్ర సైతం ఉంది. రాష్ట్రంలో పార్టీ ఫిరాయింపుల ప్రభావం జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ పై ప్రభావం చూపుతుంది. మంత్రిగా నాకు అర్హత ఉంది కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా మండలిలో ఒంటరి పోరు చేసిన రేవంత్ రెడ్డి భట్టి విక్రమార్కలా నేను నా స్థాయిలో పోరాటం చేసిన నా సంయమనానికి పరిమితి ఉండదా ప్రజాస్వామ్యంలో నా స్వేచకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటున్న అని మాజీ మంత్రి అన్నారు. 25 నా కాంగ్రెస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నాం. జగిత్యాలతో నా అనుబంధం ఎవరు తెంచలేరు నా చివరి శ్వాస వరకు జగిత్యాలతో అనుబంధం కొనసాగుతుందని మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి అన్నారు.

## పంట మార్పిడితోనే రైతుకు మేలు

టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి మద్దూరు మండల మాజీ జెడ్‌పిటిసి గిరి కొండల్‌రెడ్డి



**ప్రజాపక్షం/మద్దూరు/ధూల్మిట్ట :** అన్నదాత సంతోషం కోసం అన్నగా బాధ్యతను తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తీసుకున్నాడని, "రైతును ధైర్యంగా సాగుమడిలో నిలబెట్టేందుకే రైతుభరోసా" కల్పిస్తూ, 70లక్షల మంది రైతన్నలకోసం 9000 కోట్ల రూపాయల రైతు భరోసా నిధులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం శ్రీకారం చుట్టినట్లు టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి ,ఉమ్మడి మద్దూరు మండల మాజీ జెడ్‌పిటిసి గిరి కొండల్‌రెడ్డి, జనగామ జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు,జాలపల్లి గ్రామ సర్పంచ్ చెట్కూరి కమలాకర్ యాదవ్‌లు తెలిపారు. ఉమ్మడి మద్దూరు, ధూల్మిట్ట మండలాల నుండి ధూల్మిట్ట మండలం ప్రక్కన గల నంగునూర్ మండలం దేవుని నర్మెట్ట గ్రామంలో ఏర్పాటు చేసిన రాష్ట్రంలోనే అతిపెద్ద ఆయిల్ పామ్‌ఫ్యాక్టరీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం ప్రారంభిచారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున రైతులతో పాటుగా కాంగ్రెస్ నాయకులతో కలసి టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి , ఉమ్మడి మద్దూరు మండల మాజీ జెడ్‌పిటిసి గిరి కొండల్‌రెడ్డి, జనగామ జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు,జాలపల్లి గ్రామ సర్పంచ్ చెట్కూరి కమలాకర్ యాదవ్‌లు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పంట మార్పిడితోనే రైతులకు మేలు జరుగుతుందని, తెలంగాణలో అత్యధిక శాతం పండించే వరిని కేంద్ర ప్రభుత్వం కొననని తెగేసి చెప్పిందని, ఈ సమయంలో ప్రత్యామ్నాయంగా స్థానిక రైతులకే కాదు తెలంగాణలోని రైతులకు సిరులు కురింపించే అద్భుతమైన పంట ఆయిల్ పామ్ అని, అలాంటి పంటకు దేశంలోనే అత్యాధునిక టెక్నాలజీతో నిర్మించిన ఫ్యాక్టరీ సిద్దిపేట జిల్లాలోని నంగునూర్ మండలం దేవుని నర్మెట ఆయిల్పడ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ అని అన్నారు. 120 మెట్రిక్ టన్నుల వరకు ఆయిల్ గెలలను ప్రెసెస్ చేసే సామర్థ్యం ఉన్న ఈ ఫ్యాక్టరీ ఉత్తర తెలంగాణ వరప్రదాయినిగా మారుతుందని తెలిపారు. ప్రస్థుత కాలంలో రైతులు పంట మార్పడి చేసుకోవాల్సిన ఆవస్యకత ఎంతైన ఉందని, ఎలాంటి చీడ, పీడ బాధలు, అడవి పందులు, కోతులు, వడగండ్ల వానల బాధలు లేకుండా "రైతులకు స్థిరమైన అధిక ఆదాయాన్ని సమకూర్చే ఆయిల్ ఫామ్ తోటల పెంపకానికి రైతులు ముందకు రావాలి"అని గిరి కొండల్‌రెడ్డి, చెట్కూరి కమలాకర్ యాదవ్‌లు అన్నారు. సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం దేవుని నర్మెటలో ఏర్పాటు చేసిన పామ్ ఆయిల్ పరిశ్రమ కేవలం 17 నెలల వ్యవధిలో మొదలు పెట్టి పూర్తిచేసిన ఘనత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంది అన్నారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి మద్దూరు, ధూల్మిట్ట మండలాల రైతులతో పాటుగా, కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్మాముల గ్రామ సర్పంచ్ సుదరగిరి సత్యనారాయణ, ఆయా మండలాల మహిళ సంఘాలు తరలి వెళ్లారు.



# పంత్‌కు ప్రమోషన్..

## మిడిలార్డర్ బ్యాటర్‌గా విధ్వంసక హిట్టర్..!

ఐపిఎల్ పంతొమ్మిదో సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషభ్ పంత్ బ్యాటింగ్ ఆర్డర్ మారనుంది. నాలుగు, ఐదో స్థానాల్లో ఆడిన పంత్ ఈ ఎడిషన్‌లో మూడో స్థానంలో క్రీజులోకి రానున్నాడు. పవర్ ప్లేలో వికెట్ పడితే.. వేగంగా పరుగులు రాబట్టే బాధ్యతను కెప్టెన్‌కు అప్పగించింది లక్నో యాజమాన్యం. నిరుడు నికోలస్ పూరన్ మూడులో ఆడగా.. ఈసారి పంత్ చెలరేగిపోనున్నాడు. పంతొమ్మిదో సీజన్‌లో కొత్త జెర్సీ, కొత్త లోగోతో లక్నో సూపర్ జెయింట్స్ బరిలోకి దిగుతోంది. ఈసారైనా ఐపిఎల్ ట్రోఫీ గెలవాలనే కసితో ఉన్న లక్నో జట్టు అయోధ్య రాముడిని దర్శించుకుంది కూడా. మెగా టోర్నీకి ఆరు రోజులు ఉన్నందున అన్ని విభాగాలను సరి చూసుకుంటున్న రిషభ్ పంత్ సేన బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పు చేయాలనుకుంటోంది. గత సీజన్‌లో మూడో స్థానంలో ఆడిన నికోలస్ పూరన్‌ను మిడిలార్డర్‌లో ఆడించి.. సారథికి ప్రమోషన్ ఇవ్వాలనుకుంటోంది. మెగా వేలంలో రికార్డు ధర(రూ.27 కోట్లు) పలికిన పంత్‌ను జట్టు అవసరం రీత్యా మూడో స్థానంలో ఆడించాలని లక్నో సూపర్ జెయింట్స్ భావిస్తోంది. 'దూకుడుగా ఆడే పంత్ మూడో స్థానానికి పక్కగా సరిపోతాడని మేనేజ్‌మెంట్ సహా అతడు భావిస్తున్నాడు. అందుకని ఈ సీజన్‌లో టాపార్డర్‌లో ఎడెన్ మర్క్‌రమ్, మిచెల్ మార్ష్, రిషభ్ పంత్ ఆడుతారు. మిడిలార్డర్‌లో మాత్రం ఈ షరతులేమీ లేవు. ఆ రోజు ఆటను బట్టి ఎవరిని ముందు పంపాలి? అనేది అప్పటికప్పుడు నిర్ణయిస్తాం' అని లక్నో వర్గాలు తెలిపాయి. గత సీజన్‌లో పంత్‌పై భారీ ఆశలు పెట్టుకున్న లక్నోకు తీవ్ర నిరాశే మిగిలింది. 13 మ్యాచుల్లో మోస్తరుగా ఆడిన అతడు ఆఖరి మ్యాచ్‌లో ఆర్‌సిబిపై సెంచరీ(118 నాటౌట్)తో 269 పరుగులు సాధించాడు. ఐపిఎల్ తొలి మ్యాచ్‌లో ఏప్రిల్ 1న ఢిల్లీ క్యాపిటల్స్‌తో లక్నో తలపడనుంది.

### తొలిసారి ఐపిఎల్‌లో అందరూ

# భారత కెప్టెన్లే

## 19 ఏళ్లలో ఇదే తొలిసారి!

ఐపిఎల్ 2026 సీజన్‌కు రంగం సిద్ధమైంది. మరో 6 రోజుల్లో ఈ మెగా టోర్నీకి తెరలేవనుంది. మార్చి 28(శనివారం)న బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సిబి), సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య తొలి మ్యాచ్ జరగనుంది. ఇప్పటికే 10 ఫ్రాంచైజీలు సన్నాహకాలు మొదలుపెట్టాయి. టైటిలే లక్ష్యంగా వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నాయి.



అయితే ఈసారి ఎన్నడూ లేని విధంగా 10 ఫ్రాంచైజీలు భారత కెప్టెన్లతోనే బరిలోకి దిగుతున్నాయి. ఇలా భారత సారథులతో ఒక సీజన్ ప్రారంభం కావడం 19 ఏళ్ల ఐపిఎల్ చరిత్రలో ఇదే తొలి సారి. పేరుకు ఇండియన్ ప్రిమియర్ లీగ్ అయినా.. విదేశీ ఆటగాళ్ల ఆధిపత్యం ఎంతగా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. తుది జట్టులో ఆడేది నలుగురే అయినా.. విదేశీ ఆటగాళ్ల ప్రభావం ఈ లీగ్‌పై ఎక్కువగానే ఉంటుంది. పలువురు విదేశీ ఆటగాళ్లు కెప్టెన్లుగా కూడా వ్యవహరించారు. కానీ గత 18 సీజన్ నుంచి ఉన్న ఒరవడికి ఈసారి మాత్రం తెరపడింది. తొలిసారి భారత ఆటగాళ్ల సారథ్యంలో 10 ఫ్రాంచైజీలు బరిలోకి దిగుతున్నాయి. పలువురు విదేశీ కెప్టెన్లు గాయపడటంతో ఇది సాధ్యమైంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ మోకాలి గాయంతో ఐపిఎల్ ఆరంభ మ్యాచ్‌లకు దూరమయ్యాడు. దాంతో ఇషాన్ కిషన్‌ను తాత్కాలిక సారథిగా సన్‌రైజర్స్ హైదరాబాద్ నియమించింది. మిగతా 9 జట్లకు భారత ఆటగాళ్లే సారథులుగా ఉండటంతో.. ఈ సీజన్‌లో విదేశీ ఆటగాడు కెప్టెన్‌గా లేకుండా పోయాడు.

### ఐపిఎల్‌కు ఆకాశ్‌దీప్ పూర్తిగా దూరం

**కోల్‌కతా:** ఐపిఎల్ మాజీ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు దెబ్బ మీద దెబ్బ పడుతూనే ఉన్నది. ఇప్పటికే గాయం కారణంగా హర్షిత్ రానా లీగ్‌కు పూర్తిగా దూరం కాగా, తాజా ఈ జాబితాలో యువ పేసర్ ఆకాశ్‌దీప్ చేరాడు. వెన్నెముక గాయంతో ఆకాశ్‌దీప్ ఎనిమిది వారాల పాటు ఆటకు దూరం కానున్నాడు. దీంతో ఈనెల 28 నుంచి మొదలయ్యే ఐపిఎల్‌తో పాటు స్వదేశం వేదికగా ఆఫ్ఘానిస్థాన్‌తో జరిగే ఏకైక టెస్టుకు ఆకాశ్‌దీప్ అందుబాటులో లేకుండా పోయాడు. 'ఆకాశ్‌దీప్ వెన్నెముక కింది భాగంలో గాయమైంది. పూర్తి స్థాయిలో కోలుకునేందుకు ఎనిమిది నుంచి 12 వారాల సమయం పడుతుంది. ఈ కారణంగా ఐపిఎల్‌తో పాటు ఆఫ్ఘానిస్థాన్‌తో టెస్టుకు అతను ఎం పికయ్యే అవకాశాలు లేవు'అని శనివారం బిసిసిఐ వర్గాలు పేర్కొన్నా యి. చివరిసారి రంజీ ట్రోఫీలో జమ్మూ కశ్మీర్‌తో సెమీఫైనల్ మ్యాచ్ ఆడిన ఈ 29 ఏండ్ల యువ పేసర్ అప్పటి నుంచి ఆటకు దూరమయ్యాడు.

### ఆరోగ్యం




# ఊడే పళ్లు... బోసి నవ్వు..

వయసుతోపాటు పళ్లు ఊడడం సహజం. ఈ సమస్య లేని వారు చాలా అరుదు. ఊడే పళ్లు.. బోసి నవ్వే వయసు మీరిన వారి ప్రత్యేకతలు. ఇప్పటికీ మన సమాజంలో చాలామంది నమ్మే విషయం ఒక వయసు రాగానే అందరికీ దంతాలు వూడిపోతాయనీ, నోరు బోసిపోవటం తథ్యమనీ! ఇది చాలా తప్పు. చిన్న వయసు నుంచీ చక్కటి నోటి ఆరోగ్య పద్ధతులు పాటిస్తూ ఉన్న వారికి వృద్ధాప్యంలో పళ్లు వూడిపోవు. నోటిని ఆరోగ్యంగా ఉంచుకోవటం, చక్కటి ఆహారం తీసుకోవటం ఈ రెండూ పాటిస్తే జీవితాంతం మన దంతాలు మనతోనే ఉంటాయని వైద్యరంగం ఎప్పటి నుంచో చెబుతోంది. రోజూ రెండు పూట్లా బ్రషింగ్ చేసుకోవటం, చక్కగా నములుతూ ఆహారం తీసుకోవటం, ఆహారం తీసుకోగానే నోటిని శుభ్రపరచుకోవటం, అప్పుడప్పుడు దంత వైద్యులకు చూపించుకుని దంతాల మీద గార పేరుకుంటే దాన్ని తొగించేందుకు స్కేలింగ్ చేయించుకోవటం.. ఈ జాగ్రత్తలు తీసుకుంటే చాలు! చిగుళ్ల వాపు, చిగుళ్ల నుంచి రక్తం చిమురుస్తుండటం వంటి సమస్యలు తలెత్తితే వెంటనే దంతవైద్యులకు చూపించుకుని చికిత్స తీసుకోవటం చాలా అవసరం. చిగుళ్ల సమస్యలను నిర్లక్ష్యం చేస్తే దంత మూలం బలహీనపడి, దంతాలు వూడిపోయే అవకాశాలు పెరుగుతాయి. దంతాలు వూడితే ఆహారం తీసుకోవటం కష్టంగా తయారై, పోషకాహారం తినలేని పరిస్థితులూ తలెత్తుతాయి. దీనివల్ల మొత్తం ఆరోగ్యమే దెబ్బతింటుంది. అలాగే వయసు పెరిగిన కొద్దీ నోరు పొడిబారటం ఎక్కువ అవుతుంది, దీని వల్ల దంతాల మీద రంధ్రాలు పడటం, చిగుళ్ల బాధల వంటివీ పెరుగుతాయి. కాబట్టి చిగుళ్ల సమస్యలు, దంతాలు పుచ్చిపోవటం, జివ్వుమనటం వంటి సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే వైద్యులను చూపించుకుని, వాటిని చక్కదిద్దుకోవాలి. ఒకవేళ దంతాలు వూడినా ఇప్పుడు సమర్థమైన, శాశ్వతమైన కృత్రిమ దంతాలు (ఇంప్లాంట్స్) అమర్చే అవకాశం ఉంది కాబట్టి వృద్ధాప్యంలో దంత సమస్యలతో ఇబ్బందులు పడాల్సిన అవసరమే లేదని గుర్తించాలి. సాధారణ ఆరోగ్యం బాగుండేందుకు కూడా ఇది కీలకం!

# అరుదైన కేన్సర్‌కు.. విజయవంతమైన చికిత్స

ఒక అరుదైన, తీవ్రమైన కేన్సర్ కారణంగా ఆహారం మింగలేని పరిస్థితికి చేరుకున్న 14 ఏళ్ల బాలికకు వైద్యులు కొత్త జీవితం ఇచ్చారు. ఈ బాలికకు వచ్చిన వ్యాధి సాధారణ కేన్సర్ కాదు. ఇది 'సిగ్నెట్ రింగ్ సెల్ కార్సినోమా' అనే అత్యంత దూకుడుగా వ్యాపించే రకం. ఈ కేన్సర్ ఆమె శరీరంలో ఆహార నాళం (ఈసోఫేగస్), కడుపు కలిసే ప్రాంతమైన గాస్ట్రోఈసోఫేజియల్ జంక్షన్ వద్ద ఏర్పడింది. ఈ భాగం శరీరంలో చాలా కీలకమైనది కాబట్టి, ఇక్కడ కేన్సర్ రావడం చికిత్సను మరింత సంక్లిష్టంగా మారుస్తుంది. ఈ వ్యాధి కారణంగా బాలికకు ఆహారం మింగడం చాలా కష్టమైంది. దీని వల్ల ఆమె దైనందిన జీవితం పూర్తిగా దెబ్బతింది, శరీరానికి అవసరమైన పోషకాలు అందక బలహీనత పెరిగింది. ఈ పరిస్థితిని గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను ఢిల్లీలోని మణిపాల్ హాస్పిటల్ ద్వారక శాఖకు తీసుకువెళ్లారు. అక్కడ వైద్యులు పూర్తి స్థాయి పరీక్షలు నిర్వహించారు. ముఖ్యంగా బయాప్సీ పరీక్ష ద్వారా కేన్సర్ ఉన్నట్టు నిర్ధారించారు. సాధారణంగా కడుపు, ఆహారనాళ కేన్సర్లు ప్రపంచవ్యాప్తంగా ఎక్కువగా కనిపిస్తాయి. కానీ చిన్నపిల్లల్లో ఇవి చాలా అరుదు. ముఖ్యంగా పెద్దవారిలో కనిపించే జీవనశైలి కారణాలు (ఉదాహరణకు ఆహారపు అలవాట్లు, పొగ తాగడం) చిన్నవారిలో ఉండవు. అందువల్ల ఈ వయస్సులో ఇలాంటి కేన్సర్ రావడం వైద్యపరంగా చాలా సవాలుగా భావించబడుతుంది. చికిత్సలో భాగంగా మొదట బాలికకు శస్త్రచికిత్సకు ముందు ఐదు దఫాల కెమోథెరపీ ఇచ్చారు. ఇది ట్యూమర్ పరిమాణాన్ని తగ్గించడానికి, శస్త్రచికిత్సను సులభతరం చేయడానికి ఉపయోగపడుతుంది. ఈ దశలో ఆమె శరీరం చికిత్సకు బాగా స్పందించింది. తర్వాత ఆంకాలజీ నిపుణుల బృందం రోబోటిక్ సర్జరీ నిర్వహించింది. ఈ రోబోటిక్ శస్త్రచికిత్స అత్యంత ఖచ్చితత్వంతో జరుగుతుంది. ఫలితంగా వైద్యులు కేన్సర్ ఉన్న భాగాన్ని, సమీప లింఫ్ నోడ్స్‌ను తొలగిస్తూ, చుట్టూ ఉన్న ముఖ్య అవయవాలను కాపాడగలిగారు. గాస్ట్రోఈసోఫేజియల్ జంక్షన్ వంటి సున్నితమైన ప్రాంతాల్లో ఇది చాలా ముఖ్యమైన అంశం. డాక్టర్లు చెప్పిన ప్రకారం, ఈ ప్రాంతంలో కేన్సర్‌ను పూర్తిగా తొలగించడం కష్టం. ఎందుకంటే అది త్వరగా ఇతర అవయవాలకు వ్యాపించే ప్రమాదం ఉంటుంది. సిగ్నెట్ రింగ్ సెల్ కార్సినోమా చాలా వేగంగా పెరిగే కేన్సర్ రకం. అందువల్ల దీనిని నియంత్రించడం, సరైన విధంగా చికిత్స చేయడం పెద్ద సవాలు. అయినప్పటికీ, ఆధునిక వైద్య సాంకేతికతల వల్ల ఇలాంటి క్లిష్ట కేసుల్లో కూడా మంచి ఫలితాలు సాధ్యమవుతున్నాయి. చికిత్స అనంతరం బాలిక ఆరోగ్యం మెరుగుపడింది. ముఖ్యంగా ఆమె మళ్లీ ఆహారం తినగలగడం ప్రారంభించింది. ఇది ఆమె శారీరక బలాన్ని తిరిగి పొందడానికి సహాయపడింది. వైద్యుల పర్యవేక్షణలో ఆమె కోలుకుంటోంది. ఆమె ధైర్యం కూడా ఈ విజయానికి ఒక ముఖ్య కారణమని వైద్యులు పేర్కొన్నారు. ఈ సంఘటన మనకు రెండు ముఖ్యమైన విషయాలు గుర్తుచేస్తుంది. మొదట, అరుదైన వ్యాధులు అయినప్పటికీ, వాటిని సమయానికి గుర్తిస్తే చికిత్స సాధ్యమే. రెండవది, ఆధునిక వైద్య సాంకేతికతలు, ప్రత్యేకించి రోబోటిక్ సర్జరీలు కష్టమైన పరిస్థితుల్లో కూడా ప్రాణాలను కాపాడగలుకుతాయి. భారత దేశం వైద్య రంగంలో మెరుగైన అభివృద్ధి సాధిస్తున్నదనడాకి ఇది తాజా ఉదాహరణ.



# ఏప్రిల్ 1 నుండి ఇంటింటికీ సిపిఐ

## సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణ శంకర్ పిలుపు

**ప్రజాపక్షం / మంచిర్యాల :** వచ్చే నెల 1 నుండి 10వ తేదీ వరకు నిర్వహించే 'ఇంటింటికీ సిపిఐ' కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల దాసు అధ్యక్షతన జరిగిన సిపిఐ మంచిర్యాల జిల్లా సమితి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కలవేన శంకర్ మాట్లాడుతూ పది రోజుల పాటు నిర్వహించే ఇంటింటి ప్రచారంలో పార్టీ నిధి సేకరణను ముమ్మరం చేయాలని కార్యకర్తలకు సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సత్తా చాటుతామని, ప్రతి నియోజకవర్గంలోనూ అభ్యర్థులను బరిలోకి దించుతామని ధీమా వ్యక్తం చేశా రు. అంతర్జాతీయ పరిణామాలపై స్పందిస్తూ.. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా చేస్తున్న దురాక్రమణ యుద్ధాన్ని తక్షణమే విరమించాలని, ఇతర దేశాలపై ఆంక్షలు విధించే వైఖరిని మానుకోవాలని హితవు పలికారు. సింగరేణి సంస్థ మను గడను కాపాడుకునేందుకు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆధ్వర్యంలో నూతన భూగర్భ గనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. 'సేవ్ సింగరేణి' నినాదంతో ఈ నెల 18న శ్రీరాంపూర్‌లో ప్రారంభమైన జాతా ఈ నెల 30 వరకు గనుల వ్యాప్తంగా కొనసాగుతుందని వివరించారు. ఈ నెల 30న కొత్తగూడెం ప్రధాన కార్యాలయం ముట్టడితో ఉద్యమం పతాక స్థాయికి చేరుతుందని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, రాష్ట్ర సమితి సభ్యులు మిట్టపల్లి వెంకటస్వామి, రేగుంట చంద్రశేఖర్, దాగం మల్లేష్, ఇప్పకాయల లింగయ్య, ముస్కే సమ్మయ్య, చిప్ప నర్సయ్య, అడేపు రాజ మొగిలి, కామెర దుర్గా రాజు, మిట్టపల్లి పాల్, మిర్యాల రాజేశ్వర్ రావు, బొంతల లక్ష్మి నారాయణ, కొండు బానేష్ పాల్గొన్నారు.



# రాజ్యాంగం కల్పించిన హక్కుల సాధనకు పోరాడాలి

## సిపిఐ మాజీ ఎమ్మెల్యే పోతరాజు సారయ్య

**ప్రజాపక్షం/హనుమకొండ :** భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు, అవకాశాలు కల్పించినప్పటికీ, వాటి అమలులో ఇంకా అనేక లోపాలు ఉన్నాయని మాజీ ఎమ్మెల్యే పోతరాజు సారయ్య అన్నారు. దళితులు, బలహీన వర్గాలు తమకు రాజ్యాంగం కల్పించిన హక్కులను సాధించుకోవాలంటే ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం డిహెచ్‌పిఎస్ జిల్లా మహాసభల ప్రారంభం సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ జెండాను ఆవిష్కరించారు. దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్ ) హనుమకొండ జిల్లా 2వ మహాసభలు నిమ్మల మనోహర్ అధ్యక్షతన ఆదివారం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే పోతరాజు సారయ్య హాజరై మాట్లాడుతూ సామాజిక న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ వంటి విలువలు కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా, ప్రతి వ్యక్తి జీవితంలో అమలవ్వాలని ఆయన పేర్కొన్నారు. కానీ వాస్తవ పరిస్థితుల్లో దళితులపై వివక్ష, దాడులు, భూసంబంధ సమస్యలు ఇంకా కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రభుత్వాలు దళిత సంక్షేమానికి కేటాయించిన నిధులను పూర్తిగా వినియోగించి, విద్య, ఉపాధి, భూహక్కులు వంటి రంగాల్లో దళితుల అభివృద్ధికి కట్టుబడి పనిచేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీస్ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని, బాధితులకు తక్షణ న్యాయం కల్పించాలని కోరారు. దళిత యువత విద్యలో ముందుకు రావడం, చైతన్యంతో హక్కుల కోసం పోరాడడం అవసరమని సారయ్య సూచించారు. సమాజంలో సమానత్వం సాధించాలంటే ప్రతి ఒక్కరూ రాజ్యాంగ విలువలను గౌరవించాలని పిలుపునిచ్చారు. డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరుపాక అనిల్ కుమార్ మాట్లాడుతూ దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర రెండవ మహాసభలు ఏప్రిల్ 17,18 వరంగల్ నగరంలో జరగనున్నాయని ఆయన అన్నారు. ఈ మహాసభలకు 33 జిల్లాల నుండి 500 ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ మహాసభల్లో రాష్ట్రవ్యాప్తంగా దళితులు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల చర్చించి భవిష్యత్తు కార్యచరణ రూపొందించుకుంటామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొట్టేపాక రవి, నాయకులు రెంటాల దేవా, రాజారపు రత్నం, సందీప, భరత్ తదితరులు పాల్గొన్నారు.అనంతరం డిహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులుగా రాజారపు రత్నం,జిల్లా ప్రధాన కార్యదర్శిగా నిమ్మల మనోహర్ ను ఎన్నుకున్నారు.



### బిజెపి ప్రభుత్వ అండతో పేట్రేగిపోతున్న

# మతోన్మాద శక్తులు

## సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** భారతదేశంలో రోజురోజుకు మతోన్మాద శక్తులు బిజెపి ప్రభుత్వ అండతో పెట్రాకి పోతున్నాయని, ఇప్పటికైనా పద్ధతి మార్చుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని సిపిఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం హెచ్చరించారు.ఆదివారం దళిత హక్కుల పోరాట సమితి డిహెచ్‌పిఎస్ పెద్దపల్లి జిల్లా రెండవ మహాసభ జిల్లా కేంద్రంలో కందుకూరి రాజారత్నం అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, కవ్వంపల్లి స్వామి, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి లక్ష్మ ణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీనియర్ నాయకులు స్వామి పతాక ఆవిష్కరణ చేసిన అనంతరం ముఖ్య అతిథులు సదానందం,లక్ష్మ ణ్‌లు దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) జిల్లా మహాసభలను ఉద్దేశించి మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రకారం రిజర్వేషన్లు కల్పించవలసిన ప్రభుత్వాలు ప్రైవేటు రంగాలలో రిజర్వేషన్లు కల్పించుటకు తగిన చర్యలు తీసుకోవడం లేదని, రిజర్వేషన్‌లో ఉనికికే ప్రమాదం పొంచి ఉందనీ, రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలు దళితుల అభివృద్ధికి చట్టబద్ధంగా కేటాయించవలసిన 20 శాతం నిధులను ఏనాడు కేటాయించలేదనీ, కేటాయించిన కొద్దిపాటి నిధులను కూడా దళితుల అభివృద్ధికి ఉపయోగించకుండా ఇతర పథకాలకు దారి మళ్లించుతున్నారన్నారు. స్వాతంత్రం వచ్చి దాదాపు 76 సంవత్సరాల స్వతంత్ర పరిపాలనలో దళితులకు ఒరిగిందేమీ లేదని, నేటికీ దళితులపై జరుగుతున్నటువంటి దాడులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అరికట్ట లేక పోతున్నారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులపై స్టేషన్ బేలు ఇవ్వకుండా ఈ కేసులను చట్ట పరంగా కఠినంగా శిక్షలు విధిస్తే గాని, దళితులపై జరుగుతున్న దాడులు పునరావృతం కాకుండా పోతాయని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడు సంవత్సరాలు గడుస్తున్నా అప్పటికి మేనిఫెస్టోలో పెట్టినటువంటి అంబేద్కర్ హస్తం కింద దళితులకు రూ.12 లక్షలు నేటికీ ఇవ్వలేదనీ ,అలాగే ఇందిరమ్మ ఇళ్లలో ఇండ్లు లేని పేదలు దళితులే దాదాపు నూటికి 80 శాతం ఉన్నారనీ, ఇందిరమ్మ ఇండ్లలో మొదటి ప్రాధాన్యత దళితులకు ఇవ్వాలన్నారు. వరంగల్‌లో ఏప్రిల్ 17,18, తేదీలలో జరిగే దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర రెండవ మ హాసభలను దళితులు మేధావులు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆరెపల్లి మానస్ కుమా ర్, కల్లేపల్లి నవీన్, తాళ్లపల్లి సురేందర్, సతీష్, తదితరులు భారీగా హాజరయ్యారు.



### గుడిసె వాసులకు ఇండ్ల పట్టాల

# సాధనకు 'చలో హైదరాబాద్'

## సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి



**ప్రజాపక్షం/హసన్ పర్తి :** దేశానికి స్వాతంత్రం వచ్చి 79 సంవత్సరాలు గడిచినప్పటికీ పేదలు మరింత పేదలుగా, ధనవంతులు మరింత ధనవంతులుగా మారినారు తప్ప నేటికీ స్వరాజ్య ఫలాలు దళితులకు, బహుజనులకు, కష్టజీవులైన కార్మిక వర్గానికి స్వతంత్ర ఫలాలు దక్కలేదని భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం హసన్ పర్తి మండలం వంగపాడు గ్రామంలో దోమ మధున అధ్యక్షతన జరిగిన సమావేశమునకు ముఖ్య అతిథులుగా హాజరైన నేదునూరి జ్యోతి మాట్లాడుతూ బహుజను లు దళితులు సెంటు భూమిలేని నిరుపేదలకు గుడిసెలు వేసుకున్న స్థలంలోనే ఇండ్ల పట్టాలు ఇచ్చి ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేయ డం జరిగింది. 6 గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చి అవి వారంటీలు మాత్రమే వాటి గడువు తీరిపోయిందనే విధానంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో నేటికీ కోటి యాభై లక్షల మందికి ఇంటి స్థలం లేక నివాసాలు లేక ఇంటి కిరాయిలు కట్టలేక కుటుంబాలను పోషించుకోలేక అనేక కష్టనష్టాలు పడుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. హైదరాబాదులోని ఇందిరా పార్కు వద్ద మేడ్చల్, రంగారెడ్డి, వరంగల్, హనుమకొండ, భూపాలపల్లి, ఖమ్మం తదితర జిల్లాలలో గుడిసెలు వేసుకొని సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఇంటి పట్టా నివాస స్థలం కేటాయించాలని ధర్నా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ జిల్లాలలో పేదలు, దళితులు, మురికి కుంటల్లో అనారోగ్యానికి గురవుతూ 15 సంవత్సరాలుగా నివాస స్థలాలకై నిరంతరం ఎర్రజెండా సిపిఐ ఆధ్వర్యంలో పోరాడుతున్నారని, వీరందరికీ పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ చలో ఇందిరా పార్క్ మహాధర్నా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ బహిరంగ యుద్ధానికి గుడిసె వాసులు, దళితులు, బహుజనులు నిరుపేద కష్టజీవులు హాజరై జయప్రదం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ మహా ధర్నాకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి తదితరులు పాల్గొననున్నారని తెలిపారు. ఈ సమావేశంలో మోతె లింగారెడ్డి దొమ్మాట ప్రవీణ్ కుమార్, నేదునూరి రాజమౌళి, మాలోతు శంకర్, ఎల్లయ్య, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# యువత భగత్ సింగ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి : యానాల

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** నేటి యువత భగత్ సింగ్ ఆశయాలను ముందుకు తీసుకుపోవాల్సిన బాధ్యతను భుజానికెత్తుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి పిలుపునిచ్చారు. యాదగిరిగుట్ట పట్టణంలోని న్యూ గుండ్లపల్లి గ్రామంలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల 95వ వర్ధంతిని పురస్కరించుకొని రెండు రోజుల పాటు నిర్వహించిన వాలిబాల్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ముగింపు వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొని బహుమతులు ప్రధానం చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. కేవలం 23 ఏళ్ల ప్రాయంలోనే దేశ స్వాతంత్రం కోసం బ్రిటిష్ సామ్రాజ్యవాదులను ఎదిరించి, చిరునవ్వుతో ఉరికొయ్యను ముద్దాడిన వీరుల త్యాగాలు వెలకట్టలేనివని కొనియాడారు. నేటి యువత గంజాయి, మాదక ద్రవ్యాల వంటి చెడు అలవాట్లకు బానిసలై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని దామోదర్ రెడ్డి హితవు పలికారు. భగత్ సింగ్ వంటి పోరాట యోధుల స్ఫూర్తితో ప్రజాసేవకు అంకితం కావాలని కోరారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోదా శ్రీరాములు మాట్లాడుతూ స్టాప్ డ్రగ్స్ స్టార్ట్ స్పోర్ట్స్ అనే నినాదంతో అఖిల భారత యువజన సమైక్య (ఎఐవైఎఫ్) యువతను క్రీడల వైపు మళ్లించేందుకు కృషి చేస్తోందని తెలిపారు. యువత ఉన్నత చదువులు చదివి, క్రీడల్లో రాణించి దేశ భవిష్యత్తులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పోటీల అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి మల్లాపురం టీం(దాత: యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు చుక్కల సత్యం), న్యూ గుండ్లపల్లి టీం (దాత: బైరగాని జంగయ్య). శెట్టి నరసింహ యాదవ్ రాయగిరి



పొందు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, కొల్లూరు రాజయ్య, బండి జంగమ్మ, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పెరబోయిన మహేందర్, పట్టణ కార్యదర్శి బబ్బురి శ్రీధర్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లంకి మహేష్, మాజీ కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్డి నాయకులను అరెస్టు చేయడం అన్యాయం: ఆవునూరి మధు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** భూదాన్ బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ ప్రశాంతంగా బంద్ నిర్వహిస్తున్న సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులను అరెస్టు చేయడం సిగ్గుచేటని సిపిఐ(ఎంఎల్) ఎన్డి రాష్ట్ర కార్య వర్గ సభ్యుడు ఆవునూరి మధు, జిల్లా కార్యదర్శి బండారు ఐలయ్య లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెలుగుమట్ల బాధితులకు న్యాయం చేయాలని, ఇండ్లు కూల్చిన చోటే ప్రతి ఒక్కరికి ఇండ్లు కట్టించి ఇవ్వాలని, నష్ట పరిహారం చెల్లించాలని, ఆదివారం ఖమ్మం నగర బంద్‌కు సిపిఐ (ఎంఎల్)ఎన్డి ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పిలుపునివ్వడం జరిగింది. అన్ని వర్గాలు స్వచ్ఛందంగా సహకరిస్తూ బంద్ పాటిస్తున్న సందర్భంలో బంద్‌ను విఫలం చేయడానికి పోలీసులు ఎన్డి నాయకులను, కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. ఎటువంటి హెచ్చరికలు లేకుండా భూదాన్ భూముల్లో ఇండ్లు కూలగొట్టారని రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవ్వడంతో ప్రభుత్వం ఇండ్లు కూల్చిన చోటే ఇండ్ల స్థలాలు ప్రకటించిందన్నారు. కాని అర్హులైన నిర్వాసితులకు ఇండ్ల స్థలాలు ఇవ్వకుండా తమ అనుచరులకు ఇండ్ల స్థలాలు ఇచ్చారన్నారు. హైకోర్టు ప్రభుత్వ తీరును కూడా తప్పుబడుతూ స్టేటస్ కో ఇచ్చిందన్నారు. అర్హులైన వారందరికి ఇండ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వానికి కోర్టు తెలిపిందని కాని రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. ప్రభుత్వం తక్షణమే ఇండ్లు మంజూరు చేసి నష్టపరిహారం చెల్లించాలని లేని ఎడల ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మి నారాయణ, వై. ప్రకాష్, కాశీం, రమేష్, మోహన్‌రావు, గిరి, సుదర్శన్, మస్తాన్, ఉమా శంకర్, జాన్‌రెడ్డి, గాంధీ, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు వినతుల స్వీకరణ

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాలో అధికారులు నేడు ప్రజల నుండి వినతులు స్వకరించనున్నారు. ఐడిఒసి కార్యాలయంలో కలెక్టర్ అంకిత్ ప్రజావాణి ద్వారా దరఖాస్తులు స్వీకరించనుండగా, భద్రాచలం ఐటిడిఎ కార్యాలయంలో ఐటిడిఎ పిఒ రాహుల్ గిరిజనుల నుండి గిరిజనదర్బార్ పేరిట వినతులు అందుకోనున్నారు. భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ దనియాల వెంకటేశ్వర్లు ప్రజల నుండి విన్నపాలు స్వీకరించనున్నారు.

## విద్యారంగానికి ప్రభుత్వం మొండి చెయ్యి

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 8.22శాతం నిధులు కేటాయించి, ప్రభుత్వ విద్యారంగానికి మొండి చెయ్యి చూపించిందని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు బురా మనోజ్ ఆదివారం ఓ ప్రకటలో విమర్శించాడు. ఇది ఖచ్చితంగా విద్యార్థి వ్యతిరేక విధానానికి నిదర్శనమేనని అవేదన వ్యక్తం చేశాడు. ఎన్నికల మేనిఫెస్టోలో 15శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చి, ప్రభుత్వం ఏర్పాటు తర్వాత అరకొర నిధులతో సరిపెట్టిందని రోపించాడు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు, రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశాడు. విద్యారంగానికి కనీసం 30శాతం అధిక నిధులు కేటాయించకపోతే ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించాడు.

## లెనిన్ శ్రీనివాస్‌కు స్వర్ణ నంది పురస్కారం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రముఖ కవి లెనిన్ శ్రీనివాస్‌కు స్వర్ణ నంది ఉగాది పురస్కారం అందజేశారు. ఆదివారం ఖమ్మంలోని రామగిరి ఫంక్షన్ హాల్ నందు మొగిలి, నాగసాయి ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది స్వర్ణ నంది అవార్డుల ప్రదానోత్సవంలో వికాస వేదిక సాహిత్య సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రజాకవి లెనిన్ శ్రీనివాస్ సాహిత్య రంగంలో చేస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా స్వర్ణ నంది ఉగాది పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా మొగిలి గుణకర్, నాగసాయిలు మాట్లాడుతూ ఖమ్మం కేంద్రంగా అనేక మంది వర్ధమాన కవులను ప్రోత్సహిస్తూ మంచి పుస్తకాలను ప్రచురిస్తూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఎన్నో సత్కారాలు, పురస్కారాలు, ప్రశంసలు పొందిన లెనిన్ శ్రీనివాస్‌ను సత్కరించి అవార్డు ప్రదానం చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా లెనిన్ శ్రీనివాస్‌ను నామవరపు కాంతేశ్వరరావు, కర్తనందం, కర్నాటి శంకర్‌రావు, ప్రసాద రావు, తులసీదాస్ లు సత్కరించారు.

## పార్టీ జెండా మోసిన వారిని కాంగ్రెస్ గుర్తించింది: బానోతు రామ్మూర్తి



**ప్రజాపక్షం/కారేపల్లి:** కాంగ్రెస్ పార్టీ జెండా మోసిన వారిని గుర్తించి పార్టీ పదవులు ఇచ్చి గౌరవిస్తుందని కాంగ్రెస్ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి బానోతు రామ్మూర్తి తెలిపారు. మూడు దశాబ్దాలుగా పార్టీకి చేసిన సేవలను గుర్తించి తనకు జిల్లా ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించడం ఆనందంగా ఉందన్నారు. ఈసందర్భంగా ఆదివారం ఆయన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అధిష్ఠానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుని పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం కోసం పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. గత ప్రభుత్వాలు చేయని అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం చేసి చూపిస్తుందని తెలిపారు. వైరా నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేసే దిశగా పని చేస్తామని బానోత్ రామ్మూర్తి పేర్కొన్నారు.

# అధికారుల ఆదేశాలు బేఖాతర్

### యథేచ్ఛగా సెల్లార్ నిర్మాణం

**ప్రజాపక్షం/పాల్వంచ :** పాల్వంచ పట్టణంలో మునిసిపల్ అధికారుల ఆదేశాలు అమలునోచుకోవటం లేదని తెలుస్తోంది. సెల్లార్ నిర్మాణ పనులు నిలిపివేసి మట్టితో నింపాలని అధికారుల ఆదేశాలను బేఖాతర్ చేస్తూ యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. పట్టణ నటరాజ్ సెంటర్‌లో బడా బియ్యం వ్యాపారి కిన్నెరసాని రోడ్‌లో భవన నిర్మాణానికి అధికారుల నుండి అనుమతులు తీసుకొన్నారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులకు ఎగనామం పెడుతూ గోరంత అనుమతులతో కొండంత నిర్మాణాల మాదిరిగా గుట్టుచప్పుడు కాకుండా సెల్లార్ నిర్మాణాన్ని చేపట్టాడు. దీనిపై వచ్చిన ఫిర్యాదుల మేరకు సంబంధిత అధికారులు భవన నిర్మాణ పనులను పరిశీలించారు. అనుమతులు లేకుండా చేపట్టిన పనులు నిలిపివేసి సెల్లార్ స్థలాన్ని మట్టితో నింపి మూసి వేయాలని ఆదేశించారు. ఇంతవరకు బాగానే ఉన్నా అనంతరం జరిగిన పరిణామాలతో చుట్టూ ఇటుకలతో తాత్కాలికంగా మూసివేసినట్లుగా నటించిన సదరు భవన యాజమాని అధికారులను, ప్రజలను మభ్యపెట్టారు. భవన నిర్మాణం పూర్తి అయిన తరువాత మూసి వేసిన సెల్లార్‌కు ఆనుకొని ఉన్న గల్లీ రోడ్‌కు ఎవరికి అనుమానం రాకుండా ఇటుకలు తొలగించి యథాతథంగా అధికారుల ఆదేశాలను తుంగలో తొక్కుతూ నిర్మాణం పూర్తి చేశారు.

ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవటం విస్మయానికి గురిచేస్తున్నది. వ్యాపారికి మునిసిపల్ చట్టాలు వర్తించవా? అంటు పలువురు ప్రశ్నిస్తున్నారు. నిత్యం కళ్లెదుటనే జరుగుతున్న పనుల పట్ల ఉదాసీనత వహిస్తున్న అధికారుల తీరుపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పెద్ద ఎత్తున మామూళ్లు పుచ్చుకొని వదిలేశారనే ఆరోపణలు పట్టణ వ్యాప్తంగా గుప్పుమంటున్నాయి. అధికారుల తీరుతో పేదోళ్లకు మాత్రమే చట్టాలు, పెద్దోళ్లకు వర్తించవా అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి అక్రమంగా, అనుమతులు లేకుండా చేపట్టిన భవన సెల్లార్ నిర్మాణంపై తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



**టిపిఒ వివరణ :** ఈ విషయంపై టిపిఒ నవీన్‌కుమార్ వివరణ కోరగా ఆదివారం సెలవు కావటంతో సోమవారం హౌసింగ్ ఇన్‌స్పెక్టర్‌ను పంపించి విచారణ చేయిస్తామని చెప్పారు.

## ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీకి అరకొర నిధులే

### యూనివర్సిటీ అభివృద్ధికి ప్రభుత్వం చొరవచూపాలి

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఇటీవల ప్రభుత్వం ఏర్పాటు చేసిన డాక్టర్ మన్మోహన్ సింగ్ యర్త్ యూనివర్సిటీకి ప్రభుత్వం బడ్జెట్‌లో మొండి చెయ్యి చూపిందని, కేవలం రూ.45 కోట్లను మాత్రమే కేటాయించి చేతులు దులుపుకుందని మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు యాకూబ్ పాషా అన్నారు. ఈమేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన యూనివర్సిటీ లక్ష్యాల దిశగా ముందుకు సాగడంలో విఫలమవుతోందన్నారు. ప్రస్తుతం కేటాయించిన నిధులు అరకొరే అని, రూ.45 కోట్లతో మౌళిక సదుపాయాల కల్పన, అభివృద్ధి ముందుకు సాగదన్నారు. బోధన సిబ్బంది నియామకాలు లేకపోవడం, ప్రవేశాలపై విద్యార్థులు ఆసక్తి చూపక పోవడంతో యూనివర్సిటీ భవిష్యత్‌పై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయన్నారు. ప్రత్యేక బోధనా సిబ్బంది ప్రక్రియ పూర్తిగా నిలిచిపోవడం వల్ల విద్యా ప్రమాణాలపై ప్రభావం పడుతోందన్నారు. యూనివర్సిటీ మొత్తానికి 45 మంది సిబ్బంది అవసరం కాగా, నేటివరకు ఒక్కరిని కూడా నియమించక పోవడం విస్మయాన్ని కలిగిస్తోందన్నారు. యూనివర్సిటీ వర్గాలు రూ.300 కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపగా కేవలం రూ.45 కోట్లు మాత్రమే మంజూరు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం దృష్టి సారించి డా. మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీకి ఇతర యూనివర్సిటీలకు నిధులు మంజూరు చేసినట్లుగానే కేటాయింపులు చేయాలని కోరారు.

## సేంద్రియ సాగుతో అధిక దిగుబడులు

### జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య




**ప్రజాపక్షం/చింతకాని :** సేంద్రియ సాగుతో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య రైతులకు సూచించారు. ఆదివారం చింతకాని మండలం నాగులవంచ రైతు వేదిక నందు ఐటిసి ఎంఎస్‌కే మరియు ఆదర్శ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జెడిఎ పుల్లయ్య మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. రైతు భరోసా కింద ఖమ్మం జిల్లాలో ఒక ఎకరం ఉన్న రైతులందరికీ సోమవారం బ్యాంకు ఖాతాలో రైతు భరోసా నిధులను ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. జిల్లాలో యూరియా, కాంప్లెక్స్ ఎరువు లు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు, ఆత్మా కమిటీ డైరెక్టర్ గోవిందరావు, ఉద్యానవనాధికారి విష్ణు, ఎఒ సోములపల్లి మానస, ఎఇఒ కల్యాణి , ఆదర్శ సంస్థ డైరెక్టర్ రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదంలో నష్టపోయిన..

# మిర్చి రైతులకు న్యాయం చేస్తాం

### డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క

**ప్రజాపక్షం/మధిర :** అగ్నిప్రమాదంలో నష్టపోయిన రైతులకు న్యాయం చేస్తామని బీమా ప్రకారం సొమ్ము వచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశాలు జారీ చేశారు. ఆదివారం మధిర నియోజకవర్గంలో సుడిగాలిలా పర్యటించారు. అందులో భాగంగా ఆత్కూరులోని అగ్ని ప్రమాదానికి గురైన శ్రీ సాయి బాలాజీ కోల్డ్ స్టోరేజీని పరిశీలించారు. మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు అధికారులు చేపడుతున్న చర్యలను పరిశీలించారు. అగ్నిప్రమాదానికి కారణాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం



కోల్డ్ స్టోరేజీలో నష్టపోయిన మిర్చి రైతులతో భట్టి విక్రమార్క మాట్లాడుతూ శీతల గిడ్డంగిలో రికార్డు ప్రకారం ఉన్న మిర్చి సంబంధిత రైతులకు నిబంధలన ప్రకారం నష్టపరిహారం బీమా ద్వారా అందించాలని అధికారులను ఆదేశించారు. మధిర మార్కెట్‌లో కూడా మిర్చి అమ్మకాలు, కొనుగోలు ఖమ్మం మాదిరిగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. అగ్ని ప్రమాదం జరిగిన ప్రాంతంలో మళ్లీ మంటలు చెలరేగకుండా ఉండేందుకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, మాజీ డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఖమ్మం మాజీ నగర కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ జావేద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమికి పట్టాదార్ పాస్ బుక్?

### పథకాల లబ్ధి కూడా పొందినట్లు ఆరోపణలు
### అబ్బుగూడెం ఉప సర్పంచ్‌పై ఫిర్యాదులు
### సర్కార్ భూమిని కాపాడాలని గ్రామస్తుల విజ్ఞప్తి



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి :** మండల పరిధిలోని అబ్బుగూడెం గ్రామంలో ప్రభుత్వ భూములను ఒక ప్రజాప్రతినిధి ఆక్రమించి వాటికి పట్టాదార్ పాస్ పుస్తకాలు పొందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ వ్యవహారం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే అబ్బుగూడెం గ్రామానికి చెందిన ఒక ప్రజాప్రతినిధిని ప్రజలు గ్రామాభివృద్ధి కోసం గతంలో నామినేటెడ్ ఉప సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. అనంతరం ఇటీవల జరిగిన పంచాయితీ ఎన్నికల్లో వార్డు సభ్యుడిగా గెలిచి మళ్లీ ఉప సర్పంచ్‌గా కొనసాగుతున్నాడు. అయితే ఇదే సమయంలో ప్రభుత్వ భూములకు పట్టాదార్ పాస్ బుక్స్ తీసుకున్నాడనే ఆరోపణలు గ్రామ ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. అన్నపురెడ్డిపల్లి మండలం పూర్తిగా ఏజెన్సీ ప్రాంతం కావడంతో ఇక్కడ 1/70 చట్టం అమల్లో ఉంది. ఈ చట్టం ప్రకారం పట్టాదార్ పాస్‌బుక్స్ మంజూరు కావాలంటే ఆ భూమి 1969 నుండి పహానీలో ఉండి అదే వ్యక్తి అనుభవంలో కొనసాగుతూ ఉండాలి, కానీ ఈ నిబంధనలను పక్కనబెట్టి, అధికారులను ప్రలోభాలకు గురి చేసి సుమారు 8 ఎకరాల ప్రభుత్వ భూమిని భార్యాభర్తల పేర్లపై పట్టాదార్ పాస్ బుక్స్ చేయించుకున్నారని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇక్కడితో ఆగకుండా ఆ పట్టాదార్ పాస్ బుక్స్ ఆధారంగా ప్రభుత్వం అందిస్తున్న రైతుబంధు పథకం కింద లక్షల రూపాయలు పొందడం జరిగినట్లు సమాచారం. అంతే కాకుండా ఆ భూములపై వ్యవసాయ రుణాలు( క్రాప్ లోన్లు)తీసుకుని, అనంతరం ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ ప్రయోజనాలు కూడా పొందినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అదే విధంగా ఆ భూములపై విద్యుత్ కనెక్షన్లు తీసుకుని ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యుత్‌ను వినియోగిస్తున్నారని, ఈ విధంగా ఒక వైపు అధికారులను, మరో వైపు ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నారని గ్రామ ప్రజలు మండిపడుతున్నారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే తహసీల్దార్ కార్యాలయం, ఆర్డీఓ కార్యాలయాలకు ఫిర్యాదులు చేసినప్పటికీ సంబంధిత అధికారులు కాలయాపన చేస్తూ స్పందించడం లేదని ఫిర్యాదుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మండల అధికారులు మొద్దు నిద్ర మేల్కొని ప్రభుత్వ భూములను కాపాడాలని, తక్షణమే ఆ పట్టాదార్ పాస్ బుక్స్ రద్దు చేసి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని, అలాగే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12వేల హామీ అమలేదీ?

### ఎఐపికెఎంఎస్ జిల్లా కార్యదర్శి జాటోత్ కృష్ణ

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా ఏడాదికి 12,000 రూపాయలు ఇస్తానని హామీ ఇచ్చారు. కానీ హామీ ఇంతవరకు అమలు కాలేదు. రాష్ట్రంలో భూమిలేని వ్యవసాయ కూలీలను 5,19,191 మందిని మాత్రమే ప్రభుత్వం గుర్తించింది. వీరందరికీ రూ.31 కోట్లు ఖర్చవుతుందని కానీ ఇచ్చింది. 83,887 మంది కూలీలకు 53 కోట్ల రూపాయలు మాత్రమే చెల్లించిందని అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం (ఎఐపికెఎంఎస్) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి జాటోత్ కృష్ణ అన్నారు. 24, 25 తేదీలలో కామారెడ్డిలో జరుగు ఎఐపికెఎంఎస్ తెలంగాణ ప్రథమ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ జూలూరుపాడు మండలంలో ఎం. రాజశేఖర్ అధ్యక్షతన ఉపాధి హామీ కూలీల మీటింగ్ జరిగింది. అనంతరం సంఘం రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జాటోతు కృష్ణ పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో ఒక్క ఎకరా లోపు భూమి ఉన్నవారు 24.22 లక్షల మంది, రెండు ఎకరాల వరకు ఉన్న 17.02 లక్షల మంది నిరుపేదలు ఉన్నారని మీరందరికి తమ భూమిలో ఏడాదంతా పని దొరకడం లేదని వీరికి బతకటానికి వేరే కూలి పనులపై ఆధారపడుతున్నారని కనీస బతుకును కల్పించడం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత అని, నేటి ధరల ప్రకారం ఒక కుటుంబం బతకడానికి కనీసం నెలకు 26 వేల రూపాయలు కావాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎదులాపురం గోపాలరావు, బానోతు ధర్మ, ఎం రాజశేఖర్, బైరు వెంకన్న, జమలయ్య, మాణిక్యమ్మ, పాపక్క, కోటమ్మ, వీరన్న, వెంకటమ్మ, బొజ్జయ్య, దశరథ్ తదితర ఉపాధి మహిళలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలం ఆక్రమణపై.. విచారణకు ఆదేశం

**ప్రజాపక్షం/వైరా :** వైరా మునిసిపాలిటీలోని వ్యవసాయ కార్యాలయం సమీపంలో అక్రమంగా 60 గజాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ఆ స్థలాన్ని ప్రభుత్వ అధికారు అండతో ఎటువంటి ఇళ్లు లేకపోయినా ఇంటి నెంబర్ సృష్టించిన మున్సిపల్ కార్మికుడు తమ సొంత స్థలంగా రిజిస్ట్రేషన్ విషయమై మునిసిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ స్పందించి స్థలం ఆక్రమణ ఇంటి నెంబర్ కేటాయింపుపై విచారణకు ఆదేశించారు. మునిసిపల్ కమిషనర్‌కు ఆదివారం ఆమె ఒక లేఖను పంపించారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రకళ భూ ఆక్రమణపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి వివరాలు అందించాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటే సహించేది లేదని చట్టపరంగా చర్యలు తప్పవని ఆమె అన్నారు.

# విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

### మధిర ప్రభుత్వ ఆసుపత్రిని కలెక్టర్ తనిఖీ
### విధులకు హాజరుకాని సిబ్బందికి షోకాజ్ నోటీసులు

**ప్రజాపక్షం/ మధిర :** విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఆదివారం మధిర ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని క్యాజువాలిటీ, ఎల్‌డిఆర్ఎం రూము, డయాలసిస్ సెంటర్, లేబర్ రూము, ఎమర్జెన్సీ వార్డ్, రేడియాలజీ బ్లాక్, ఓపి రూము లను పరిశీలిస్తూ రోగులతో మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది పనితీరు, రోజు వారి కేసుల వివరాలు, ముఖ్యమైన రిజిస్టర్లు, నెలవారి నివేదికలను, ఔషధాల లభ్యత, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టిసారించి, సేవలు మరింత నాణ్యంగా అందేలా వైద్య అధికారులు తగు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డ్యూటీలో లేని వైద్యులు, ఇతర సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఆసుపత్రి వైద్యులు హాజరు సంబంధించి రెగ్యులర్‌గా రిపోర్ట్ తనకు అందించాలని కలెక్టర్ సూచించారు. ఆసుపత్రికి రెగ్యులర్‌గా వస్తున్న ఓపి వివరాలను కలెక్టర్ పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది సకాలంలో అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య చికిత్స అందిస్తే ఎక్కువ మంది రోగులు ప్రభుత్వ ఆసుపత్రికి వస్తారని కలెక్టర్ తెలిపారు. ఆసుపత్రిలో రోగులకు రెగ్యులర్‌గా అందుతున్న భోజనం నాణ్యత అంశాలను రోగులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట మధిర తహసీల్దార్ రాంబాబు, సంబంధిత అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఉలిక్కిపడ్డ మట్టి మాఫియా...

### అక్రమ తవ్వకాలపై కలెక్టర్ ఆరా
### లారీల అనుమతి పత్రాలపై ఆర్టీఏ ఏజెంట్లతో సంప్రదింపులు
### తీవ్ర చర్చనీయాంశమైన 'ప్రజాపక్షం' కథనం

ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మం రూరల్ మండలంలో కొత్తరూపం దాల్చిన మట్టి దందా పై నయా మట్టి దందా శీర్షికన 'ప్రజాపక్షం' పతాక స్థాయిలో ప్రచురించిన కథనం మట్టి మాఫియాను ఉలిక్కిపడేలా చేసింది. కథనం వెలువడిన వెంటనే అక్రమ తవ్వకాలలో నిమగ్నమైన వ్యాపారులు అప్రమత్తతో కార్యకలాపాలను ఒక్కసారిగా నిలిపివేయడం విశేషం. ఎక్కడి దొంగలు అక్కడే గప్‌చుప్ అన్నట్లు, మట్టి రవాణాకు ఉపయోగిస్తున్న లారీలను తమ డెన్నులతో పాటు కొన్ని పెట్రోల్‌బంక్‌ల వద్ద దాచిపెట్టినట్లు సమాచారం. ఇదే సమయంలో లారీలకు అవసరమైన అనుమతి పత్రాలు సక్రమంగా ఉండేలా చేసుకునేందుకు ఆర్టీఏ ఏజెంట్లను సంప్రదిస్తూ పత్రాలను సిద్ధం చేసుకునే ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఈ అక్రమ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు అధికార వర్గాల ద్వారా సమాచారం తెలిసింది. ఈ నేపథ్యంలో సంబంధిత శాఖలు కఠిన చర్యలకు ఉపక్రమించబోతున్నట్లు తెలుస్తోంది. అవసరమైతే పోలీస్‌శాఖ సహాయం తీసుకొని రాత్రిపూట జరుగుతున్న మట్టి తోలకాలపై ఉక్కుపాదం మోపేందుకు అధికారులు సిద్ధమైనట్లు సమాచారం. అయితే 'ప్రజాపక్షం' కథనం మట్టి మాఫియాకు మాత్రం కొరకని కొయ్యగా మారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోం ది. ఇప్పటి వరకు ఎటువంటి భయం లేకుండా సాగిన అక్రమ తవ్వకాలు ఒక్కసారిగా వెలుగులోకి రావడంతో మాఫియాలో ఆందోళన నెలకొన్నట్లు తెలుస్తోంది.

**అక్రమ తవ్వకాలపై కలెక్టర్ ఆరా..**

అక్రమ మట్టి తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయన్న ప్రజాపక్షం కథనంపై కలెక్టర్ ఆరా? తీసినట్లు సమాచారం. అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు, రవాణా చేపడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. అక్రమ తవ్వకాలపై సంబంధిత శాఖల అధికారులను ప్రశ్నించినట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది. రాత్రిపూట మట్టి తోలకాలు అధికంగా జరుగుతున్నందున వాటిపై ఉక్కుపాదం మోపాలని, అవసరమైతే పోలీస్‌శాఖ సహకారం తీసుకోవాలని అధికారులకు సూచించనట్లు సమాచారం. తవ్వకాల వల్ల ప్రభుత్వానికి ఆదాయం నష్టం కలగడమే కాకుండా పర్యావరణానికి కూడా హాని కలుగుతోందని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. వీటిని సమర్థవంతంగా నియంత్రిచడంలో విఫలమవుతున్న శాఖలను మందలించినట్లు సమాచారం. మట్టిని రవాణా చేస్తున్న వాహనాలను వెంటనే సీజ్ చేయాలని, బాధ్యులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింనట్లు తెలిసింది. ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అక్రమ తవ్వకాలపై నిరంతరం తనిఖీలు చేపట్టాలని కూడా సూచించినట్లు సమాచారం.

**అప్రమత్తమైన మట్టి మాఫియా...**

ఇన్నిరోజులుగా ఎటువంటి భయం, సరైన పత్రాలు లేకుండానే అడ్డగోలుగా అక్రమ మట్టి తవ్వకాలు కొనసాగిస్తున్న మట్టి మాఫియా అప్రమత్తమైంది. ఇందుకు 'ప్రజాపక్షం' కథనం ప్రచురితమైన తర్వాత పరిస్థితుల్లో మార్పు కనిపిస్తోంది. ఒక వైపు కలెక్టర్ ఆదేశాలు, మరో వైపు ఆర్టీఏ అధికారులు నిఘా పెంచబోతుండగా పరిస్థితి మారినట్లుంది. ప్రధానంగా మట్టి రవాణా చేసే లారీల పత్రాలు సక్రమంగా ఉండేలా ఆర్టీఏ ఏజెంట్లను సంప్రదిస్తూ తమ వాహనాలను సరిచేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. అక్రమ రవాణాపై ఎప్పుడైనా తనిఖీలు జరిగే అవకాశముందని భావించి ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా మరో ఘటన వెలుగులోకి వచ్చింది. మట్టి మాఫియా దోపిడీని ఆసరాగా చేసుకొని కొన్ని గ్రామాల్లో కొందరు వ్యక్తులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మాకు కొంత మొత్తం ఇస్తే సరే లేకపోతే అధికారులకు సమాచారం ఇస్తాం అంటూ బెదిరిస్తూ స్వప్రయోజనాలు సాధించుకుంటున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఇలాగే ఓ గ్రామంలో తొలుత అక్రమ తవ్వకాలను అడ్డుకున్నట్లు చేసిన కొందరు వ్యక్తులు, తర్వాత అదే మాఫియాతో సరుద్దకుపోయిన ఘటన కూడా వెలుగులోకి వచ్చింది. ఈ పరిణామాలు నిఘా వర్గాల దాకా వెళ్లగా స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.

## యువతను ప్రోత్సహించాలి

### 32వ వార్డు సిపిఐ కౌన్సిలర్ మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** క్రీడలలో యువతకు తగిన ప్రోత్సాహం, అవకాశాలు కల్పిస్తే క్రీడా పరంగా దేశానికి వన్నె తేవడంలో కీలకపాత్ర పోషిస్తారని 32వ వార్డు సిపిఐ కౌన్సిలర్ మామిండ్ల శ్రీనాథ్ రెడ్డి అన్నారు. ఆదివారం భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకొని, తన వార్డులోని యువతకు వాలీబాల్, క్రికెట్‌కిట్ కిట్‌తో పాటు క్యారం బోర్డును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...యువతలో అచంలంచలమైన ప్రతిభ దాగి ఉంటుందని, దానికి సరైన నైపుణ్యాభివృద్ధి, శిక్షణలు ప్రభుత్వం కల్పించడం ద్వారా వెలికితీయవచ్చునన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేలా యువతకు ప్రోత్సాహం కల్పిస్తే మంచి ఫలితాలు అందుతాయి అన్నారు. దీంతో క్రీడలు, విద్యా, సాంకేతిక రంగాల్లో యువత ఆత్మవిశ్వాసం పెరిగి సమాజ అభివృద్ధికి తోడ్పడతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ సభ్యులు, యువత పాల్గొన్నారు.

## నిర్మాణ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి: మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/ములుగు:** నిర్మాణ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. ఆదివారం ములుగు మండలం ఇంచర్ల గట్టమ్మ వద్ద పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రాంత సుస్థిర పర్యాటక సర్క్యూట్‌లో భాగంగా నిర్మిస్తున్న టూరిజం విలేజ్ నిర్మాణ పనులను రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క టూరిజం విలేజ్ నిర్మాణ పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. నిర్మాణ పనులలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని ప్లాన్ ప్రకారం నిర్మాణాలు జరగాలని, ఎలాంటి పొరపాట్లు జరగకుండా నాణ్యత ప్రమాణాల విషయంలో నిరంతరం అధికారులు తనిఖీలు చేస్తూ పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అభివృద్ధి నిర్మాణ పనులలో గుత్తేదారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, ఇంచర్ల సర్పంచ్, స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపిన కొత్తకొండ సర్పంచ్



**ప్రజాపక్షం/భీమదేవరపల్లి:** కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు, కేంద్ర హోంశాఖ సహాయక మంత్రి బండి సంజయ్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిసి కొత్తకొండ గ్రామ అభివృద్ధి పనులకు సహకారం అందించినందుకు కొత్తకొండ గ్రామ సర్పంచ్, గ్రామ పాలకవర్గం కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా కొత్తకొండ గ్రామ సర్పంచ్ రమేష్, రంగయ్య పల్లి సర్పంచ్ మండల రజిని మహేష్, రసూల్ పల్లి గ్రామ సర్పంచ్ బోయిని మహేష్, గ్రామ సర్పంచులు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కొత్తకొండ గ్రామానికి ఈ మధ్యకాలంలో.6 హై మాస్ట్ లైట్లు 2 బోర్లు. 15 లక్షల రూపాయల సీసీ రోడ్డు వేయించగా, అదనంగా మే నెల బడ్జెట్‌లో మరో 10 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే రసూల్ పల్లి రంగయ్యపల్లి గ్రామాలకు కూడా 15 లక్షల రూపాయల సీసీ రోడ్ల ఈ నెలలో వేసుకునేటట్లు సదుపాయం కల్పిస్తా అని తెలిపారు. మిగతా అభివృద్ధి పనులకు కూడా మే నెలలో నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల అభివృద్ధి కోసం నిత్యం కృషి చేస్తున్న కేంద్ర హోంశాఖ సహాయక మంత్రి బండి సంజయ్ కుమార్ కి గ్రామ సర్పంచులు పాలకవర్గ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఆధునిక పద్ధతులతో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలి



**ప్రజాపక్షం/కుదప:** రైతులు ఆధునిక పద్ధతులను ఉపయోగించుకుని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని ఆత్మ కమిటీ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి సూచించారు. సిరోల్ మండలం మొన్నెగూడెం గ్రామ రైతు వేదికలో మండల వ్యవసాయ అధికారి చాయరాజ్ అధ్యక్షతన జరిగింది, ఈ సందర్భంగా రైతులు శాస్త్రవేత్తలతో ముఖాముఖి కార్యక్రమానికి ముఖ్యతిథిగా విచ్చేసిన సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ రైతులు పంట మార్పిడి, యూరియా తక్కువ మోతాదులు వాడడం, పచ్చ రొట్టె వేసుకోవడం, రైతులందరూ ఒకే పంట కాకుండా వేరువేరు రకాల సాగు చేయడం లాంటి పద్ధతులను శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచనలతో సాగును సాంప్రదాయ పద్ధతిలో కాకుండా ఆధునిక పద్ధతులతో లాభదాయకంగా మార్చుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి బి సరిత, జిల్లా హార్టీ కల్చర్ అధికారి మరియన్న, డివిజన్ వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర, మల్యాల శాస్త్రవేత్త క్రాంతి కుమార్, సర్పంచ్ కొండపల్లి లక్ష్మి కరుణాకర్ రెడ్డి, ప్రజాపతి విజ్ఞమయ్య, కామ సంజీవరావు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్ అంతా ఒట్టి డొల్ల.. ఇది అమలు కాని ఆశల బడ్జెట్

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో ఆర్థిక మంత్రి భట్టి ప్రవేశపెట్టిన బడ్జెట్ ఒట్టి బడ్జెట్ అని, బడ్జెట్ అంతా డొల్ల అని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి ఎద్దేవా చేశారు. భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి, రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిన్న ప్రవేశ పెట్టిన బడ్జెట్ ఒట్టి డొల్ల బడ్జెట్ అని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కోసం ప్రజలు ఎంతో ఆశతో ఎదురుచూస్తుంటారని, ఇది అమలు కాని ఆశల బడ్జెట్ మాత్రమేనని అన్నారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వంలో ప్రజాసంక్షేమానికి పెద్దపీట వేసి, రైతాంగానికి అపూర్వమైన పథకాలు రైతుబంధును ప్రవేశపెట్టారని, అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే విధంగా అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారన్నారు. ఐయితే, ప్రస్తుత ప్రభుత్వం ప్రజలకు భిన్నమైన పాలన అందిస్తోందని చెప్పి, ఆరు గ్యారెంటీలు పేరుతో హామీలు ఇచ్చిందని, బడ్జెట్లో ఆ ఆరు గ్యారంటీల అమలుకు బడ్జెట్లో నిధులు కేటాయించలేదని, అది ఎలా అమలు చేస్తారని ఆయన ప్రశ్నించారు. ఏ ప్రభుత్వానికైనా బడ్జెట్ కాలంలో ఐదు సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం ఉంటుంది. ఈ ప్రభుత్వం ఇప్పటికే మూడు సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిందని అంటే దాదాపు 60 శాతం పదవీకాలం పూర్తయిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చే ముందు 100 రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని, వాటికి చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చారని, మొట్ట మొదటి క్యాబినెట్ సమావేశంలోనే ఈ పథకాలకు చట్టబద్ధత తీసుకువస్తున్నట్లుగా చెప్పినా, అది కేవలం నాటకంగా మిగిలిపోయిందని ఆరోపించారు. అలాగే తులం బంగారం, ఆడపిల్లలకు స్కూటీ వంటి హామీలను కూడా కనిపించడం లేదని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో మార్పులు చేసి, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా నిధుల కేటాయించి చిత్తశుద్ధితో ఆరు గ్యారెంటీల అమలు కోసం చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే కోరారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కటకం జనార్ధన్, బిఆర్ఎస్ నాయకులు సెగ్గం సిద్ధు, మాదాసి తిరుపతి తమ్మ, మాజీ కౌన్సిలర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవాలి

### మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/గోవిందరావుపేట:** మండలకేంద్రంలోని పసర గ్రామంలో 99 రోజుల యాక్షన్‌ప్లాన్‌లో భాగంగా రోడ్స్, డ్రైనేజీలు పరిశుభ్రత కార్యక్రమంలో ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా జల మహోత్సవం ర్యాలీ కార్యక్రమంలో, రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి గ్రామీణ నీటి సరాఫరా స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క , జిల్లా కలెక్టర్ దివాకర్ టి ఎస్, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్‌లతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, నీటిని వృధా చేస్తే మానవ మనుగడకే ముప్పు వాటిల్లే ప్రమాదం పొంచి ఉందని అవసరం మేరకు మాత్రమే నీటిని ఉపయోగించుకోవాలని, భూగర్బ జలాలను పెంపోందించుకోవడం కోసం ప్రతి ఒక్కరు తమ ఇంటి పరిసర ప్రాంతాల్లో ఇంకుడు గుంతలను ప్రతి ఇంటికి ఒక ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. చెరువులను కాపాడుకుంటూనే అడవులను సంరక్షించుకోవాలని పేర్కొన్నారు. గ్రామాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, వ్యర్థాలను చెత్తను విచ్చలవిడిగా రహదారులపైన పరిసర ప్రాంతాలలో వేయకుండా ప్రత్యేకంగా చెత్త కుండీలను ఏర్పాటు చేసుకొని, వాటిలో వేయాలని సూచించారు. పారిశుద్ధ్య కార్మికులు నిరంతరం గ్రామ పరిశుభ్రత లో కీలక పాత్ర పోషిస్తుంటారని, వారందరిని చిన్న చూపుతో చూడకుండా గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్పష్టం చేశారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి, మహిళా సంఘాల సభ్యులకు రుణాలను అందించి వివిధ వ్యాపారాలలో ఆర్థికంగా బలోపేతం కావడానికి, ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని అన్నారు. ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించానికి పాఠశాల విద్యార్థులకు కూడా పాలు పంపిణీ చేయడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. పాల కొరత సమస్య తీర్చడం కోసం మహిళా సంఘాల సభ్యులు గేదల పెంపకంపై ప్రత్యేక దృష్టి సాధించాలని దీని ద్వారా పాల సమస్య తీర్చడం కోసం మహిళా సంఘాల సభ్యులు గేదల పెంపకంపై ప్రత్యేక దృష్టి సాధించాలని, దీని ద్వారా పాల సమస్య తీయడంతో పాలు వారికి ఆర్థిక ప్రయోజనాలు కూడా చేకూరతాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా రేషన్ కార్డు కలిగిన వారు ప్రమాదవశాత్తు మృతి చెందిన, ఇందిరమ్మ బీమా పాలసి ద్వారా ఐదు లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వడానికి నిర్ణయం తీసుకుందని, రేషన్ కార్డు పొందని నిరుపేదలకు నూతన రేషన్ కార్డులు పంపిణీ చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. గ్రామాలలో కుల మతాలకు అతీతంగా గ్రామస్తులందరూ ఒకే చోట చేరి పండుగ జరుపుకోవడానికి గ్రామ మహోత్సవ కార్యక్రమాలను నిర్వహించడానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తుందని, ఈ కార్యక్రమం ద్వారా గ్రామ ప్రజలు గ్రామ అభివృద్ధిలో స్వచ్ఛందంగా భాగస్వాములు కావడం జరుగుతుందని వారు కూడా గ్రామ అభివృద్ధికి కావల్సిన సహాయ సహకారాలు సలహాలు సూచనలు అందిస్తారని, గ్రామస్తులు కలిసి మేలిసి పండుగ నిర్వహించుకోవాలని ఆత్మీయ సమ్మేళనం తరహాలో గ్రామ పెద్దలను సన్మానించడం జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ దివాకర్ టి ఎస్ మాట్లాడుతూ, 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామాలలో విజయవంతంగా పారిశుధ్య పనులను నిర్వహించడం జరిగిందని, ప్రభుత్వ కార్యాలయాలలో పరిశుభ్రత పనులు నిర్వహించిపెండింగ్ ఫైల్స్ సమస్యను పరిష్కరించుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మార్చ్ 12వ తేదిన నూతనంగా ఎన్నికైనా గ్రామ సర్పంచులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, పారిశుధ్యం నీటిని పోదుపు పలు అంశాలలో కూడా ప్రజాప్రతినిధులు శ్రద్ధ కనపర్చాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి జిల్లా పంచాయతీ అధికారి కే వెంకటయ్య ఆర్డబ్ల్యూఎస్ ఈఈ మాణిక్యరావు డిప్యూటి ఈ ఈ సునీత పసర సర్పంచ్ సుమలత ఎంపీఓ సుమలత కార్యదర్శి శరత్ స్థానిక ప్రజా ప్రతినిధులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే కడియం

**ప్రజాపక్షం/ధర్మ సాగర్ :** ధర్మసాగర్ మండలం నారాయణగిరి గ్రామ ఉప సర్పంచ్ వల్లపురెడ్డి రాజీమ్మా రెడ్డి గారి తండ్రి వల్లపురెడ్డి చంద్రారెడ్డి (75) మరణించగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ముప్పారం గ్రామ మాజీ ఉప సర్పంచ్ తాళ్లపల్లి వెంకన్న (60) గారు మరణించగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే వార్డు సభ్యుడు మారబోయిన సదానందం తల్లి సూరమ్మ, అదే గ్రామానికి చెందిన వెల్దండి ఈశ్వరమ్మ, హగడ్డం కట్టమల్లు మరణించగా వారి చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం ముప్పారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ నాయకులతో సమావేశం అయ్యారు. గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై వారితో చర్చించారు. రెండో విడతలో ముప్పారం గ్రామానికి 60ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తానని తెలిపారు. ముప్పారం నుండి దేవునూరు వెళ్లే రోడ్డు గ్రామ పరిధి వరకు కుడా ద్వారా డబుల్ లైన్ సిసి రోడ్డు మంజూరు చేస్తానని అన్నారు. ఎమ్మెల్యే వెంట స్థానిక సర్పంచ్ గుంటిపల్లి రేణుక వెంకట్, వార్డు సభ్యులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


## మెగా ఉచిత వైద్య శిబిరం ప్రారంభించిన ఎంపి కావ్య



**ప్రజాపక్షం/ధర్మ సాగర్:** ధర్మసాగర్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆదివారం కూరపాటి ఫౌండేషన్ ట్రస్ట్ సహకారంతో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని" వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.మరోసారి తన వైద్య వృత్తిని స్మరింపజేస్తూ వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య శిబిరానికి వచ్చిన ప్రజలతో నేరుగా మమేకమై వారికి బీపీ చెక్ చేసి, వైద్య రిపోర్టులను పరిశీలించి, అవసరమైన మందులను స్వయంగా అందజేశారు. ప్రజల ఆరోగ్య పరిస్థితులను ఆత్మీయంగా అడిగి తెలుసుకుంటూ సేవాభావంతో వ్యవహరించడం అక్కడ అందరినీ ఆకట్టుకుంది.ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ వైద్యం అనేది వ్యాపారం కాకుండా మానవతా దృక్పథంతో చూడాల్సిన రంగమని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించడంలో స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయని పేర్కొన్నారు. సేవా భావనతో కూరపాటి ఫౌండేషన్ ట్రస్ట్ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులను ప్రత్యేకంగా ఎంపీ అభినందించారు.స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో బడుగు, బలహీన వర్గాల ప్రజలు అధికంగా ఉన్నందున మండలాల వారీగా ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను తరచూ నిర్వహించి ప్రజలకు చేరువలోనే వైద్య సేవలు అందించాలని కోరారు. ప్రస్తుతం 3040 ఏళ్ల వయసులోనే హార్ట్ ఎటాక్‌లతో ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. ఒకప్పుడు 50 ఏళ్లు దాటిన తరువాత కనిపించే అనారోగ్య సమస్యలు ఇప్పుడు తక్కువ వయసులోనే వస్తున్నాయని పేర్కొన్నారు. కాబట్టి ప్రజలు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా ప్రతి సంవత్సరం వైద్య పరీక్షలు చేయించుకుంటూ, సరైన ఆహారం, జీవనశైలితో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజల ఆరోగ్యమే సమాజ అభివృద్ధికి పునాది అని పేర్కొంటూ ఆరోగ్యంపై అప్రమత్తత పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలియా, ఉప సర్పంచ్ కొమురమ్మ సాయిపేట సర్పంచ్ లక్ష్మి , మండల అధ్యక్షులు గుర్రపు ప్రసాద్, రమేష్, డాక్టర్ సుస్మిత, ఇతర వైద్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.

## సిబ్బందికి సరైన శిక్షణ ఎంతో కీలకం

### కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**ప్రజాపక్షం/వరంగల్ :** జనగణన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సిబ్బందికి సరైన శిక్షణ ఎంతో కీలకమని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. ఆదివారం బొల్లికుంటలోని వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల సమావేశ మందిరం (కంప్యూటర్ ల్యాబ్)లో ప్రిన్సిపాల్ సెన్సస్ అధికారి హోదాలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జనగణన2027 నిర్వహణపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఛార్జ్ సెన్సస్ క్లర్కులు, టెక్నికల్ అసిస్టెంట్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని, జనగణన ప్రక్రియపై పూర్తి అవగాహనతో బాధ్యతగా విధులు నిర్వహించాలని సూచించారు. జనగణన ద్వారా ప్రభుత్వానికి అవసరమైన ఖచ్చితమైన గణాంకాలు అందుతాయని, అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ప్రతి ఇంటిని సందర్శించి సరైన వివరాలను సేకరించడం సిబ్బందిపై ఉన్న ప్రధాన బాధ్యత అన్నారు. శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బందికి విధివిధానాలపై సమగ్రంగా అవగాహన కల్పించినట్లు తెలిపారు. విధుల్లో నిబద్ధతతో పనిచేసి జనగణన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా సెన్సస్ అధికారి (డీఆర్ఓ) విజయలక్ష్మి , ముఖ్య ప్రణాళిక అధికారి చంద్రకళ, వరంగల్ ఆర్డీఓ సుమ, ఖిలా వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్, సంబంధిత అధికారులు (ఎంపీఎస్‌వోలు), టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## వరుస వివాదాల్లో జనగామ జిల్లా కలెక్టర్

### టీ స్టాల్ వివాదం కోర్టుకు
### ఇప్పటికీ కలెక్టర్ బంగ్లాకు వెళ్లని సందీప్‌కుమార్ ఝా



**ప్రజాపక్షం/జనగామ:** జనగామ జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా వరుస వివాదాల్లో చిక్కుకుంటున్నారు. ఆయన విధుల్లో చేరి నెల రోజులు కాకముందే రెండు, మూడు సంఘటనల్లో వివాదాస్పదంగా మారడం, కొందరు కోర్టుకు వెళ్లడం వంటివి జరిగాయి. టీ స్టాల్‌పై కోర్టుకు వెళ్లడమే కాకుండా నిరుద్యోగులకు రంజాన్ పండగ రోజునే పరీక్షలు నిర్వయించడం, ఇప్పటికీ కలెక్టర్ బంగ్లాకు వెళ్లకుండా ఆర్అండ్‌బి అతిథిగృహంలోనే బస చేయడం వంటి అంశాలు జిల్లాలో చర్చనీయాంశంగా మారాయి. ఒక వైపు తనిఖీలతో కలెక్టర్ హల్‌చల్ చేస్తున్నప్పటికీ మరో వైపు పలు విషయాల్లో కఠినంగా వ్యవహరించడం వివాదంగా మారుతుంది. గత నెల 26న రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టర్ల బదిలీలు జరిగాయి. జిహెచ్ఎంసి కుత్బుల్లాపూర్ కమీషనర్‌గా ఉన్న సందీప్‌కుమార్ ఝా జనగామ జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ కలెక్టర్‌గా పనిచేస్తున్న రిజ్వాన్ బాష షేక్‌కు జోగులాంబ గద్వాల్ జిల్లాకు బదిలీ అయ్యారు. సందీప్‌కుమార్ ఝా గత నెల 26ననే విధుల్లో చేరారు. వచ్చిన మరుసటి రోజు నుండే చేర్పులు మార్పులకు శ్రీకారం చుట్టారు. మొదటి గ్రీవెన్స్‌లోనే పలువురు అధికారులపై అగ్రహం వ్యక్తం చేయడంతో అన్ని శాఖల అధికారులు అలర్ట్ అయ్యారు. ఇక కోటీ మందిని కోటీశ్వరుల్ని చేయాలనే లక్ష్యంలో ప్రభుత్వం మహిళలకు ఆర్థిక సహాయం అందించేందుకు రుణాలు మంజూరు చేస్తుంది. అందులో భాగంగా జనగామ జిల్లా కలెక్టరేట్ ముందు అనిత టీ స్టాల్, విజయ డైరీ పార్లర్ ఏర్పాటు చేయగా కలెక్టర్ ప్రారంభించారు. వాటిని తొలగించాలని ఆర్‌డిఓ, మున్సిపల్ కమీషనర్‌ను కలెక్టర్ ఆదేశించడంతో వారు తొలగించే ప్రయత్నాలు జరగగా అడ్డుకున్నారు. చివరకు వారు కోర్టుకు వెళ్లి స్టే కూడా తీసుకొచ్చారు. స్టే ఉండగానే ఫుడ్ సేఫ్టీ అధికారి తనిఖీ చేసి తెల్ల కాగితంపై సంతకం చేయించుకోవడం వివాధంగా మారింది. బాధితులు కలెక్టర్ కాళ్ల మీద పడినా కనికరించలేదు. దీనితో అనితా టీ స్టాల్, విజయ డైర్లీ పార్లర్ వారు రోడ్డు పడ్డారు. ఈ వివాధం కొనసాగుతుంది.

## హైదరాబాదుకి దీటుగా వరంగల్ నగరం అభివృద్ధి

### ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/హనుమకొండ:** ప్రజాపాలనలో భాగంగా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తూ పశ్చిమ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు.ఆదివారం నియోజకవర్గ పరిధిలోని 30వ మరియు 59వ డివిజన్లలో సుమారు రూ.85 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సంబంధిత కాంట్రాక్టర్లకు పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు. అనంతరం మాట్లాడుతూ అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని, ప్రజల భాగస్వామ్యం ఉంటేనే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని తెలిపారు. నియోజకవర్గ పరిధిలో సీసీ రోడ్లు లేని కాలనీలను పూర్తిగా అభివృద్ధి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. ఇప్పటివరకు సుమారు 80 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను కూడా త్వరితగతిన పూర్తి చేస్తామని వెల్లడించారు.రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో పశ్చిమ నియోజకవర్గానికి సమృద్ధిగా నిధులు అందుతున్నాయని తెలిపారు. భవిష్యత్తులో వరంగల్ నగరంను హైదరాబాద్‌కు సమానంగా అభివృద్ధి చేసే దిశగా కార్యాచరణ కొనసాగుతుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా డివిజన్ ల ప్రజా ప్రతినిధులు,పార్టీ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరాపార్క్ వద్ద మహా ధర్నా

### సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఆదరీ శ్రీనివాస్



**ప్రజాపక్షం/భీమదేవరపల్లి:** భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 24 తారీకు హైదరాబాదులో ఇందిరాపార్క్ వద్ద మహా ధర్నా కార్యక్రమం విజయవంతం చేయాలని, హనుమకొండ, వరంగల్, భూపాల్‌పల్లి, రంగారెడ్డి జిల్లాలో పేదలు వేసుకున్న గుడిసెల కు పట్టా ఇవ్వాలని భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం, అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం ఉంటుందని, కావున కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఆదరీ శ్రీనివాస్ కోరారు. ప్రజా ఉద్యమాల ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరిస్తారని, భూమిలేని పేదలందరికీ భూములు పంచాలని భూమి లేని పేదలు గుడిసెలు వేసుకున్న ప్రాంతంలో పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి వాళ్ళను ఆదుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీగా డిమాండ్ చేస్తున్నామని ఆదరి శ్రీనివాస్ పేర్కొన్నారు.

## మాటలు కాదు... పనులతో జవాబు: ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/నెక్కొండ:** నెక్కొండ మండలంలోని నెక్కొండ పట్టణంలోని ఎస్‌సి కాలనీ నందమూరి నగర్‌లో రూ.40లక్షలతో దీక్షకుంట ఎస్‌సి కాలనీలో రూ.10లక్షలతో, చంద్రుగొండ ఎ స్‌సి కాలనీలో రూ.50లక్షలతో సిసి రోడ్డు రూ.20లక్షలతో సైడ్ కాలువల నిర్మాణం, తోపనపల్లిలో రూ.10లక్షలు అప్పలరావుపేటలో రూ.10లక్షలతో గ్రామాల్లో సిసి రోడ్లు, కాలువల నిర్మాణ పనులకు నర్సంపేట ఎంఎల్‌ఏ దొంతి మాధవరెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు మరిచి పోయే నాయకుల్లో నేను లేను....చెప్పిన మాట నిలబెట్టుకోవడం మా రాజకీయ సంస్కృతి అన్నారు. ప్రజలు నమ్మి ఓటుసారు..ఇప్పుడు ఆ నమ్మకానికి పని రూపంలో జవాబు ఇస్తున్నామని స్పష్టం చేశారు. మట్టిదారులు, చెత్త కాలువలు చూసే రోజులు పోయాయని, ఇక నుండి ప్రతి కాలనీ అభివృద్ధి గళం వినిపిస్తుంది. ఎవరైనా అడ్డుకున్నా...అభివృద్ధి ఆగదని..ఆపలేరని అంటూ ఘాటుగా హెచ్చరించారు. పదవుల కోసం కాదు.. ప్రజల కోసం పనిచేసే రాజకీయమే మాదని, చివరి ఇంటి వరకు సౌకర్యాలు చేరే వరకు మా పోరాటం కొనసాగుతుందని ధృడంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, నెక్కొండ వ్యవసాయ మర్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, నెక్కొండ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్, చంద్రుగొండ సర్పంచ్ బక్కి కవిత అశోక్, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌లు ఆవుల శ్రీనివాస్, లావుడియా తిరుమల చౌహాన్, యువజన కాంగ్రెస్ నాయకులు చల్ల శ్రీపాల్‌రెడ్డి, బక్కి నరేష్, మండల కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి కుసుమ చెన్నకేశవులు, కొల్లు వెంకటసుబ్బారెడ్డి, రామలింగేశ్వర ఆలయ చైర్మన్ కొమ్మారెడ్డి రవీందర్‌రెడ్డి, కొణిజేటి బిక్షపతి అహ్మద్ అన్వర్, మెరుగు కుమారస్వామి, చల్లా రఘోత్తంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా మండల కన్వీనర్ రావుల తిరుపతి రెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు భారీగా పాల్గొన్నారు.

## ఇష్టా రాజ్యాంగా ప్రైయివేట్ పాఠశాల నిర్వాహకం!

### మండుతున్న ఎండల్లో విద్యార్థులు, ఆందోళనలో తల్లిదండ్రులు

**ప్రజాపక్షం/చెన్నారావుపేట:** మండుతున్న ఎండల్లో ఓ ప్రైవేట్ పాఠశాల నిర్వహిస్తున్న పట్టించుకునే నాధుడే కరువయ్యరని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలో ఓ ప్రైవేట్ పాఠశాల ఉంది. ప్రభుత్వం మార్చి 15 నుంచి ఒక పూట పాఠశాలలను నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసిన విషయం అందరికీ తెలిసిందే. ఓ ప్రైవేట్ పాఠశాల యజమాన్యం మాత్రం అవి ఏమీ పట్టించుకోకుండ ఎం డలో పాఠశాలను నడుపుతున్న విద్యాశాఖ అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదని విద్యార్థుల తల్లిదండ్రులు బహిర్గతంగా ముచ్చటించుకుంటున్నారు. ప్రధానంగా అదే పాఠశాలలో చిన్నపిల్లలు ఎక్కువమంది ఉన్నారు. విద్యార్థులకు ఎండకు జరగరాని జరుగుతే ఎవరూ బాధ్యులని పలువురు ఆరోపిస్తున్నారు. మండల విద్యాశాఖ అధికారుల కన్ను సైగలోనే నడిపిస్తున్నాడనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. అంతేకాకుండ ప్రతి నెలలో రెండవ శనివారం పాఠశాలకు సెలవు ప్రభుత్వం ఇచ్చినప్పటికీ ఈ పాఠశాల యాజమాన్యం మాత్రం నడుపుతున్నాడని విద్యార్థుల తల్లిదండ్రులు చెప్తున్నారు. ఎంఈఓ పాపమ్మను వివరణ కోరగా కనుక్కొని చెప్తాని చెప్పారు.

'నవీన్ చంద్ర హీరోగా, పలాస దర్శకుడు కరుణ కుమార్ రచన, దర్శకత్వంలో ఒవిఎ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై తెరకెక్కిన సైకలాజికల్ హర్రర్ సినిమా హనీ. ప్రస్తుతం ఈ సినిమా ఒటిటిలో ట్రేండింగ్ లో ఉంది.'

# లీల

## గ్రామీణ నేపథ్యంలో లవ్ వాలా



రవీంద్ర తేజ్ హీరోగా స్వాన్ ఎంటర్‌టైన్‌మెంట్ శుభకరి ఇన్‌ఫ్రా మీడియా బ్యానర్స్ నిర్మిస్తున్న చిత్రం 'లవ్‌వాలా'. కొరటాల శివ, బుచ్చిబాబు సానా వద్ద అసోషియేట్ గా పని చేసిన రంజిత్ కుమార్ దేశెట్టి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. రూరల్ బ్యాక్ డ్రాప్ లవ్ స్టోరీగా రూపొందుతున్న ఈ చిత్రంలో అరియా మోడీ హీరోయిన్‌గా నటిస్తోంది. పూజా కార్యక్రమాలతో ఈ చిత్రం ఘనంగా లాంచ్ చేశారు. డైరెక్టర్ కొరటాల శివ ముహుర్తపు సన్నివేశానికి క్లాప్ కొట్టారు. డైరెక్టర్ బుచ్చిబాబు సానా కెమెరా స్విచ్ ఆన్ చేశారు. కొరటాల శివ, బుచ్చిబాబు సానా మేకర్స్‌కు స్క్రిప్ట్ అందజేశారు. ఈ చిత్రంలో రాజ్ అర్జున్, మణి చందన, కమల్, నవీన్ నేని, నాగ మహేష్, రష్మీ గౌతమ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి విజయ్ బుల్గానిన్ మ్యూజిక్ అందిస్తున్నారు. జమ్మా శ్రీను డిఒపి, తూము రాము ఎడిటర్, ఆర్ట్ డైరెక్టర్‌గా బేబీ సురేశ్ భీమగాని పని చేస్తున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిర్మాత సురేష్ వర్మ మాట్లాడుతూ రంజిత్ చెప్పిన కథ మాకు చాలా నచ్చింది. ఇది చాలా మంచి లవ్‌స్టోరీ. రవి హీరోగా నటిస్తున్నారు. అరియ మోడీని హీరోయిన్‌గా పరిచయం చేస్తున్నాం. ఫస్ట్ షెడ్యూల్ తర్వాత మరిన్ని వివరాలు తెలియజేస్తాం అని చెప్పారు. ఈ కథ రాసిన తర్వాత సురేష్ కి చెప్పాను. ఆయనకు చాలా నచ్చింది. . ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: శివ నాగ కృష్ణ ఉప్పలపాటి.

## 'జెన్ మేరీ ఖాన్' ఫస్ట్‌లుక్ రిలీజ్



హీరో అడివి శేష్ ఇప్పుడు డెకాయిట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రంలో తొలిసారిగా మాస్, రగడ పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రంలో హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్ నటిస్తున్నారు. అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషిస్తున్నారు. షానియల్ డియో ఈ సినిమాతో దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు. బాలీవుడ్ స్టార్ అమీర్ ఖాన్ కజిన్ బ్రదర్ కుమార్తె జెన్ మేరీ ఖాన్ తెలుగు చిత్రసీమలో అరంగేట్రం చేస్తోంది. ఈ సందర్భంగా ఆమె ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఖాకీ యూనిఫామ్‌లోతుపాకీ పట్టుకుని ముందుకు గురిపెట్టిన ఆమె లుక్ పవర్‌ఫుల్‌గా కనిపిస్తోంది. ఈ పోస్టర్‌లో జెన్ పాత్ర ఇంటెన్సిటీ స్పష్టంగా కనిపిస్తోంది. వెనుక వైపు ఇతర పోలీస్ అధికారులు ఉండటం ఈ సన్నివేశానికి మరింత బలం చేకూర్చింది. ఈ పోస్టర్‌ను చూసిన ఆమిర్ ఖాన్ వెంటనే స్పందించి అభినందనలు తెలుపుతూ మొత్తం టీమ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మెసేజ్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. హిందీ ప్రేక్షకుల్లో సినిమాకు మరింత హైప్‌ను తెచ్చింది. ఇప్పటికే ఈ సినిమా పోస్టర్లు, గ్లింప్స్, టీజర్, అలాగే మొదటి సాంగ్ 'రుబారు' ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన పొందుతూ సినిమాపై భారీ అంచనాలు నెలకొల్పాయి. ఈ మూవీని తెలుగు, హిందీ భాషల్లో ఒకేసారి రూపొందిస్తున్నారు. సుప్రియా యార్లగడ్డ నిర్మాణంలో, సునీల్ నారంగ్ సహనిర్మాతగా అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ సినిమాకు సినిమాటోగ్రాఫర్ ధనుష్ భాస్కర్, భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. గ్యాని అందించే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకు ఎమోషన్ మరింతగా పెంచనుంది. అన్ని పనులు పూర్తి చేసి ఏప్రిల్ 10న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

## ఆకట్టుకునేలా 'డైమండ్ డెకాయిట్' పాటలు

దర్శకుడు వి.ఎన్.ఆదిత్య



తెలుగు తెరపై సరికొత్త కాన్సెప్ట్‌తో రూపొందిన ఎమోషనల్ రివెంజ్ డ్రామా 'డైమండ్ డెకాయిట్'. పార్థ గోపాల్ నిర్మాణంలో, దర్శకుడు సూర్య జి యాదవ్ దర్శకత్వంలో, పార్థగోపాల్ మేఘన జంటగా తె రకెక్కుతున్న ఈ సినిమా ఆడియో విడుదల కార్యక్రమం హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో ఘనంగా జరిగిం ది. ప్రముఖ మ్యూ జిక్ సంస్థ మధుర ఆడియో ద్వారా ఈ పాటలను ముఖ్య అతిథిగా హాజరైన తెలు గు ఫిలిం డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీఎన్ ఆ దిత్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ ఒ వినూత్న పోటీకి తెరలేపింది. ఈ చిత్రంలోని మరదలివే పాటకు హుక్ స్టెప్ ఛాలెంజ్‌ను ప్రకటించింది. ఆసక్తిగల వారు వారు ఆ పాటకు తమ హుక్ స్టెప్‌తో రీల్స్ రూపొందించి ఆరీల్స్ లింక్‌ను 8074 801661 వాట్సాప్ నంబర్‌కు పంపవచ్చు. మొదటి బహుమతి లక్ష రూపాయలు, రెండ వ బహుమతి యాభై వేల రూపాయలు అం ద జేస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా తెలుగు ఫిలిం డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.ఎన్. ఆదిత్య మాట్లాడుతూ సినిమా పాటలు ఎంతో ఆకట్టుకున్నాయి.

## అలరిస్తున్న 'అరెరే..అరెరే'

సంగీత దర్శకుడు రఘు కుంచె



ప్రముఖ గాయని , నటి దియా అందించిన 'అరెరే.. అరెరే.. మ్యూజిక్ వీడియో ఆల్బమ్ విడుదల కార్యక్రమం ఘనంగా హైదరాబాద్ లోని ప్రసాద్ ల్యాబ్ లో ఆదివారం జరిగింది. బటర్‌ప్లై మ్యూజిక్ బ్యానర్‌పై రూపొందిన ఈ మ్యూజిక్ వీడియో విడుదల వేడుకకు సినీ ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తెలుగు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.ఎన్. ఆదిత్య, హీరో పూరి ఆకాష్, సినీ ప్రముఖులు సమీర్, సాగర్, ప్రముఖ సంగీత దర్శకుడు రఘు కుంచె, నటుడు, మిమిక్రి శివారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంగీత దర్శకుడు రఘు కుంచె మాట్లాడుతూ ఇది డిజిటల్ యుగం. ప్రతిభ ఉన్న వారు అవకాశాల కోసం ఎదురు చూడాల్సిన అవసరం లేదు. తమ టాలెంట్‌తోనే ముందుకు రావచ్చు. దియా అలాంటి ప్రతిభావంతురాలు ఈ పాటలో ఆమె చూపించిన భావ వ్యక్తీకరణ, గాత్రం ప్రేక్షకులను తప్పకుండా ఆకట్టుకుంటాయి. ఈ సాంగ్ మంచి హిట్ అవుతుందని నమ్ముతున్నాను అని పేర్కొన్నారు. నటి, సింగర్ దియా మాట్లాడుతూ ఈ ఆల్బమ్ రూపుదిద్దుకోవడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ కార్యక్రమంలో దర్శకుల సంఘం అధ్యక్షుడు వి ఎన్ ఆదిత్య, నటుడు పూరి ఆకాష్ , నిర్మాత నూతన్ చెకురి, దర్శకుడు క్రాంతి వర్మ , మ్యూజిక్ డైరెక్టర్ శరవణ వాసుదేవన్ పాల్గొన్నారు. త్వరలోనే ఈ మ్యూజిక్ వీడియో యూట్యూబ్‌తో పాటు స్పాటిఫై, ఆపిల్ మ్యూజిక్, అమెజాన్ మ్యూజిక్ వంటి ప్రముఖ డిజిటల్ ప్లాట్‌ఫార్మలలో ప్రేక్షకులకు అందుబాటులోకి రానుంది.

## 'సఖియే' లిరికల్ సాంగ్ రిలీజ్



కెన్ కరునాస్, కెఅనిష్మ అనిల్ కుమార్, దేవదర్శిని చేతన్, సూరజ్ వెంజరముడు, ప్రియాన్షి యాదవ్, మీనాక్షి ధినేష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తమిళ మూవీ 'యూత్'. ఈ చిత్రాన్ని ఇదే పేరుతో ఈ2సీ బ్యానర్ పై తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు హౌస్ ఫుల్ సంస్థ అధినేతలు వినీత్, సందీప్. ఈ చిత్రానికి కెన్ కరునాస్ అండ్ గ్యాంగ్ దర్శకత్వం వహించారు. ఈ నెల 26న 'యూత్' మూవీ తెలుగులో థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. 'కమ్ విత్ యువర్ గ్యాంగ్, నోట్ నో ఏజ్ లిమిట్' అనే స్లోగన్‌తో ఈ సినిమా ప్రమోషనల్ క్యాంపెయిన్ చేస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ చేసిన ఈ మూవీ ట్రైలర్ కు మంచి రెస్పాన్స్ వస్తోంది. తాజాగా యూత్ సినిమా నుంచి 'సఖియే' లిరికల్ సాంగ్ రిలీజ్ చేశారు. జివి ప్రకాష్ కుమార్ బ్యూటిఫుల్ కంపోజిషన్ చేసిన 'సఖియే' లిరికల్ సాంగ్‌కు కిట్టు విస్సాప్రగడ సాహిత్యాన్ని అందించగా, సింజిత్ యెర్రమల్లి, సింధుజ తణుకు ఆకట్టుకునేలా పాడారు. 'పలికానే పెదాలతోనే పలుమార్లు ఇలా నీ పేరే, అలవాటే లేదాయే వెతికే మాయవి నీవేలే, ఒక మాటే మాటాడమంటే మదిదాటి రాలేను అందే, విన్నావా అంటూనే పిలిచాయే నా మౌనాలే, కలవా, కథవా నన తాకే అలవా, మనసే సంద్రంలా మారిందా..సఖియే..సఖియే..' అంటూ యువ జంట పాడుకునే అందమైన ప్రేమ పాటగా సాగుతుంది.ఈ చిత్రానికి ప్రొడ్యూసర్ కరుపయ్య సి.రామ్, సులోచన కుమార్, సినిమాటోగ్రఫీ వికి, ఎడిటర్ నాష్, ఆర్ట్ డైరెక్టర్ రాము తంగరాజ్, క్రియేటివ్ ప్రొడ్యూసర్ విజయ్ ఎంపీ, స్టంట్ కలై కింగ్సన్, కొరియోగ్రఫీ శోబి పాల్ రాజ్.

## త్వరలోనే 'ప్రేయసి రావే-2' చేస్తా

దర్శకుడు మహేష్ చంద్ర



తన జీవితాన్ని మలుపు తిప్పిన 'ప్రేయసి రావే' చిత్రానికి త్వరలో సీక్వెల్ చేయబోతున్నానని దర్శకుడు మహేష్ చంద్ర వెల్లడించారు. కథ సిద్ధమైతోంది. పూర్తి వివరాలు త్వరలోనే చెబుతాను. హీరో శ్రీకాంత్ కి కూడా ఈ విషయం చెప్పాను. ఆయన కూడా చాలా ఆనంద పడ్డారు. 'శ్రీకాంత్, రాశి, పృథ్వి, శివాజీ రాజా, ఎంఎం శ్రీలేఖ మేమంతా కలిసి మళ్లీ పని చేస్తాం' అని దర్శకుడు మహేష్ చంద్ర తెలిపారు. తాజాగా మహేష్ నూతన నటీనటులతో మహేష్ చంద్ర తెరకేకించిన 'పిఠాపురంలో అలా మొదలైంది. సినిమా ట్రయిలర్ ను హీరో శ్రీకాంత్, నటుడు శివాజీ రాజా, సంగీత దర్శకురాలు శ్రీలేఖ కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన దర్శకుడు మహేష్ చంద్ర ప్రేయసి రావే సినిమాకు సీక్వెల్ చేస్తానని వెల్లడించారు. 'ప్రేయసి రావే' నాకు ఈ లైఫ్ ఇచ్చింది. ఆ టీంతో మా 'పిఠాపురంలో అలా మొదలైంది' ట్రైలర్ లాంచ్ అవ్వడం నాకు చాలా ఆనందంగా ఉంది. నాకు ఈ ప్రయాణంలో సహకరించిన శ్రీకాంత్ , శివాజీ రాజా , పృథ్వీ , శ్రీలేఖకి థాంక్స్. 'ప్రేయసి రావే 2' కథ కూడా రెడీ చేశాను. 'ప్రేయసి రావే' చిత్రీకరణ సమయంలో ఎలాంటి ఫీల్ అయితే వచ్చిందో.. 'పిఠాపురంలో అలా మొదలైంది' టైంలోనూ అదే ఫీలింగ్ వచ్చింది. ఇప్పటి వరకు మూవీని చూసిన ప్రతీ ఒక్కరూ క్లైమాక్స్‌కి ఎమోషనల్ అయ్యారు. ముగ్గురు హీరోలు, ముగ్గురు హీరోయిన్లు అద్భుతంగా నటించారు. శ్రీరామ్ గొప్ప డైలాగ్స్ రాశారు. ముగ్గురు నిర్మాతలు నాకెంతో సహకరించారు. ప్రతీ ఇంట్లో జరిగే సంఘటనలతోనే ఈ మూవీని చేశాం. సినిమాని చూస్తే "ఇది మా ఇంట్లోనే జరిగినట్టు ఉందే అని ఫీల్ అవుతారు. అందరినీ ఆకట్టుకునేలా ఈ చిత్రం ఉంటుంది". అని అన్నారు. డాక్టర్ రాజేంద్రప్రసాద్, పథ్వీరాజ్, కేదార్ శంకర్, మణి చందన, అన్నపూర్ణమ్మ, సన్నీ అఖిల్, విరాట్, సాయి ప్రణీత్, శ్రీలు, ప్రత్యూష, రెహానా ప్రధాన పాత్రల్లో నటించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో హీరో శ్రీకాంత్, నటుడు శివాజీ రాజా, నటుడు పృథ్వీ, మ్యూజిక్ డైరెక్టర్ ఎం.ఎం. శ్రీలేఖ, హీరో విరాట్ పాల్గొన్నారు.

## ఇది ఉద్యమ నామ సంవత్సరం

(మొదటి పేజీ తరువాయి)

అందిస్తామని ఇటీవల బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి అసెంబ్లీ సాక్షిగా ప్రకటించారని అర్హులైన వారికి ఆ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వానికి ప్రజలకు మధ్య సిపిఐ పార్టీ కార్యకర్తలు వారదుల్లా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ఇటీవల శాసనసభలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆశా నిరాశల మధ్య ఉన్నదని కొత్త పథకాలు ప్రవేశపెట్టడం హర్షించదగ్గ పరిణామమే అయినప్పటికీ అనేక పథకాలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని ముఖ్యంగా జనాభాలో అధిక శాతం ఉన్న బిసిల సంక్షేమం కోసం కేవలం 12వేల కోట్లు మాత్రమే కేటాయించడం బాధకరమని అన్నారు. మే నెల మొత్తం కూడా క్షేత్రస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి నేతల వరకు జరిగే రాజకీయ శిక్షణ తరగతుల్లో పాల్గొని పోరాట పటిమను చాటి జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు కార్యకలాపాల నివేదికను భవిష్యత్ కార్యక్రమాలను ప్రవేశపెట్టారు. ఈ సమావేశానికి కంబాల శ్రీనివాస్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో యల్లావుల రాములు, దూళిపాల ధనుంజయనాయుడు, మేకల శ్రీనివాసరావు, యల్లంల యాదగిరి, మండవ వెంకటేశ్వర్లు, బద్దం కృష్ణారెడ్డి, పోకల వెంకటేశ్వర్లు, బత్తినేని హనుమంతరావు, బూర వెంకటేశ్వర్లు, గుండు వెంకటేశ్వర్లు, నంద్యాల రామిరెడ్డి పాల్గొన్నారు.

## బిసి సబ్ ప్లాన్ చట్టం చేయాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

జనాభాకు కేవలం 3.8 శాతం నిధులు కేటాయించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. వి.హనుమంతరావు మాట్లాడుతూ రాహుల్ గాంధీ ఎవరి వాటా వారికి దక్కాలని సూత్రం రాష్ట్రంలో అమలు కావడం లేదని, జనాభా లెక్కల ప్రకారం బిసిలు 56శాతం ఉంటే బడ్జెట్‌లో నిధులు అతి స్వల్పంగా కేటాయించి నందుకు తాను సిగ్గుపడుతున్నానని ఆయన అన్నారు. ఈ సమావేశంలో జాజుల లింగం గౌడ్, కోల జనార్దన్, బొల్లేపల్లి స్వామి తదితరులు పాల్గొన్నారు.

## నీటిని పొదుపుగా వినియోగించుకోవాలి

**జల దినోత్సవంలో పాల్గొన్న మంత్రి సీతక్క, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**

**ప్రజాపక్షం/ఆత్మకూరు :** మానవ మనుగడకు నీరు అనేది ప్రాణాధారమని, నీటిని పొదుపుగా వి నియోగించుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రా మీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. ఆదివారం అంతర్జాతీయ జల దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం తిరుమలగిరి గ్రామంలో గ్రామ సర్పంచ్ దేవేంద్ర అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మంత్రి సీతక్కతో పాటు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి పాల్గొన్నారు. ఈ సందర్భం గా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రతి నీటి బొట్టు ఎంతో విలువైనదని, ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించుకోకపోతే రానున్న రోజుల్లో మానవ మనుగడకే ముప్పు ఏర్పడుతుందన్నారు. రాష్ట్ర ప్రభు త్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామాలలో పలు కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, దీనిలో భాగంగా ప్రపంచ నీటి దినోత్సవాన్ని నేడు జరుపుకోవడం గొప్ప విషయమని అన్నారు. ప్రతి ఒక్కరు నీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడుకున్నప్పుడే భావితరాలకు నీటి ఇబ్బందులు ఏర్పడవని పేర్కొన్నారు. భూగర్భ జలాలు పెరిగేందుకు ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసర ప్రాంతాల్లో ఇం కుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. విచ్చలవిడిగా నీటిని వృధాచేయడం వల్ల నీటిని కొనుక్కునే



పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. చెట్లు పెంచని పక్షంలో రానున్న రోజుల్లో గాలిని సైతం కొనాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాలకు సమీపంలోని చెరువులను కాపాడుతూనే అడవులను కాపాడుకోవాలని, సూచించారు. గ్రామాలలో మిషన్ భగీరథ ద్వారా మంచినీటి సరఫరా జరుగుతుందని తెలిపారు. వాటర్ ప్లాంట్లపై ఆధారపడకుండా గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేస్తున్న నీటిని వినియోగించుకోవాలని కోరారు. ప్రతి గ్రామంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేస్తున్న శుద్ధమైన నీరు వినియోగంపై ప్రజలకు విస్తృతమైన అవగాహన కల్పించాలని ఆదేశించారు. అదేవిధంగా పంటలకు అధిక రసాయనిక ఎరువులను వినియోగిస్తున్నారని, వాటి వినియోగాన్ని తగ్గించుకోవాలని రైతులకు సూచించారు. రసాయనిక ఎరువులు వినియోగం పెరగడంతో క్యాన్సర్, ఇతర అనారోగ్యసమస్యలకు కారణమవుతున్నాయన్నారు.

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో మిషన్ భగీరథ నీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జీవనానికి మూలాధారమైన పంచభూతాలైన గాలి, నీరు, నిప్పు, ఆకాశం, భూమిని పరిశుభ్రంగా ఉంచితే మనతోపాటు భవిష్యత్ తరాలకు అంతా మేలు కలుగుతుందన్నారు. రాబోయే తరాలకు పర్యావరణం పంచభూతాలను పరిరక్షించుకోవాల్సిన ఆలోచన ప్రతి ఒక్కరిలో రావాలన్నారు. విలువైన నీరును వృధా చేయవద్దని సూచించారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషిచేస్తున్నాయ న్నారు. నీటిని పొదుపుగా వాడుతూ భవిష్యత్ తరాలకు అందించే బాధ్యత అందరిపై ఉందన్నారు.

హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ జిల్లాలోని గ్రామాలకు ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నల్ల కనెక్షన్ ఇచ్చి శుద్ధమైన నీటిని సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. రానున్న రోజుల్లోనూ గ్రామాల్లో తాగునీటి సరఫరాకు ఎక్కడ కూడా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. మిషన్ భగీరథ ద్వారా పంపిణీ చేస్తున్న శుద్ధ నీరు, ప్రైవేట్ వాటర్ ప్లాంట్ల నుండి వినియోగించే నీరు గురించి అధికారులు డెమో ప్రదర్శించారు.

ఈ కార్యక్రమంలో పరకాల ఆర్డీఓ డాక్టర్ కన్నం నారాయణ, మిషన్ భగీరథ ఈఈ గాయత్రి, స్థానిక తహసిల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఎంపిడిఒ శ్రీనివాస రెడ్డి, ఇతర అధికారులతో పాటు స్థానికులు పాల్గొన్నారు.

## 48 గంటలే గడువు

(మొదటి పేజీ తరువాయి)

హెచ్చరిక జారీ చేశారు. ఇరాన్ కూడా ఎంతమాత్రం వెనక్కు తగ్గకుండా అమెరికా స్థావరాలు సహా పశ్చిమాసియాలో ఉన్న ఇంధన కేంద్రాలు, మౌలిక వసతులన్నింటినీ ధ్వంసం చేస్తామని ప్రతి హెచ్చరిక జారీ చేసింది. ఇజ్రాయెల్ రాజధాని టెల్‌అవీవ్ ఇరాన్ క్షిపణులు,డ్రోన్ల దాడులు,పేలుళ్ళతో దద్దరిల్లింది. దక్షిణ ఇజ్రాయెల్ అరద్ నగరంలో ఇరాన్ క్షిపణులు తీవ్ర విధ్వంసం సృష్టించిన తర్వాత ప్రధానమంత్రి నెతన్యాహూ ఆ ప్రదేశం నుండి ఆదివారం తాజా ప్రకటన చేస్తూ, ప్రపంచదేశాలన్నీ ఇరాన్‌కు వ్యతిరేకంగా యుద్ధంలో చేరాలని పిలుపు ఇచ్చారు. మరికొన్ని దేశాలు ఇప్పటికే ఆ దిశగా ముందుకు కదులుతున్నాయన్నారు. ఇరాన్‌ను ఓడించి హోర్ముజ్ జలసంధిని తెరపించేందుకు, దాడులు ఆపేందుకు ఇరాన్ వ్యతిరేక యుద్ధంలో చేరాలని కోరారు. ఇజ్రాయెల్‌లో సామాన్య పౌరులను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ విధ్వంసానికి పాల్పడుతోందన్నారు. ప్రపంచవ్యాప్తంగా చాలా సుదూరంలో ఉన్న లక్ష్యాలపై దాడులు చేయగల సామర్థ్యాన్ని ఇరాన్ సమకూర్చుకుందని పేర్కొన్నారు. కాగా ఈద్‌-అల్‌-ఫితర్ ప్రార్థనల సందర్భంగా ఇజ్రాయెల్ పవిత్ర పురాతన నగరం జెరూసలెంలో ముస్లిం,క్రిస్టియన్,యూదులకు చెందిన ప్రార్థనాలయాలున్న ప్రదేశాలకు కొన్ని వందల మీటర్ల సమీపంలో ఇరాన్ ఆదివారం క్షిపణి దాడులు చేసింది. దీంతో ఆ ప్రాంతంలో దట్టంగా పొగలు కమ్ముకున్నాయి. ప్రజలు ఆందోళనతో పరుగులు తీశారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన అల్‌-అక్సా మసీదుకు 400 మీటర్ల దూరంలో ఈ దాడి జరిగింది. బాగ్దాద్ విమానాశ్రయం సమీపంలో ఉన్న అమెరికా దౌత్యకార్యాలయం,సైనికస్థావరాలపై మూడు ఇరాన్ క్షిపణులు దాడి చేశాయి. యుద్ధం మూడువారాలు పూర్తిచేసుకుని నాలుగోవారంలోకి ప్రవేశించిన తర్వాత 23వ రోజు ఆదివారం మరిన్ని క్లస్టర్ బాంబులతో కసిదీరా దక్షిణ ఇజ్రాయెల్ పట్టణాలపై ఇరాన్ డ్రోన్లు, క్షిపణులతో భీకర దాడులు చేస్తోంది. సెంట్రల్ ఇజ్రాయెల్‌లో పలు ప్రాంతాలపై ఇరాన్ ఆయుధ వర్షం కురిపించడంతో అనేకమంది గాయపడుతున్నారు. ఇజ్రాయెల్ అణు విద్యుత్ కేంద్రం సమీపంలో క్షిపణి దాడులు జరిగాయి. ఇజ్రాయెల్ నగరం డిమోనా శివారు ప్రాంతంలో ఈ క్షిపణి దాడులు జరిగాయి. దీంతో ఇజ్రాయెల్ గగనతల రక్షణ కవచవ్యవస్థ విఫలమైందనే ఆందోళన చెలరేగింది. ఇరాన్ దాడులతో దక్షిణ ఇజ్రాయెల్ పట్టణాలలో తీవ్ర నష్టం వాటిల్లింది. ఇళ్ళ భవనాలు ధ్వంసమయ్యాయి. ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్ళాలని హెచ్చరిస్తూ పలు పట్టణాలలో సైరన్ల మోతలు మోగాయి. నతాంజ్‌పై దాడికి ప్రతిగా ఇజ్రాయెల్ అణు సంబంధ ప్రాంతాలపై ఎదురుదాడులు చేసినట్లు ఐఆర్‌జిసి ప్రకటించింది. ఇరాన్ ప్రయోగిస్తున్న బాలిస్టిక్ క్షిపణులను సౌదీఅరేబియా కూల్చివేస్తోంది. రాజధాని రియాద్‌లో ఇరాన్ క్షిపణులను అడ్డుకుని కూల్చివేశారు. మరోవైపు సైప్రస్‌లోని బ్రిటన్ స్థావరాలపై హెజ్బొల్లా ఉగ్రవాదులు తమ దాడులు ఉధృతం చేశారు. దీంతో ఈ పరిస్థితిని సమీక్షించేందుకు బ్రిటన్ అధ్యక్షుడు స్టార్మర్ తక్షణ సమావేశం నిర్వహించారు. అరేబియా సముద్రంలోకి బ్రిటన్ అణు జలాంతర్గామి ప్రవేశించింది. పశ్చిమాసియాలో యుద్ధం మహోధృతంగా ప్రమాదకర స్థాయిలో విస్తరిస్తుండగా, స్పెయిన్ మాత్రం గల్ఫ్ ప్రాంతం నుండి వెనక్కు వైదొలగడం ప్రారంభించింది. మరోవైపు అమెరికా,ఇజ్రాయెల్ మాత్రం శుద్ధిచేసిన యురేనియం జాడలు తెలుసుకునేందుకు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. పశ్చిమాసియాలో అమెరికా స్థావరాలున్న దేశాలపై ఇరాన్ దాడులు ఆగకుండా కనసాగుతున్నాయి. బాగ్దాద్‌లో సైనిక కేంద్రాలపై ఇరాన్ క్షిపణి దాడులతో బీభత్సం సృష్టించింది. దక్షిణ ఇజ్రాయెల్ పట్టణాలలో వరుస క్షిపణి ప్రయోగాలు,క్లస్టర్ బాంబులతో నెతన్యాహూ ప్రభుత్వాన్ని భయభ్రాంతులకు గురిచేసింది.నిషేధిత క్లస్టర్ బాంబుల ప్రభావం వల్ల 100మంది ఇజ్రాయెలీ పౌరులు గాయపడ్డారు. దిమోనా,అరద్ ప్రాంతాలలో ముందురోజు శనివారం ఇరాన్ దాడుల్లో కూడా 200 మంది ఇజ్రాయెలీ పౌరులు గాయపడ్డారు. ఈ ప్రాంతాలన్నీ పేలుళ్ళతో దద్దరిల్లాయి. దిమోనాలో 78మంది, అరద్‌లో 84 మంది తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నారు. ఇజ్రాయెల్‌కు చెందిన ఎఫ్‌-16 యుద్ధ విమానాన్ని డ్రోన్ దాడుల్లో కూల్చివేసినట్లు ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జిసి)ప్రకటించింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌పై ఇరాన్ దాడులను ఆపకుండా అదేపనిగా కొనసాగిస్తుండగా, ఆ దేశం కూడా తీవ్రంగా ప్రతిఘటిస్తోంది. ఇరాన్ డ్రోన్లు, క్షిపణులను అడ్డుకుని కూల్చివేస్తోంది. యుద్ధం మొదలైనప్పటినుండీ ఈనాటి వరకూ వందలాది డ్రోన్లు, క్షిపణులను కూల్చివేసినట్లు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రకటించింది. అదేవిధంగా ఇరాక్‌లో ఉన్న ఇరాన్ అనుబంధ ఉగ్రవాద సంస్థలు గడచిన 24 గంటల్లో 21 సార్లు అమెరికా స్థావరాలపై దాడులు చేశాయి. లెబనాన్ కేంద్రంగా పనిచేస్తున్న హెజ్బొల్లా ఉగ్రవాద సంస్థ కూడా ఇజ్రాయెల్‌పై గడచిన 24 గంటల్లో 55 దాడులు చేసినట్లు ప్రకటించింది. బీరూట్‌లో కూడా ఇజ్రాయెల్ సేనలు ఆదివారం కూడా తీవ్రస్థాయిలో దాడులు కొనసాగించాయి.

## సుస్థిర భవిష్యత్తు

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. ఆదివారం గోవిందరావుపేట మండలం పస్రా అటవీ శాఖ కార్యాలయంలో ప్రపంచ అటవీ దినోత్సవ సందర్భంగా ఏర్పాటుచేసిన అడవుల సంరక్షణ..అవశ్యకత అవగాహన ర్యాలీ కార్యక్రమంలో మంత్రి సీతక్క , జిల్లా కలెక్టర్ దివాకర ఎస్, ఎస్‌పి సుధీర్ రామ్నాథ్ కేకన్, డిఎఫ్ఓ రాహుల్ కిసన్ జాదవ్‌లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ స్వచ్ఛమైన ప్రాణవాయువుకు అడవులే మూలాధారమని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా మొక్కలను నాటాలని అడవుల సంరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. రాష్ట్రంలోనే అత్యధిక అటవీ విస్తీర్ణం కలిగిన జిల్లాగా ములుగు జిల్లా ప్రథమ స్థానంలో ఉందని స్పష్టం చేశారు. పంటలు సమృద్ధిగా పండాలన్న రైతులకు సరిపడా వర్షపాతం నమోదు కావాలన్నా అడవులే కీలక పాత్ర పోషిస్తాయని అడవులు అంతరించిపోతే మానవ మనుగడ సైతం అంతరించిపోతుందని తెలిపారు. ఛత్తీస్‌గడ్ ప్రాంతంలో ఇప్ప చెట్లను దైవంగా భావిస్తూ వాటిని అక్కడి ప్రజలు సంరక్షించుకుంటారని అన్నారు. అడవుల ద్వారా గిరిజనులకు గిరిజనేతరులకు అనేక లాభాలు ఉంటాయని స్థానిక గిరిజనులు సైతం అటవీ ఉపాధి పొందుతున్నారని అన్నారు. అడవిని సంరక్షించడంలో అటవీశాఖ అధికారులకు స్థానిక ప్రజలు యువకులు సహాయ సహకారాలు అందించినప్పుడు పూర్తి స్థాయిలో అడవుల రక్షణ సాధ్యమవుతుందని తెలిపారు. కొంత మంది స్వలాభం కోసం వేసవి కాలంలో అడవులకు నిప్పు పెట్టడం వలన మొక్కలు, ఔషధ గుణాలున్న చెట్లు కాలిపోతున్నాయని, వన్య ప్రాణులను వేటాడడం, చెట్లను నరకడం వంటి కార్యక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ములుగు జిల్లా ప్రకృతి రమణీయమైన జిల్లాగా పేరు ప్రఖ్యాతలు సంపాదించుకుందని ప్రసిద్ధి చెందిన పర్యాటక ప్రాంతాలు దట్టమైన అటవీ ప్రాంతాలలో ఉండడంతో అనేక మంది పర్యాటకులు ములుగు జిల్లా అందాలను తిలకించడానికి వస్తున్నారని అన్నారు. అటవీ దినోత్సవం వేడుకలకే పరిమితం కాకూడదని, ప్రతి ఒక్కరూ తమ ఇంటి ముందు, రోడ్డు పక్కన, చెరువు గట్ల వెంట మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని మంత్రి కోరారు. ములుగు జిల్లాను అటవీ సంరక్షణలో దేశానికే ఆదర్శంగా నిలబెట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం పస్రా గ్రామంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంలో రూ.35లక్షల నిధులతో రాజీవ్ కాలనీకి అంతర్గత సిసి రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి సీతక్క శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, శిక్షణ ఐఎఫ్ఎస్ ప్రథమేష్ కేశవ్, తాడ్వాయి ఎఫ్‌డిఓ వజ్రారెడ్డి, ఏటూరునాగారం ఎఫ్‌డిఓ రమేష్, పస్రా సర్పంచ్ సుమలత, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు, అటవీ శాఖ సిబ్బంది, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com